www.jagritiweekly.com
సంపుటి : 75 సంచిక : 21 పుటలు : 52

# జాగృతి

కలి 5124 - శ్రీ శుభకృత్ ఫాల్గుణ బహుళ షష్ఠి
13-19 మార్చి 2023
వెల : ₹15/-




# విప్లవాత్మక విజయం


త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ తాజా ఎన్నికల ఫలితాలు,
అందులో  కమల వికాసం ఎన్నో అంశాలను వెల్లడిస్తాయి


జాగృతి చందాను  చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

75 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక


# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు
















| వెల : ₹.200/- | వెల : ₹.200/- | వెల : ₹.390/- | వెల : ₹.300/- | వెల : ₹.200/- |
|---|---|---|---|---|

















| వెల : ₹.200/- | వెల : ₹.200/- | వెల : ₹.200/- | వెల : ₹.250/- | వెల : ₹.250/- |
|---|---|---|---|---|












| వెల : ₹.599/- | వెల : ₹.695/- | వెల :₹.799/- | వెల : ₹.799/- | వెల : ₹.549/- |
|---|---|---|---|---|

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**


ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.

040-27563236, 9290127329

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 63035 41244

ఆసక్తి కలిగించే విశ్లేషణలు.. జాగృతపరిచే కథనాలు..
చైతన్యం నింపే వాస్తవాలు.. స్ఫూర్తిని నింపే రచనలతో
ఇపుడు జాగృతి వారపత్రిక మరింత కొత్తగా మీ ముందుకు వస్తున్నది.




రండి..
జాతీయభావాల వేదిక
జాగృతి చందాదారులుగా
చేరుదాం.. చేర్పిద్దాం!

**ఏప్రిల్ 1, 2023 నుండి జాగృతి వార్షిక,**
**5 సంవత్సరాల చందా పెరగనున్నది..**

ఒక సంవత్సర చందా
**రూ.850/-**

విడి ప్రతి
**రూ.20/-**

ఐదు సంవత్సరాల చందా
**రూ.4000/-**

జాగృతి చందాను ఆన్‌లైన్‌లో మీ మొబైల్ నుంచి చెల్లించడానికి
ఇక్కడ ఉన్న క్యు.ఆర్. కోడ్‌లను
గూగుల్ సెర్చ్‌బార్‌లో ఉండే గూగుల్ లెన్స్‌తో స్కాన్ చేయండి.
లేదా క్రిందనున్న లింక్‌లను ఉపయోగించండి.

ఒక సంవత్సర చందా రూ.650/-
http://payit.cc/S18970

**Jagriti Bank A/c details :**
Jagriti Prakashan Trust,
A/c No.920010061405325,
Axis Bank, Kothapet Branch, Hyderabad.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

ఐదు సంవత్సరాల చందా రూ.3000/-
http://payit.cc/S18973

3-4-228/4/1, Kachiguda, Hyderabad-500027.
Ph : 040-27561453, 9959997013. email : jagritiweeklysub@gmail.com

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013

## జాగృతి చందా – సూచనలు

**5 సం॥ల చందా రూ.3000, సంవత్సర చందా రూ.650, విడి ప్రతి రూ.15**

- అడ్రసులో పేరు, ఇంటి నెం., గ్రామం, మండలం, జిల్లా, పిన్‌కోడ్, మొబైల్ నెం. సమగ్రంగా ఉండాలి. లేకుంటే కంప్యూటర్ ఆమోదించదు.
- తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీకు ఎస్.ఎం.ఎస్. చేస్తాం. ఆ వెంటనే సంచిక కూడా అందుతుంది. మీరు చందా నెం. నోట్ చేసుకోవాలి.
- పత్రిక అందకపోతే వెంటనే సంప్రదించగలరు. చిరునామా మారితే కార్యాలయానికి విధిగా తెలపండి.

**చందా కట్టించే వారికి సూచనలు :**

- చందాలు వసూలు చేసి పంపేవారు తమ పూర్తిపేరు, సెల్ నెం. రాయాలి.
- రశీదుపై చందాదారుని పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెం., ఈమెయిల్ ఉండాలి. వివరాలు jagritiweeklysub@gmail.comకు మెయిల్ చేయాలి.
- ఆన్‌లైన్/చెక్ ద్వారా కూడా చెల్లించవచ్చు. డబ్బు పంపాక 040-27561453/ 9959997013 నంబర్లకు తెలియజేయాలి.
- మరిన్ని వివరాలకు చందాపుస్తకంలో మొదటి రసీదు వెనుక చూడగలరు.

**చందా పంపవలసిన చిరునామా :**

- 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

**జాగృతి బ్యాంకు ఖాతా వివరాలు :**

- **A/c Name & No. Jagriti Prakashan Trust, 92001006140 5325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**
- చెక్కు, డిడిపై **Jagriti Prakashan Trust** అని ఆంగ్లంలో రాయాలి.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి | అసోసియేట్ ఎడిటర్ | |
| కె. హరీష్ | సబ్ ఎడిటర్ | 9959991304 |


డిజైనర్ : సిహెచ్. కుమార్

భారత్ జోడో యాత్ర చేయడం వెనుక ఎంతటి మహత్తర ఉద్దేశం, సందేశం దాగి ఉన్నవో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ విశ్వ మానవాళి ఎదుట పెట్టారు. భారతదేశంలో చచ్చిపోతున్న ప్రజాస్వామ్యానికి మళ్లీ ఊపిరి పోయడానికే యాత్ర చేశారట. నిర్వీర్యమైపోతున్న వ్యవస్థలను చేతులడ్డి కాపాడడానికి, భారత్ సామాజిక వ్యవస్థకు మరమ్మతు చేయడానికి గెడ్డం చేసుకోకుండా యాత్ర చేశారట. ఇవన్నీ వెల్లడించడానికి ఆయన ఎంచుకున్న వేదిక-కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం. అక్కడే ఎందుకు? భారతదేశంలో చెబితే ఎవరూ నమ్మరని ఆయన గట్టి విశ్వాసం కాబోలు. రాహుల్‌కి భవిష్యత్తును ముందే చూసే దివ్యశక్తులు ఉన్నాయనే అనుకోవాలి. మూడు రాష్ట్రాల శాసనసభల కోసం 179 స్థానాలకు ఎన్నికలు జరిగితే ఈశాన్య భారతవాసులు అందులో 8 మాత్రమే కాంగ్రెస్‌కు ముష్టి వేస్తారని ఆయనకి భవిష్యద్దర్శనం అయిపోయి ఉండాలి. అది చూడలేకే కాబోలు సాంత్వన కోసం కేంబ్రిడ్జ్ పారిపోయారు.

సందు దొరికితే చాలు, భారతీయ జనతా పార్టీని అడ్డం పెట్టుకుని అంతర్జాతీయ వేదికల మీద భారత్‌ని ఆడిపోసుకోవడం రాహుల్‌కి ఒక రోగంలా పరిణమించింది. పొరుగున ఉన్న చైనాను స్తుతించడం కూడా ఆ రుగ్మత లక్షణమే. తన జోడో యాత్ర కశ్మీర్ చేరినప్పుడు అక్కడన్నీ భారత జాతీయ పతాకాలు కనిపించడంతో రాహుల్‌కు పైత్యం ప్రకోపించి పాత రుగ్మత ఇంకాస్త ముదిరినట్టే ఉంది. భారతదేశంలో ప్రజాస్వామ్యం కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నదని ఆయన పదేపదే తీర్పు ఇస్తున్నారు. అందుకే కాబోలు, కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 4000 కిలోమీటర్ల భారత్ జోడో యాత్ర జరిగితే ఒక్క ప్రతిఘటన కూడా ఎదురుకాలేదు. బీజేపీ బలంగా ఉన్న రాష్ట్రాలలో కూడా సహాయ నిరాకరణ జరగలేదు. రాహుల్ అబద్ధాలు, కువ్యాఖ్యలు భారతీయులలో బీజేపీ పట్ల వ్యతిరేకతను కాదు, సొంత పార్టీ ఎడల జుగుప్స రేపుతున్నాయి. అధికారంలో ఉన్న పార్టీని ఇరుకున పెట్టడానికి పుల్వామా దాడి అంశం పాకిస్తాన్‌కు అనుకూలించే విధంగా అవమానకరమైన

**శాలివాహన 1944 శ్రీ శుభకృత్ ఫాల్గుణ బహుళ షష్ఠి**

### లోపలి పేజీలలో...



ముఖపత్ర కథనం

**విప్లవాత్మక విజయం**

6లో



ముఖాముఖీ

**వ్యాక్సిన్ లేని ఆధునిక ప్రపంచాన్ని ఊహించలేం!**

13లో



ధారావాహిక నవల

**వరాహమిహిర**

– పాలంకి సత్య

20లో

# జాగృతి

## సంపాదకీయం

వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇది భారత సేనలను కించపరచడమని ఆయనకి ఎప్పటికి అర్ధమవుతుందో తెలియదు. పెగసస్ సాఫ్ట్‌వేర్‌తో బీజేపీ ప్రభుత్వం తన ఫోన్ సంభాషణలు వింటోందని రాహుల్ గట్టి నమ్మకం. తనను విచారించిన అధికారులే ఆయనకు అలా ఉప్పందించారట కూడా. అందుకే పెగసస్ ప్రహసనం గురించి బీజేపీ ఒక ప్రశ్న అడిగింది. ఈ వ్యవహారం మీద సుప్రీం కోర్టు ఒక కమిటీని నియమించి, మీ మీ మొబైల్ ఫోన్లన్నీ అప్పగించవలసిందని ఆదేశించి నప్పుడు రాహుల్ గాంధీ, ఇతర బాకారాయుళ్లు ఎందుకు ఉడాయించారు?

## ఈ రుగ్మతకు మందులేదా?

యథాప్రకారం సమాధానం లేదు. చైనా ఒక ప్రత్యేక దేశం, పైగా అది సామరస్య స్థాపన కోసం పడి చచ్చిపోయే దేశం, ఎల్లో రివర్ చైనాను ఒక జాతిగా నిలబెట్టింది, అసలు భారత విదేశాంగ మంత్రికి చైనా అర్థం కాలేదని కూడా కాంగ్రెస్ యువరాజు పనిలో పనిగా తేల్చి పారేశారు. దీనికి సంబిత్ పాత్ర ఇచ్చిన సమాధానం గురించి మనం మాత్రమే ఆలోచించగలం. ఎందుకంటే రాహుల్, ఆయన రాజకీయ గురువు దిగ్విజయ్ సింగ్, అనుయాయులు మణిశంకర్, జైరాం రమేశ్ వీళ్లంతా విమర్శలు గుప్పిస్తారే తప్ప, వాటిలో నిజమెంతో తేల్చమంటే నాలుక మడతేస్తారు. వారంతా బాధ్యతారాహిత్యానికి బ్రాండ్ అంబాసిడర్లే. రాహుల్ ఎల్లో రివర్‌ను చూశారు గానీ, గంగానదిని చూడలేదు కదా అంటూ సంబిత్ పెద్ద చురకే వేశారు. నోరు విప్పితే చాలు రాహుల్, ఆయన పార్టీ సభ్యులు దేశంలో మైనారిటీల మీద దాడులు జరిగిపోతున్నాయంటూ శోకాలు పెడతారు. క్రమం తప్పకుండా ఇప్పుడు కూడా రాహుల్ కేంబ్రిడ్జ్‌లో మైనారిటీల తరపున వకాల్తా తీసుకోవడం మరచిపోలేదు. కానీ సర్ తన్‌సే జుదా అంటూ దేశంలో వీరంగం వేసిన మతోన్మాదుల గురించి ఆయన ఒక్కమాట కూడా ఎందుకు చెప్పరు? కొన్ని ముస్లిం దేశాలు కూడా విద్యాసంస్థలలో హిజాబ్ ధారణను నిషేధిస్తే భారత్‌లో దానిని పట్టుకు వేలాడుతూ, బాలికల విద్య మీద ముసుగులు వేస్తున్న వాస్తవాన్ని ఎందుకు పట్టించుకోరు? మోదీ వచ్చిన తరువాత మత ఘర్షణలు తగ్గిన మాట వాస్తవమా, కాదా? 1984 నాటి సిక్కుల హత్యాకాండ, ముంబై దాడులు, భాగల్పూర్ దాడులు, ఇంకా ఎన్నో ఆ పార్టీ అధికారంలో ఉండగానే జరిగాయి. వాటి గాయాలు ఇప్పటికైనా మానాయా?

ప్రత్యర్థి పార్టీని విమర్శించడం వేరు. స్వదేశాన్ని విదేశీ గడ్డ మీద దూషించడం వేరు. ఏడు దశాబ్దాలలో కాంగ్రెస్ చేసింది సున్న అంటూ మోదీ విమర్శించలేదా అంటారు రాహుల్. కానీ మోదీ విమర్శలలో దేశ ప్రతిష్టను కించపరిచే మాటలు చూపగలరా? సైన్యాన్ని నిందించే నీచత్వం ఉందనగలరా? రాహుల్ కోసమే అన్నట్టు, మోదీని తూర్పార పట్టడానికే అన్నట్టు ఉండే ఆ ప్రశ్నలలో పస ఎంతో ఇంగ్లండ్‌లోని భారతీయ జర్నలిస్టుల సంఘానికి తెలియదా? అంతర్జాతీయ వేదికలు ఎక్కి భారత్ మీద అభాండాలు కురిపించే పని పాకిస్తాన్ చేస్తుంది. తుర్కియే, ఇరాన్ వంత పాడుతూ ఉంటాయి. వీలు కుదిరినప్పుడల్లా చైనా తన ద్వేషాన్నీ, పాకిస్తాన్ విషాన్నీ కలిపి జమిలిగా ఆ వేదికల మీదే కక్కుతూ ఉంటుంది. ఈ శత్రురాజ్యాలతో సమంగా రాహుల్ కూడా అంతర్జాతీయ వేదికలను ఎంచుకుని భారత్ మీద విమర్శలు కురిపిస్తున్నారు. ఒకప్పుడు చైనా మీద వామపక్ష తీవ్రవాదులు, సీపీఎం ఒలకబోసిన ప్రేమానురాగాలనే రాహుల్ నిస్సిగ్గుగా ప్రదర్శిస్తున్నారు. కేంబ్రిడ్జ్‌లో ఉపన్యాసం దంచడానికి వెళుతున్నప్పుడు రాహుల్ గెడ్డం ట్రిమ్ చేయించుకున్నందుకు ఆంగ్లేయులు సంతోషపడి ఉంటారు. అలాగే మెదడును కూడా కాస్త ట్రిమ్ చేయించుకుంటే భారతీయులూ సంతోషిస్తారు. ★

13 మార్చి 2023, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్



38లో

కథ

**రాతి మనుషులు**

– మద్దిలి కేశవరావు





| | | |
|---|---|---|
| పెట్టుబడుల సదస్సా? ఎన్నికల ప్రచారమా? (వేదిక) | – | 16 |
| పెంచిపోషించిన ఉగ్రవాదమే పెనువిపత్తుగా మారి.. (జాతీయం) | – | 23 |
| చరిత్రకర్తలు ఈ నాయకీమణులు (మహిళ) | – | 26 |
| వ్యక్తిగత లబ్ధి కన్నా జనసంక్షేమం మిన్న (అమృతోత్సవాలు) | – | 28 |
| పునరుజ్జీవం! (కథ) – కె.వి. లక్ష్మణరావు | – | 30 |
| ఆటగాళ్ల దశను మారుస్తున్న కబడ్డీ! (క్రీడ) | – | 33 |
| ఇవేం చదువులు? (తెలంగాణ) | – | 36 |
| పక్కా ప్రణాళికతో విజయపథంలో ‘బలగం’ (సినిమా) | – | 43 |



తాజాగా జరిగిన మూడు ఈశాన్య రాష్ట్రాల శాసనసభల ఎన్నికలలోనూ బీజేపీ మళ్లీ సత్తా చాటుకున్నదంటూ సాధారణ విశ్లేషణకు ఎవరూ పరిమితం కాలేరు. ఆ ఫలితాలు యాంత్రికమైన వ్యాఖ్యానాలకూ, పడికట్టు పదాల వార్తా కథనాలకూ అందేవి కావు కూడా. ఢిల్లీ తమకు సుదూరమని మొత్తం ఈశాన్య భారతంలోని ఏడు రాష్ట్రాలలో కనీసం ఆరు దృఢంగా విశ్వసించిన కాలం ఒకటి ఉండేది. భారతదేశం తమ మాతృభూమే కాదని, అది వేరే దేశమని ఆ ప్రాంతాలు చెప్పుకున్న సమయం ఉంది. కానీ ఇప్పుడు హిందుత్వ నినాదమిస్తున్న ఏకైక పక్షం బీజేపీ, జాతీయవాదమే ఊపిరిగా సాగుతున్న కమలదళాన్ని వారు అక్కున చేర్చుకుంటున్నారు. క్రైస్తవ మిషనరీల విద్రోహపు బోధనలతో, బంగ్లా నుంచి వచ్చి తిష్ట వేసిన ముస్లింల సమస్యతో కొట్టుమిట్టాడుతున్న ఈశాన్య భారత ప్రజలు తాము ఈ దేశ పౌరులమన్న భావనకు వస్తున్నారు. ఇటీవల అస్సాం మొదలుకొని ఈశాన్య రాష్ట్రాలలో బీజేపీకి లభిస్తున్న ఎన్నికల విజయాలు ఇందుకు సాక్ష్యం పలుకుతున్నాయి. త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ తాజా ఎన్నికల ఫలితాలు, అందులో కమల వికాసం ఎన్నో అంశాలను వెల్లడిస్తాయి.

ఒకటిన్నర దశాబ్దం నుంచే బీజేపీ 'సెవెన్ సిస్టర్స్' మీద తన ప్రభావం చూపించడం ఆరంభించింది. సెవెన్ సిస్టర్స్ సిగలో కమల వికాసం ఐదారేళ్ల క్రితమే కనిపించింది. అస్సాం నుంచి అరుణాచల్ ప్రదేశ్, అక్కడ నుంచి మణిపూర్ వరకు కూడా బీజేపీ క్రమంగా విస్తరించింది. ఇక్కడ గమనించవలసిన అంశం– శతాధిక సంవత్సరాల కాంగ్రెస్‌ను, దశాబ్దాల పాటు ఏలిన వామపక్షాలను బీజేపీ మట్టి కరిపించింది. దేశ రాజకీయ భవిష్యత్తు, రాజకీయ చిత్రం ఈశాన్య భారతం ద్వారా ఈ విధంగా వ్యక్తమయింది. ఈ దేశ ప్రజల మనసుల నుంచి కాంగ్రెస్, కామ్రేడ్లు తొలగిపోతున్నారు. దేశ సమైక్యతకు దారులు విస్తరిస్తున్నాయి.

2016లో అస్సాం ఎన్నికలలో బీజేపీ హవా వీచింది. 15 సంవత్సరాల కాంగ్రెస్ పాలన అంతరించిపోయింది. 2021లో జరిగిన ఎన్నికలలో మరొకసారి బీజేపీ విజయం సాధించింది.

2016లో బీజేపీ అరుణాచల్ ప్రదేశ్‌లోకి ప్రవేశించిన తీరు నాటకీయంగా జరిగింది. అప్పుడు పెమా ఖండు ముఖ్యమంత్రి. ఆయన కాంగ్రెస్ పార్టీకి చెందినవారు. తన ఎమ్మెల్యేలందరినీ ఆయన బీజేపీలో చేర్చారు. 2017లో మణిపూర్‌ను బీజేపీ గెలుచుకుంది. ఎన్. బైరన్‌సింగ్ ముఖ్యమంత్రి అయ్యారు. ఈయన కూడా మొదట కాంగ్రెస్ పార్టీకి చెందినవారే. 2022లో మళ్లీ ఇక్కడ బీజేపీయే గెలిచింది. 2018లో కమలం మరొక రికార్డు సృష్టించింది. 25 ఏళ్ల కమ్యూనిస్టు పాలనకు పాతరేసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆ సంవత్సరమే మేఘాలయ, నాగాలాండ్‌లలో బీజేపీ మద్దతుతో ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. 2016లో అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. 60 స్థానాలకు గాను 41 చోట్ల బీజేపీ విజయం సాధించింది. సిక్కిం, మిజోరం రాష్ట్రాలు మాత్రం ఇప్పటికీ ప్రాంతీయ పార్టీల పాలనలో ఉన్నాయి.

ఈశాన్య భారతంలో కమల వికాసాన్ని అంచనా వేయడం కొంచెం క్లిష్టమైన వ్యవహారమే. అస్సాం, త్రిపుర అంటే హిందూ మెజారిటీ ఉన్న రాష్ట్రాలు. కానీ మిగిలిన ఈశాన్య భారతమంతా గిరిజనులు, క్రైస్తవులే ఎక్కువ. వీరిలో ఎక్కువ మంది గొడ్డుమాంసం తినేవారే. అదీ కాకుండా క్రైస్తవులంతా ఇంగ్లిష్ మాట్లాడతారు. ఇదంతా క్రైస్తవ మిషనరీల ప్రభావం. కానీ బీజేపీ హిందూత్వ పార్టీ. హిందీని అభిమానించే పార్టీగా ప్రచారం ఉంది. అలాగే ఆవును పవిత్రంగా భావించే పార్టీ అన్నదీ నిజం. అయినా ఈశాన్య భారత రాష్ట్రాలు ఇప్పుడు బీజేపీని ఎందుకు ఇంతగా ఆరాధిస్తున్నాయి?

భారతదేశమంటే ఢిల్లీ దాని చుట్టూ ఉండే ప్రాంతమే అని బీజేపీ భావించలేదు. ఈశాన్య భారతాన్ని కూడా ఈ దేశంలో భాగంగానే భావించింది. రాజకీయాల విషయంలో ఢిల్లీకీ, సోదరత్వం విషయంలో మనసుకీ పెరిగిపోయిన దూరాన్ని తగ్గించేందుకు హృదయ పూర్వకంగానే శ్రమించింది. అటల్ బిహారీ వాజపేయి కాలం నుంచే ఇందుకు కృషి ఆరంభమైంది. ఆయన అక్కడి వేర్పాటు వాదులతో చర్చలు జరపడానికి వెనుకాడ లేదు. చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవచ్చునన్న ఆయన నమ్మకం వమ్ముకాలేదు. వాజపేయి ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి, కొత్త చరిత్రలో మొదటి వాక్యం రాశారు. నిజమే, తాము నిర్లక్ష్యానికి గురైనామన్న భావన ఈశాన్య భారతంలో ప్రబలంగానే ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు కారణం. ఈ పరిస్థితిని క్రైస్తవ మిషనరీలు ఉపయోగించుకున్నాయి. తాము భారతీయులం



# విప్లవాత్మక విజయం

కాదు అన్న అభిప్రాయానికి అక్కడ ప్రజలు రావడమే పెద్ద విషాదం. దీనితో ఉగ్రవాదం పెరగడానికి మార్గం ఏర్పడింది. ఈ వాతావరణాన్ని సమూలంగా మార్చే పనిని వాజపేయి ప్రారంభించారు. అదే నరేంద్ర మోదీ కొనసాగించారు. ఢిల్లీకి ఈశాన్య భారతం దూరం కాదు అన్న నినాదాన్ని చిత్తశుద్ధితో వినిపించారు. నిధులు ఇచ్చి అభివృద్ధికి తోడ్పడ్డారు.

మన్మోహన్‌సింగ్ అస్సాం నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. కాంగ్రెస్ పార్టీ తరపున ప్రధాని అయ్యారు. కానీ ఆయన తన పదవీకాలంలో ఈశాన్య రాష్ట్రాలను సందర్శించింది కేవలం రెండుసార్లు. మోదీ తన ఎనిమిదేళ్ల పాలనలో 60 సార్లకు పైగా అక్కడి ప్రజలను కలుసుకున్నారు. ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధిని తన వ్యక్తిగత అజెండాగా ఆయన భావించారు. మతం అనేది బీజేపీ పక్కన పెట్టింది. అక్కడ క్రైస్తవం ఎక్కువే. అస్సాంలో అయితే బంగ్లా ముస్లింలు తిష్ట వేసుకుని ఉన్నారు. అయినా అభివృద్ధికే బీజేపీ పెద్ద పీట వేసింది. వారి ఆరాధన వేరు కావచ్చు. కానీ వారంతా భారత పౌరులు, మన సోదరులు అన్న భావనను బీజేపీ బలోపేతం చేసింది. స్థానిక పార్టీలలో భావ సారూప్యత కలిగిన పార్టీలను కలుపుకుని బీజేపీ ప్రజలకు చేరువైంది. దేశంలో మెజారిటీగా ఉన్న హిందువుల విశ్వాసం పట్ల గౌరవం, అదే సమయంలో దేశ సమగ్రత, సమగ్రాభివృద్ధి పట్ల నిబద్ధత బీజేపీలో సమంగా ఉన్నాయి. దీనిని గుర్తించడం దగ్గరే అన్ని విపక్షాలు విఫలమవుతున్నాయి. అసలు ఈశాన్య భారత సమస్యలు కాని, మిగిలిన భారతదేశం ఎదుర్కొంటున్న దారుణ సమస్యలను కాని పరిష్కరించాలన్న చిత్తశుద్ధి విపక్షాలకు, ప్రాంతీయ పార్టీలకు, ఇంకా కాంగ్రెస్ ఎక్కడుంది?

2015లో జరిగిన ఒక ఉదంతం ఇందుకు చక్కని ఉదాహరణ. హిమంత బిశ్వ శర్మ ప్రస్తుతం అస్సాం ముఖ్యమంత్రి. ఆయనను బీజేపీ ఆ స్థానంలో ప్రతిష్ఠించింది. అంతకు ముందు ఆయన కాంగ్రెస్ పార్టీ సభ్యుడే. పైగా అస్సాం మీద పట్టున్న నాయకుడు. కానీ ఆయనను రాహుల్, సోనియా దారుణంగా నిర్లక్ష్యం చేశారు. శర్మ బీజేపీలో చేరారు. అస్సాం అనేక సమస్యల కూడలి. సరిహద్దు రాష్ట్రం. ముస్లిం సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతం. వాటన్నిటి మీద శర్మకు అవగాహన ఉంది. సమస్యల పట్ల ఆయన నిశిత దృష్టి, జాతీయ సమైక్యత పట్ల నిబద్ధత, ముస్లిం సమస్య పట్ల ఉన్న తర్కం బీజేపీ గౌరవించింది. ఇప్పుడు ఆయన ప్రభుత్వ నమూనా కూడా మూడు ఈశాన్య రాష్ట్రాలలో బీజేపీ మరింత నమ్మకాన్ని పెంచింది. ఈశాన్య భారత డెమాక్రటిక్ అలయెన్స్ అనే వేదికను కూడా ఆయన స్థాపించారు. హిమంతలా ఆలోచించేవారే పేమా ఖందు, ఎన్ బైరన్‌సింగ్ కూడా. అందుకే కాంగ్రెస్‌ను వీడారు. బీజేపీ ఎదుగుతున్న కొద్దీ ఈశాన్య భారతానికి ప్రాధాన్యం కూడా పెరుగుతున్న సంగతి గమనిస్తాం. అమిత్ షా పార్టీ అధ్యక్షుడైన తరువాత ఈశాన్య భారతానికి మరింత ప్రాధాన్యం ఇచ్చారు. దీనితో పాటు 2014 నుంచి బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉండడం కూడా ప్రాంతీయ పార్టీల దృష్టిని మార్చింది. ఈశాన్య భారతంలో మొత్తం 25 లోక్‌సభ స్థానాలు ఉంటే, ఎన్‌డీఏ 18 గెలుచుకోవడం చూస్తే ఆ ప్రాంతవాసులు బీజేపీ పట్ల ఏర్పరుచుకున్న వైఖరి తెలుస్తుంది. అందులో 14 బీజేపీకే దక్కాయి. కాబట్టే వచ్చే 2024 ఎన్నికలలో కూడా బీజేపీకి ఈ ప్రాంతం ఎంతో కీలకం కానున్నది.

ఈశాన్యంలోని ఆ ఏడు రాష్ట్రాలలో అస్సాం, అరుణాచల్‌ప్రదేశ్, త్రిపుర, మణిపూర్‌లలో రెండోసారి బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. నాగాలాండ్, మేఘాలయలో బీజేపీతో కూడిన సంకీర్ణ ప్రభుత్వాలు మళ్లీ వచ్చాయి. మిజోరంలో మాత్రం ప్రాంతీయ పార్టీ ఎంఎన్‌ఎఫ్ అధికారంలో ఉంది. ఇది ఈశాన్య భారతంలో వచ్చిన విప్లవంగానే చూడాలి.

ఆర్‌ఎస్‌ఎస్ కూడా ఈశాన్య భారత్‌లో తన వంతుగా సేవా కార్యక్రమాలు నిర్వహించింది. మనమంతా ఒక్కటేనన్న భావనను అంకురింపచేసింది. నిజానికి బ్రిటిష్ ఇండియా కాలంలో కూడా అక్కడ ఆర్‌ఎస్‌ఎస్ తనదైన శైలిలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమగ్రతను సమర్ధించే వాతావరణం కోసం శ్రమిస్తున్నది. ఇక్కడే ఆర్‌ఎస్‌ఎస్ చూపిన వాస్తవిక దృష్టి ప్రశంసనీయం. ఈశాన్య భారత రాష్ట్రాలంటే పంజాబ్, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటివో కాదు. అందుకే ఆహార నియమాల గురించి సంఘం ప్రస్తావించడం లేదు. అదానీ వివాదం ఈ ఎన్నికలలో త్రిపుర పని చేయలేదు. కాంగ్రెస్‌కి వ్రతం చెడ్డా ఫలితం దక్కలేదు. త్రిపురలో సీపీఎంతో కలసి పోటీ చేసినా 14 స్థానాలకు పరిమితమైంది. మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో జరిగిన తొలి ఎన్నికల ఫలితాలివి. కోటలు దాటే మాటలు చెప్పిన మమత పార్టీ టీఎంసీ చతికిల పడింది. ఎన్‌సీపీ, ఆప్‌కు కూడా భంగపాటే మిగిలింది. అయితే ఈ ఓటమి బాధ నుంచి ఉపశమనం పొందడానికి వీరందరికీ ఎన్నికల కమిషనర్ నియామకం మీద సుప్రీం కోర్టు ఇచ్చిన వివాదాస్పద తీర్పు రక్షణ కవచంలా ఉపయోగపడింది. అంతా ఆ తీర్పును శ్లాఘిస్తూ తమ ఓటమిని దాచే ప్రయత్నం చేశారు. బీజేపీ విజయం నుంచి ప్రజల దృష్టిని మళ్లించాలని చూశారు. ★

**3/3.. ఎన్నికలయిన మూడు ఈశాన్య రాష్ట్రాలు బీజేపీ ఏలుబడిలోకి వచ్చాయి. భారతదేశం వేరు, తాము వేరు అనుకుంటున్న ప్రజలు జాతీయవాదాన్ని మనసా వాచా నమ్మే బీజేపీకి పట్టం కడుతున్నారు. ఇదొక గొప్ప మార్పు. కానీ ఒక్కరోజులో వచ్చినది కాదు. అలనాడు అటల్ బిహారీ వాజపేయి ప్రభుత్వం, నేడు నరేంద్ర మోదీ ప్రభుత్వం సాధించిన విజయం. దశాబ్దాల పాటు నిర్లక్ష్యానికి గురై, హింసకు, తిరుగుబాట్లకు ఆలవాలమైన ఈ ప్రాంతం నేడు అభివృద్ధిలో పరవళ్లు తొక్కుతూ కనిపిస్తోంది.**



# ఈశాన్య భారతంలో

సార్వత్రిక ఎన్నికలకు ఇంకా ఏడాది సమయం ఉంది. ఈ లోగా తొమ్మిది రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు పూర్తి కావలసి ఉండగా, అందులో త్రిపుర, నాగాలాండ్, మేఘాలయలలో ఎన్నికలు ముగిసి ఫలితాలు వచ్చేశాయి. ఈశాన్య భారతంలో బీజేపీ తన స్థానాన్ని సుస్థిరం చేసుకుందని ఈ ఎన్నికలు నిరూపించాయి. త్రిపురలో సీట్లు తగ్గినా అది తన స్థానాన్ని పదిలపరచుకుంది. నాగాలాండ్‌లో కూటమి సహకారంతో విజయాన్ని అందుకుంది. మేఘాలయలో ఓటర్ల తీర్పు కొంచెం భిన్నంగా ఉంది. లోక్‌సభకు ఎక్కువ మంది ఎంపీలను పంపక పోయినా, జాతీయ భద్రత పరంగా ఈశాన్య భారతానికి విశేష ప్రాధాన్యం ఉంది. ఇలాంటి చోట బీజేపీ స్పష్టమైన, సుస్థిరమైన ముద్రను వేయ గలిగింది. రెండుసార్లు అస్సాం, త్రిపురలలో విజయం సాధించింది. నాగాలాండ్‌లో ఎన్డీపీపీ లాంటి పార్టీతో కూటమి ద్వారా అధికారాన్ని పొందగలిగింది. గత ఏడాది మణిపూర్ అసెంబ్లీ ఎన్నికలలో 60 స్థానాలకు 32 స్థానాల్లో విజయం సాధించి, కాంగ్రెస్‌కు కేవలం ఐదుకు పరిమితం చేయగలిగింది.

ఇక కాంగ్రెస్ పరంగా చూస్తే, ఈశాన్యరాష్ట్రాల ఎన్నికలు ఆ పార్టీకి కష్టాలు తీరలేదని, గత కొంత కాలంగా అపజయాలతో జీవం కోల్పోయిన ఆ పార్టీ తిరిగి కోలుకోలేదని స్పష్టం చేస్తున్నాయి. నాయకత్వ లోపం, అందరినీ కలుపుకుపోయే స్వభావం లేకపోవటం తీరని నష్టాన్ని కలిగించింది. ఈ దఫా కూడా ఇక్కడి ఎన్నికలు, కాంగ్రెస్ ను విడిచిన ఇతర పార్టీల నాయకుల చుట్టూనే తిరిగాయి.

కాంగ్రెస్ మాజీ నాయకుడు ప్రద్యోత్ మాణిక్య దేబ్ బర్మ త్రిపుర రాజవంశీకుడు. పార్టీని వదిలి తిప్రా మోతా పార్టీని పెట్టారు. మేఘాలయలో కాంగ్రెస్ నాయకుడు ముకుల్ సంగ్మాను పార్టీ నిలుపు కోలేకపోయింది. అంతే కాదు. బీజేపీ జతకట్టిన ఎన్డీపీపీ.. అసెంబ్లీలో అతి పెద్ద పార్టీకి కాన్రాడ్ సంగ్మా నాయకత్వం వహిస్తున్నారు. ఈయన తండ్రి పిఏ సంగ్మా కాంగ్రెస్ నాయకుడు. సోదరి అగాథ సంగ్మా మన్మోహన్ ప్రభుత్వంలో మంత్రిగా పని చేశారు. నాగాలాండ్‌లో కూడా అంతే. బీజేపీ మద్దతుతో ఇంకోసారి ముఖ్యమంత్రి అవుతున్న నిఫ్యూరియో రెండు దశాబ్దాల క్రితం వరకూ నాయకుడే. భాజపా అధ్యక్షుడు, ఈశాన్య రాష్ట్రాల వ్యూహకర్త హిమంత్ బిశ్వ శర్మ కొన్నాళ్ల క్రితం వరకూ కాంగ్రెస్ నాయకుడే. అధిష్టానం తమ సమస్యలను పట్టించుకోవటం లేదని ఆరోపిస్తూ ఆయన పార్టీని వీడారు. త్రిపుర బీజేపీ నేత మాణిక్ సహ కూడా మాజీ కాంగ్రెస్ నాయకుడే. కాంగ్రెస్ ఆయా నాయకులను నిలుపుకుని ఉంటే ఫలితాలు మరో తీరుగా ఉండేవనేది స్పష్టం.

ఈ ఎన్నికల ఫలితాలు వామపక్షాలను కూడా నిరాశపరిచాయి. త్రిపురలో రెండోసారి అవి బీజేపీ చేతిలో చావుదెబ్బ తిన్నాయి. 2018 వరకూ త్రిపుర.. కేరళ మాదిరిగానే సీపీఐ (ఎం)కి పెట్టనికోట. దశాబ్దం క్రితం వరకూ పశ్చిమబెంగాల్ కూడా దాని ఆధీనంలోనే ఉండేది. కాంగ్రెస్‌తో జతకట్టినా సీపీఐ (ఎం) బీజేపీని ఓడించలేకపోయింది. బెంగాల్ మాదిరిగానే, ఈ రాష్ట్రం కూడా తన చేతిలో నుంచి





# మళ్లీ కమల వికాసం

జారిపోయినట్టేనన్న అభిప్రాయాన్ని కలిగించింది. ఈ ఫలితాలు మరో విషయాన్ని స్పష్టం చేశాయి. బీజేపీ ఎప్పటికప్పుడు కొత్త ఓటర్లు ఆకర్షిస్తూ..ఎలక్టోరల్ మిషన్‌లా తయారయ్యింది. బలహీనంగా ఉన్న చోట్ల కూటమికి సిద్ధపడుతోంది. కాంగ్రెస్ పార్టీ దానికి భిన్నంగా ప్రవర్తిస్తూ ప్రతికూల ఫలితాలను చవి చూస్తోంది.

మేఘాలయ ఎన్నికల్లో తృణమూల్ ప్రవేశం మరో కొత్త విషయాన్ని చాటుతోంది. ఒకవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే లాంటి వాళ్లు ప్రతిపక్షాల ఐక్యత గురించి మాట్లాడుతున్నా, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ లాంటి వాళ్లు దానికి మద్దతు పలుకుతున్నా.. అది తృణమూల్ కావచ్చు, ఆమ్ ఆద్మీ పార్టీ కావచ్చు.. అవి అవకాశం ఉన్న ప్రతి చోటా కాంగ్రెస్ స్థానాన్ని భర్తీ చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నాయి. ఫలితంగా కాంగ్రెస్ మీద పై చేయి సాధిస్తూ బీజేపీ తన ఆధిపత్యం కొనసాగించుకుంటూ పోతోంది. వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది.

**ఈశాన్యానికి సముచిత ప్రాధాన్యం**

మోదీ ప్రభుత్వం ఆది నుంచి ఈశాన్యభారతంపై దృష్టి పెట్టింది. మంత్రివర్గంలో అక్కడి నేతలకు సముచిత స్థానం కల్పించింది. ప్రస్తుతం మంత్రి వర్గంలో ఇద్దరు కేబినెట్ మంత్రులు, ముగ్గురు సహాయమంత్రులు ఉన్నారు. మొట్టమొదటిసారి త్రిపుర నుంచి ఎన్నికయిన వ్యక్తికి కేబినెట్‌లో చోటు దక్కటమే కాదు. కిరణ్ రిజీజుకు అత్యంత ప్రాధాన్యం గల న్యాయశాఖ దక్కటం రాబోయే రోజుల్లో ఈశాన్యం అనేది దేశంలో అత్యున్నతమైన నాయకత్వాన్ని అందించగలదనేటానికి సూచికగా చెప్ప వచ్చు.

అలాగే ఖ్యాతి పొందిన నాయకులకు ఇక్కడ కొదవలేదు. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తన రాష్ట్రంలోనే కాదు, ఇతర ప్రదేశాల్లో కూడా ప్రభావం చూపుతున్నారు. వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు స్టార్ క్యాంపెయినర్‌గా వ్యవహరించారు. నాగాలాండ్ బీజేపీ అధ్యక్షుడు టెంజన్ ఇమ్నా ఆసక్తికరమైన వీడియోలతో సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉంటారు. "ఆయన నాగాలాండ్‌కు, ఈశాన్య భారతానికి గొప్పగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. నేను కూడా అప్పుడప్పుడు ఆయనను అనుసరించాలని ప్రయత్నిస్తాను'' అని స్వయంగా ప్రధానే ఓ సందర్భంలో వ్యాఖ్యానించారు. నాగాలాండ్ సాంస్కృతిక వేడుక హార్నిబిల్ ఫెస్టివల్ దేశంలో అన్ని ప్రాంతాలవారిని విశేషంగా ఆకర్షిస్తుంది. 2014లో మోదీ ప్రధాని కాగానే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**సర్వతోముఖాభివృద్ధికి విశేష కృషి**


మోదీ ప్రభుత్వ హయాంలో గత తొమ్మిదేళ్లలో ఈశాన్య రాష్ట్రాల స్వరూపమే మారిపోయింది. ప్రాంతాల మధ్య కనెక్టివిటీ, మౌలిక వసతుల కల్పన, శాంతి, స్థిరత్వం, ఇన్ క్లూజివిటీ తదితర అంశాల్లో అసాధారణ మార్పు చోటుచేసుకుంది. ప్రస్తుతం ఇక్కడ హింస తగ్గుముఖం పట్టింది. తిరుగుబాట్లు,

## ఎన్నికల ఫలితాలు



**త్రిపుర (60)**

| పార్టీ/కూటమి | స్థానాలు |
|---|---|
| బీజేపీ | 32 |
| కాంగ్రెస్ | 03 |
| లెఫ్ట్ | 11 |
| తిప్రా | 13 |
| ఐపీఎఫ్‌టీ | 1 |




**నాగాలాండ్ (60)**

| పార్టీ/కూటమి | స్థానాలు |
|---|---|
| బీజేపీ+ఎన్డీపీపీ | 37 |
| ఎన్సీపీ | 7 |
| ఎన్పీపీ | 5 |
| ఇతరులు | 11 |



**మేఘాలయ (60)**

| పార్టీ/కూటమి | స్థానాలు |
|---|---|
| ఎన్పీపీ | 26 |
| యూడీపీ | 11 |
| కాంగ్రెస్ | 5 |
| టీఎంసీ | 5 |
| భాజపా | 2 |
| ఇతరులు | 10 |


పట్టభద్రులారా ఆలోచించి ఓటేద్దాం..
ప్రశ్నించే గళాన్ని గెలిపిద్దాం..
మన భవిష్యత్తును తీర్చి దిద్దుకుందాం..
తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ
(ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలు)
ఓటరు మహాశయులారా, రానున్న M.L.C.
ఎన్నికలలో పట్టభద్రుల నియోజకవర్గం నుండి
భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా పోటీచేస్తున్న
శ్రీ సన్నారెడ్డి దయాకర్ రెడ్డి గారిని
మన మొదటి ప్రాధాన్యత
(1) ఓటు వేసి గెలిపిద్దాం..
శ్రీ సన్నారెడ్డి దయాకర్ రెడ్డి
తూర్పు రాయలసీమ పట్టభద్రుల
BJP M.L.C. అభ్యర్థి
పోలింగ్ తేది :
13-03-2023
సమయం :
ఉ॥ 8.00 గం॥ల నుండి
సా॥ 4.00 గం॥ల వరకు
మీ మద్దతు కోసం దయచేసి
8377999332 కు మిస్డ్ కాల్ ఇవ్వండి
భారతీయ జనతా పార్టీ - ఆంధ్ర ప్రదేశ్

తీవ్రవాద దాడులు, సాయుధ పోలీసుల పదఘట్టనలు చాలా వరకూ తగ్గిపోయాయి. దాంతో త్రిపుర, మేఘాలయాల్లో పూర్తిగానూ, నాగాలాండ్‌లో ఏడు జిల్లాలోనూ సాయుధ దళాల ప్రత్యేక చట్టాన్ని (ఎఎఫ్ఎస్‌పిఏ) ఎత్తివేశారు.


కాంగ్రెస్ పార్టీ దశాబ్దాలపాటు ఈ ప్రాంతంపైన నిర్లక్ష్యం చూపింది. 1962 చైనా యుద్ధంలో, అరుణాచల్‌ప్రదేశ్ లోని బొమిడాల ప్రాంతాన్ని చైనా సైన్యం ఆక్రమించటంపైన అప్పటి ప్రధాని నెహ్రూ నిస్సహాయత వ్యక్తం చేయటంతో అస్సాంలో మంటలు రేగాయి. మార్చి 5, 1966లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ, మిజో నేషనల్ ఫ్రంట్‌కు వ్యతిరేకంగా ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఐఎఫ్)చేత మిజోరాం జనావాసాలపైన బాంబు దాడి చేయించారు. దాంతో ఆ రాష్ట్రంలో తిరుగుబాట్లు రివాజుగా మారాయి. అక్కడ ప్రజల మనస్తత్వంలో అవి భాగంగా మారిపోయాయి. అస్సాం నుంచి రాజ్యసభ సభ్యుడయిన డాక్టర్ మన్మోహన్ సింగ్, ప్రధాని హోదాలో ఒక్కసారి కూడా ఈశాన్యరాష్ట్రాల సమస్యల గురించి ప్రస్తావించలేదు. కాంగ్రెస్ పార్టీ అనుసరించిన వైఖరివల్ల ఈ ప్రాంతంలో మిలిటెన్సీ ప్రబలింది. యూపీఏ హయాంలో ఎన్నోసార్లు చైనీయుల చొరబాట్లు చోటుచేసుకున్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే ఆయా ప్రాంతాలకు మిగతా ప్రపంచంతో సంబంధం లేకుండా 'దూరాభారం సమస్య'ను ఎదుర్కోవటం మరో కారణం.

ఈశాన్య రాష్ట్రాలో అభివృద్ధికి గల అవకాశాలను ప్రధాని మోదీ గుర్తించారు. ఆయన ప్రతిష్ఠాత్మకమైన 'లుక్ ఈస్ట్ పాలసీ'కి కొన్ని మెరుగులు దిద్ది, దానిని 'యాక్ట్ ఈస్ట్ పాలసీ'గా మార్పు చేశారు. ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి అనేది ఆగ్నేయాసియాకు ప్రవేశద్వారంగా భావించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఇండియా-మైన్మార్-థాయ్‌లాండ్ త్రైపాక్షిక రహదారి, అగర్తల-అఖౌరా రైల్ ప్రాజెక్టులు కేంద్రం దూరదృష్టికి తార్కాణంగా నిలుస్తాయి. ఇవి పూర్తయ్యాయంటే ఈ ప్రాంతాల స్వభావమే మారిపోతుంది. అలాగే ఈ రాష్ట్రాలు వివిధ రంగాల్లో సర్వోతోముఖాభివృద్ధిని సాధించాయి.

ఈ 9 ఏళ్ల మోదీ ప్రభుత్వ హయంలో



**డాక్టర్ పార్థసారథి చిరువోలు**
సీనియర్ జర్నలిస్ట్



రూ.50వేల కోట్లకు పైగా ఆ రాష్ట్రాలలో వెచ్చించింది. కొత్త రైలుమార్గాలు, వంతెనలు, సొరంగ మార్గాలను నిర్మించింది. మరో రూ.80 వేల కోట్ల విలువైన కొత్త ప్రాజెక్టులను మంజూరు చేసింది. గత ప్రభుత్వాలతో పోలిస్తే ఇది రికార్డని చెప్పాలి. 2014 వరకూ ఈశాన్యప్రాంతంలో రైలుమార్గాలు కేవలం అస్సాం ప్రాంతం వరకే పరిమితమయ్యేవి. ఇప్పుడు రైల్వేల విస్తరణకు బహుముఖంగా కృషి సాగుతోంది. ఉపరితల రవాణాలో పురోగమన వేగం ఏ ప్రాంతంలోనయినా అభివృద్ధి పరుగులెత్తటానికి కీలకం అవుతుంది. ఇప్పుడు ఈశాన్య భారతంలో దానిని ప్రత్యక్షంగా చూడొచ్చు. భౌగోళికంగాకానీ, ఇతరత్రా గానీ ఎదురయ్యే అన్ని సవాళ్లను అధిగమించి, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధిపనులు చేపడుతున్నారు. దాంతో ప్రాంతాల మధ్య దూరం తగ్గుతోంది. ప్రయాణసమయం తగ్గటం చెప్పుకోదగ్గ మార్పు.

– గత తొమ్మిదేళ్లలో, నార్త్ ఈస్ట్ రీజియన్ (ఎన్ఈఆర్) లో ఎయిర్ పోర్టుల సంఖ్య తొమ్మిది నుంచి 16కి చేరింది. 2014లో 900 వరకూ విమానాలు ఇక్కడ తిరుగుతుంటే ఇప్పుడు వాటి సంఖ్య 1900కి పెరిగింది.

– ఈ రాష్ట్రాల్లో కొన్ని ప్రాంతాలు మొట్టమొదటిసారిగా ఇండియా రైల్వేమ్యాప్ లో చోటు సంపాదించాయి. జలరవాణా మార్గాల వృద్ధికి కూడా చర్యలు సాగుతున్నాయి. అలాగే నేషనల్ హైవేలు.. 2014 నుంచి చూస్తే ఈ ప్రాంతంలో వాటి సంఖ్య 50 శాతానికి పెరిగింది.

– అన్ని ఈశాన్య రాష్ట్రాలు ఇప్పటికి రైల్వే కనెక్టివిటీ పరిధిలోకి వచ్చాయి. మణిపూర్,మిజోరాం, మేఘాలయల రాష్ట్ర రాజధానులను 2023 నాటికి అనుసంధానించాలని నిర్ణయించారు.

– భారత్-బంగ్లాదేశ్‌ల మధ్య నిర్మిస్తున్న అగర్తల రైల్వే మార్గానికి రూ.1100 కోట్లకు పైగా వెచ్చిస్తున్నారు. ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వశాఖ (డోనర్), విదేశీవ్యవహారాల మంత్రిత్వశాఖ ఈ ప్రాజెక్టుకు సంయుక్తంగా నిధులు సమకూరుస్తున్నాయి. ఇంఫాల్ రైలుమార్గాన్ని మోరే దాకా పొడిగిస్తున్నారు. అక్కడ మైన్మార్ రైల్వేలకు అనుసంధానితమై ఆసియా వ్యాప్త రైలుగా మారుతుంది.

– ఎన్ఈఆర్‌లో చెప్పుకోదగ్గ రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టుల విషయానికొస్తే.. సిక్కిం-కలింపాగ్-డార్జిలింగ్ ప్రాంతంలో బాగ్రాకోటె నుంచి పెక్యాంగ్ (ఎన్ హెచ్ -717ఎ) ల మధ్య ఉన్న రెండు లేన్ల రహదారి (152కి.మీ), ఇంఫాల్-మోరే సెక్షన్ల మధ్య (ఎన్ హెచ్ -39) నాలుగు లేన్ల రహదారి (20కి.మీ), మణిపూర్లో రెండు లేన్ల రహదారి (75.4 కి.మీ), నాగాలాండ్‌లో దిమాపుర్-కొహిమా రహదారి (62.9 కి.మీ), అరుణాచల ప్రదేశ్ లో హెూలంగ్ కి నాలుగు లైన్ల బైపాస్ (167కి.మీ), మిజోరంలో ఐజ్వాల్-టూపాంగ్ (ఎన్ హెచ్54) బైపాస్ రహదారి (351కి.మీ).

– ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన 141 మీటర్ల స్తంభాల వంతెనతో జిరిబామ్-ఇంఫాల్ రైలు మార్గాన్ని చేపట్టారు. ఈ ప్రాజెక్టులను పూర్తి చేయటానికి కేంద్రం నిధుల చేయూతను అందిస్తోంది. 2009-2014 మధ్య ఏటా రూ.2,122 కోట్ల వ్యయంతో పోలిస్తే, సగటువార్షిక బడ్జెట్ కేటాయింపులో ఇప్పుడు 370 శాతం పెరుగుదల ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి అది రూ.9,770 కోట్లకు చేరింది.

– ఈ ప్రాంత భౌగోళిక ప్రాధాన్యతను గుర్తిస్తూ అస్సాం-అరుణాచల్ ప్రదేశ్‌లను కలిపే రైల్-రోడ్ మార్గం నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా భారతదేశంలోనే తొలి జలాంతర రైలుమార్గ సొరంగం నిర్మితం కానుంది.

– 2017లో ఉత్తర అస్సాం-తూర్పు అరుణాచల ప్రదేశ్ లను కలిపే కీలక వ్యూహాత్మక ధోలా-సాదియా వంతెనపై వాహన రాకపోకలు మొదలయ్యాయి. ఇది భారతదేశంలో నీటిపై నిర్మించిన అతిపొడవైన వంతెన మాత్రమేకాదు. మన యుద్ధట్యాంకులను కూడా సులువుగా మోయగలదు.

ఆసియాలోనే రెండో అతి పొడవయిన 'బోగీబీల్' రైలు రోడ్డు వంతెన 2018లో ప్రారంభమైంది. ఇది అస్సాం-అరుణాచల్ మధ్య ప్రయాణదూరాన్ని 80 శాతాన్ని తగ్గించింది. రిక్టర్ స్కేలుపై 7.0 తీవ్రతను భూకంపాలను కూడా తట్టుకునేలా ఈ వంతెన నిర్మితమైంది.

– ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్‌తో డిజిటల్ కనెక్టివిటీ పెంచేందుకు కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుం

టోంది. 5జీ నెట్‌వర్క్ వల్ల స్టార్టప్ ఎకోసిస్టమ్ మెరుగు పడుతుంది. ఈ ప్రాంతంలో సర్వీస్ సెక్టార్ అభివృద్ధికి ఈ చర్యలు దోహదపడతాయి.

– ఈ ప్రాంతంలో నాచురల్ ఫార్మింగ్‌కి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కృషి ఉడాన్ ద్వారా, ఇక్కడి రైతులు తమ ఉత్పత్తులను దేశంలోనే కాదు, ప్రపంచంలో ఏ మూలలోనయినా అమ్ముకోగలుగుతారు. గత ఆరేళ్లలో ఈ ప్రాంతం వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులలో 85శాతం వృద్ధిని నమోదు చేసుకుంది. మౌలికవసతుల అభివృద్ధి, కమ్యూనికేషన్ సేవల విస్తరణ వల్ల ఈ మార్పు సాధ్యమైంది.

– ఈ ప్రాంతం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అందుకోసం ప్రత్యేకంగా అత్యాధునికమైన విస్టాడోమ్ కోచ్‌లను ప్రవేశపెట్టింది. దీనివల్ల మహిళలు, గిరిజనులకు, వెనుకబడిన వర్గాల వారికి అవకాశాలు మెరుగుపడ్డాయి. స్థానిక వ్యాపారాలను, ఆర్థిక వ్యవస్థలను ప్రోత్సహించే కృషిలో భాగంగా ఈశాన్యసరిహద్దు రైల్వే 2022లో అసోం–గోవాల మధ్య తొలి పార్సిల్ కార్గో ఎక్స్‌ప్రెస్ రైలును నడిపింది. గత మూడు సంవత్సరాలుగా రైల్వేలు 20వేలకు పైగా కార్మికులకు ఉపాధి అవకాశాలను కల్పించింది.

ఈ మూడు రాష్ట్రాల ఎన్నికలలో ఓటర్లు పాలకపక్షాల కూటమికి మద్దతు పలికారు. 2018తో పోలిస్తే కొద్దిగా సీట్లు తగ్గినా, త్రిపురలో బీజేపీ కూటమికి అత్యధిక ప్రజాదరణ ఉన్న విషయం వెల్లడయ్యింది. రాష్ట్ర రాజకీయాల్లో కొత్త ఆటగాడు తిప్రామోతా పార్టీ మొదటిసారి గోదాలోకి దిగినా తన ఉనికిని చాటుకోగలిగింది. వామపక్షాలు, కాంగ్రెస్ కలిసి రంగంలోకి దిగినా ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయాయి.

బీజేపీ కూటమి 33 సీట్లు (ఓట్ల శాతం 40.33) సాధించింది. (బీజేపీకి 32 సీట్లు. మెజార్టీ మార్కు కంటే ఒకటి అధికం). కాంగ్రెస్ నాయకుడు ప్రద్యోత్ విక్రమ్ మాణిక్య దేవ్ వర్మ బహదూర్ పెట్టిన కొత్త గిరిజన పార్టీ తిప్రా మోతా 13 సీట్లు దక్కించుకుంది.


ఓట్లశాతం విషయానికొస్తే.. వామపక్షాల కూటమి 10.13 శాతం ఓట్లు కోల్పోతే, తిప్రా మోతా మొదటిసారే 19.69శాతం ఓట్లను తెచ్చుకోగలిగింది.

**నాగాలాండ్‌లో..**

నాగాలాండ్‌లో నేషనల్ డెమోక్రటిక్ ప్రొగ్రెసివ్ పార్టీ (ఎన్‌డీపీపీ)తో సర్దుబాటు ఉండటం బీజేపీకి ఉపకరించింది. 60 అసెంబ్లీ స్థానాల్లో ముఖ్యమంత్రి నిఫూరియోకు చెందిన ఎన్డీపీపీ 25 స్థానాలు దక్కించుకుంటే, బీజేపికి12 స్థానాలు లభించాయి.

ఎన్డీపీపీ– బీజేపీ కూటమికి 51.03 శాతం ఓట్లు లభిస్తే, అందులో ఎన్డీపీపీ 32.22 శాతం దక్కించుకోగా, ఇక మిగిలిన 18.81శాతం బీజేపీ పరమైంది. రెండు పార్టీలు మొదటిసారి ఎన్నికల గోదాలోకి దిగాయి. అవి లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్), రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే). ఈ రెండు పార్టీలు రెండు సీట్లు దక్కించుకున్నాయి. చిరాన్ పాశ్వాన్ నాయకత్వంలోని ఎల్జీపీ (ఆర్వీ) 8.65 శాతం ఓటు శాతంతో నాగాలాండ్‌లో రాష్ట్ర పార్టీ ట్యాగ్ ను దక్కించుకుంది. మొట్టమొదటిసారిగా శరద్ పవార్ నాయకత్వంలోని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ ప్రధాన ప్రతిపక్షం కానుంది. ఏడు సీట్లతో 9.56 శాతం ఓట్లు సాధించింది.

నాగాలాండ్ రాష్ట్రం ఏర్పాటయిన 60 ఏళ్ల తర్వాత తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయిన మహిళగా హెకాని జఖాలు ఘనత దక్కించుకున్నారు. ఆమె న్యాయవాది, సామాజిక కార్యకర్త కూడా. నాగాలాండ్ అసెంబ్లీలో పోటీ పడిన 183 మంది



హిమంత.. ఈశాన్య వ్యూహకర్త

అభ్యర్థులలో నలుగురు మహిళలు. అందులో హెకానీ, బీజేపీ కూటమి ఎన్డీపీపీ తరఫున పోటీచేసి విజయం సొంతం చేసుకున్నారు. మరో మహిళ సల్హౌట్ న్యుయోనో క్రూసె అతి తక్కువ ఓట్లతో విజయం సాధించారు.

ఒకప్పుడు నాగాలాండ్ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన కాంగ్రెస్, ఈ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా దక్కించుకోలేకపోయింది. కాకపోతే దాని ఓట్ల శాతం 1.45 నుంచి 3.55 శాతానికి పెరిగింది.

వంద ఓట్ల కంటే తక్కువ మెజార్టీతో గెలిచిన అభ్యర్థులు నలుగురు ఉన్నారు. రెండు సీట్లను ఎన్డీపీపీ గెలుచుకుంటే, ఎన్సీపీ ఒకటి, నాగా పీపుల్స్ ఫ్రంట్ చెరో స్థానంలో గెలుపొందాయి. అలాగే అత్యధిక మెజార్టీ సాధించినది బీజేపీకి చెందిన జాకబ్ ఝిమోమీ. ఆయన 20,096 ఓట్ల మెజార్టీతో ప్రత్యర్థిపైన విజయం సాధించారు. నిఫూరియో 15,824 ఓట్లతో అంగామీ–2 అసెంబ్లీ స్థానంలో గెలుపొంది, రికార్డు స్థాయిలో ఐదోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు.

**మేఘాలయాలో...**

మేఘాలయలో ఓటర్లు ఏ పార్టీకి తగినంత మెజార్టీని ఇవ్వలేదు. ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మాకు చెందిన నేషనల్ పీపుల్ పార్టీ, మెజార్టీ మార్కు కంటే నాలుగు తక్కువగా 26 సీట్లకు పరిమితమైంది. బీజేపీ రెండు సీట్లు దక్కాయి. ఎన్పీపీకి మద్దతు ఇవ్వటానికి అది అంగీకరించింది. సంగ్మా, బీజేపీ అగ్రనేత అమిత్ షాతో మాట్లాడారు. సంగ్మాకు మరో రెండు సీట్లు అవసరమవుతాయి. 60 స్థానాలున్న అసెంబ్లీలో, ఒక అభ్యర్థి మరణంతో 59 స్థానాలకు ఎన్నికలు జరిగాయి.

మేఘాలయలో కాంగ్రెస్ పార్టీ గతంతో పోలిస్తే భారీగా నష్టపోయింది. 60 సీట్లలో గతంలో 21 సీట్లు దక్కితే, ఈ సారి అది కేవలం ఐదు సీట్లకే పరిమితమైంది. అది తన అభ్యర్థి ముకుల్ సంగ్మాను కాపాడుకోవటంలో విఫలం కావటం అందుకు కారణమని చెప్పాలి. ముకుల్ 2021లో కాంగ్రెస్ పార్టీని వదిలి తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. ఇది మమతాబెనర్జీ పార్టీకి ఎంతగానో లాభించింది. అది కాంగ్రెస్‌తో సమానంగా ఐదు సీట్లను దక్కించుకోగలిగింది. గత అసెంబ్లీలో ముఖ్యమంత్రిగా వ్యవహరించిన కాన్రాడ్ సంగ్మా మరోసారి సీఎం అయ్యే అవకాశాలున్నాయి. సంగ్మా నేషనల్ పీపుల్స్ పార్టీ, బీజేపీ కూటమిగా ఉన్నా అవి ఎన్నికలలో విడివిడిగా పోటీకి దిగాయి.

సంగ్మా మొదటిసారిగా 2004లో ఎన్నికల గోదాలోకి దిగారుగానీ ఓటమిపాలయ్యారు. నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సీపీ) తరఫున మొదటిసారి అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. పవర్, టూరిజం మంత్రిగా 2009 వరకూ సేవలందించారు. తండ్రి పీఏ సంగ్మా మరణించిన తర్వాత 2016లో నేషనల్ పీపుల్స్ పార్టీ బాధ్యతలను చేపట్టారు. 2009 నుంచి 2013 వరకూ అసెంబ్లీలో ప్రతిపక్షనేతగా ఉన్నారు. అప్పుడు కాంగ్రెస్ పార్టీకి చెందిన ముకుల్ సంగ్మా ముఖ్యమంత్రిగా వ్యవహరించేవారు. 2016లో లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2018లో సౌత్ తురా అసెంబ్లీ ఉపఎన్నికలో గెలిచి లోక్‌సభకు రాజీనామా చేశారు. పీఏ సంగ్మా ఫౌండేషన్‌కు అధ్యక్షునిగా వ్యవహరిస్తున్నారు. అవి మేఘాలయలో నాలుగు కాలేజీలను నిర్వహిస్తున్నది.

ఎన్నికల గోదాలో అప్రతిహతంగా దూసుకుపోతున్న బీజేపీ, దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన ఈశాన్య భారతంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. అభివృద్ధికి రిజర్వాయర్‌గా మారింది. ఈ అభివృద్ధి ఫలాలను దేశవ్యాప్తం చేయాలనే సంకల్పంతో ముందుకు వెలుతోంది. ★



మార్చి 16
జాతీయ
వ్యాక్సినేషన్ డే

# వ్యాక్సిన్ లేని ఆధునిక ప్రపంచాన్ని ఊహించలేం!



డా. ఆర్వీ కుమార్
కార్డియాలజిస్ట్, నిమ్స్

ప్రజారోగ్యం విషయంలో వ్యాక్సిన్ల పాత్ర తిరుగులేనిది. ఏటా ప్రపంచ వ్యాప్తంగా 30 లక్షల మందిని రోగాలతో మృత్యువాత పడకుండా కాపాడుతున్నది వ్యాక్సినేషన్ కార్యక్రమమే. ఇంగ్లండ్‌లో టీకా లేదా వ్యాక్సిన్‌ను ప్రవేశపెట్టిన తరువాత స్మాల్‌పాక్స్, పోలియో, టెటనస్ వంటి ప్రాణాంతక వ్యాధులు దాదాపు నిర్మూలించగలిగారు. అత్యల్పంగా మాత్రమే ఇప్పుడు ఆ వ్యాధిగ్రస్థులు కనిపిస్తున్నారంటే కారణం వ్యాక్సిన్. మీజిల్స్, డిఫ్తీరియా వంటివి వ్యాక్సిన్ ప్రవేశించిన తరువాత 99.9 శాతం తగ్గిపోయాయి. కొవిడ్ 19తోనే కాదు, అది ప్రపంచం మీద దాడి చేయడానికి కొన్ని దశాబ్దాల ముందే వ్యాక్సిన్ ప్రాధాన్యంలోకి వచ్చింది. వ్యాక్సిన్ అంటే సాధారణంగా తీసుకునే ఔషధాల కంటే రెండు కోణాల నుంచి చాలా భిన్నమైనది. మొదటిది: వ్యాక్సిన్‌ను వ్యాధిని తగ్గించడానికి కాకుండా, నిర్మూలించడానికి ఉపయోగిస్తారు. వ్యాధి కారకమైన బాక్టీరియాను లేదా వైరస్‌ను గుర్తించి దానిని అరికట్టే రీతిలో వ్యక్తిలో రోగ నిరోధక శక్తిని పెంచడం వ్యాక్సిన్ల ప్రధాన ధ్యేయం. అంటే మానవాళి ఎదుర్కొనక తప్పని కొన్ని రోగాలను ముందే అరికట్టడానికి వారి రోగ నిరోధక శక్తిని వ్యాక్సిన్లు ఉద్దీపింప చేయగలవు. రెండు: చాలా ఔషధాల మాదిరిగా కాకుండా, వ్యాక్సిన్‌ను జీవ ఉత్పత్తుల నుంచి తయారు చేస్తారు. కాబట్టి ఇవి రసాయనాల సమ్మేళనం కాదు. మార్చి 16 వ్యాక్సినేషన్ డే సందర్భంగా ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ ఆర్వి కుమార్ (కార్డియాలజి విభాగం, నిమ్స్, హైదరాబాద్) వ్యాక్సిన్ ప్రాధాన్యం గురించి జాగృతితో ముచ్చటించారు. వ్యాక్సిన్ డే ఎలా వచ్చింది? వ్యాక్సిన్ ప్రాధాన్యం లేదా అవసరం ఎలాంటివి? ఎలాంటి వ్యాధులకు వ్యాక్సిన్ ఇస్తారు? బాలలకు ఉద్దేశించిన వ్యాక్సిన్లు ఏవి? ప్రభుత్వం ఇచ్చే వ్యాక్సిన్లు ఏమిటి? మన వ్యాక్సిన్లు మనమే దేశంలో తయారు చేసుకుంటున్నామా వంటి అంశాలను ఆయన వివరించారు. డాక్టర్ కుమార్‌తో జరిపిన ముఖాముఖి లోని అంశాలు:




**ప్రస్తుతం భారతదేశంలో ఏఏ వ్యాధుల నివారణకి వ్యాక్సినేషన్ అందిస్తున్నారు?**

గర్భిణులకు, పిల్లలకు మొత్తం పది రకాల వ్యాక్సిన్లు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్నాయి. వాటిలో రెండు రకాలు చుక్కల మందు, ఒక రకం ద్రావణం, ఏడు రకాల ఇంజక్షన్లు ఉన్నాయి. పుట్టి భూమ్మీద పడిన క్షణం నుంచి 16 ఏళ్ల వయసు వరకు ఆయా వయసులను బట్టి నిర్దేశించిన ఆయా వ్యాక్సిన్ డోసులు వేయించుకోవాల్సి ఉంది. పుట్టిన ప్రతి బిడ్డకు వ్యాక్సినేషన్ కార్డు ఇచ్చి అందులో వాళ్లకి అందించిన వ్యాక్సినేషన్ వివరాలు పొందుపరుస్తారు. గర్భిణులు, పిల్లలకు డీటీ (డిఫ్తీరియా టెటానస్) ఇస్తారు. ఈ టీకాను గర్భం దాల్చిన తొలిరోజుల్లో మొదటి డోసు, తర్వాత నాలుగు వారాలకు రెండో డోసు, ఆ తర్వాత బూస్టర్ డోసు వేస్తారు.

**చిన్న పిల్లల వ్యాక్సినేషన్ చాలా ముఖ్యమైనదిగా ఇప్పుడు అంతా అంగీకరిస్తున్నారు. దాదాపు నాలుగైదు దశాబ్దాల నుంచి దీనిని ఒక ఉద్యమంగా ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయి. ప్రజలు కూడా స్పందిస్తున్నారు. పిల్లల వ్యాక్సినేషన్ క్రమం ఏమిటి? ఏఏ వ్యాక్సిన్లు ఇస్తారు?**

పుట్టిన సమయంలో మొదట బీసీజీ (క్షయ) ఓపీవీ వ్యాక్సిన్ జీరో మోతాదుతో పాటు, హెపటైటీస్ బీ మోతాదు కూడా ఇస్తారు. 6 వారాల వయసులో ఓపీవీ–1 (పోలియో రాకుండా) చుక్కల మందు, రోటా–1 (విరోచనాలు రాకుండా) చుక్కల మందుతో పాటు ఎఫ్ఐపీవీ–1 ఇంజక్షన్ (పోలియో రాకుండా), పెంటావాలెంట్ (డిఫ్తీరియా, కంఠసర్పి, ధనుర్వాతం, కామెర్లు, మెదడువాపు రాకుండా) టీకాలు వేస్తారు. పది వారాల వయసులో ఓపీవీ, పెంటావాలెంట్, రోటా టీకాలు రెండో డోసు వేస్తారు. 14 వారాలకు ఓపీవీ, పెంటావాలెంట్, రోటా మూడో డోసుతో పాటు ఎఫ్ఐపీవీ రెండో డోసు వేస్తారు. 9 నెలలకు తట్టు, రుబెల్లా రాకుండా ఎంఆర్ వ్యాక్సిన్‌తో పాటు విటమిన్ ఏ ద్రావణం ఇస్తారు. 16 నుంచి 24 నెలలకు డీపీటీ మొదటి బూస్టర్, ఓపీవీ బూస్టర్‌తో పాటు ఎంఆర్ రెండో డోసు వేస్తారు. 5,6 సంవత్సరాలకు డీపీటీ రెండో బూస్టర్ మోతాదు, 10–16 సంవత్సరాలకు టీడీ వ్యాక్సిన్ వేస్తారు. దీనిని ప్రతి తల్లి గమనించుకోవాలి. చిన్నారులకు వ్యాక్సిన్ విషయంలో సదా జాగరూకతతోనే ఉండాలి. కుటుంబం కూడా సహకరించాలి.

**జాతీయ టీకా దినోత్సవం (మార్చి 16) లేదా వ్యాక్సినేషన్ డేని ఎలా ఎంపిక చేశారు? నేపథ్యం ఏమిటి?**

మార్చి 16, 1995 న OPV ఓరల్ పోలియో వాక్సిన్‌ను ప్రారంభించిన భారత ప్రభుత్వం దేశం నుండి ఆ వ్యాధిని పూర్తిగా నివారించగలిగింది! ఆ విజయాన్ని స్మరిస్తూ వ్యాక్సినేషన్ ప్రాముఖ్యాన్ని వక్కాణించడానికి మార్చి 16 ను ఏటా జాతీయ టీకా దినోత్సవంగా జరుపుకుంటున్నాం!

పిల్లలలోనే కాకుండా వయోవృద్ధులలో రోగ నిరోధక శక్తి తక్కువ ఉన్నవాళ్లలో, ఊపిరితిత్తుల సమస్యలు ఉన్నవాళ్లలో ఇన్‌ఫ్లుయెంజా, న్యూమోకాకల్ టీకాలు అవసరమవుతుంటాయి. కొవిడ్ నియంత్రణలో టీకాలు చాల గొప్ప పాత్రను పోషించడం మనం ఇటీవల చూసాం కూడా! అంటురోగాలకే కాకుండా కొన్నిరకాల కాన్సరు నివారణలోనూ టీకాలు ప్రముఖపాత్ర పోషిస్తున్నాయి! గర్భాశయ ముఖ ద్వార కాన్సర్ నివారణకు టీకా ఇస్తున్నారు.

**అసలు వ్యాక్సినేషన్ ఎందుకు? మనిషిలో సహజంగా రోగ క్రిములను నిరోధించే వ్యవస్థ ఉంటుందని అంటారు కదా!**

సాధారణంగా పరాన్నజీవి శరీరంలో ప్రవేశించాక శరీర రక్షణ వ్యవస్థ ఆ పరాన్నజీవిని అరికట్టె సమర్ధత సంతరించుకుంటుంది! కాని పరాన్నజీవులు మన శరీరంలో చేసే విధ్వంసం పూర్తిగా ఆపలేము! అలా కాకుండా పరాన్నజీవి శరీరంలో ప్రవేశించక పూర్వమే శరీర రక్షణ వ్యవస్థకు ఆ ఫలానా పరాన్నజీవిని అరికట్టే రోగనిరోధక శక్తిని సమకూర్చే ప్రక్రియే వ్యాక్సినేషన్!

పరాన్నజీవులకు రోగం కలిగించే శక్తితో పాటు మనకు ఐడెంటిటీ కార్డు ఉన్నట్లుగా ఆంటీజెన్లు అనే అంగాలు ఉంటాయి! సంక్లిష్టమైన జీవ రసాయనిక ప్రక్రియ ద్వార ఇన్ఫెక్షన్ కలిగించే శక్తిని తీసివేసి, రోగ నిరోధక వ్యవస్థను ప్రచోదన చేసే ఆంటీజెన్‌ను సేకరించి వ్యాక్సిను తయారుచేస్తారు! వాటిని శరీరంలోకి ప్రవేశపెట్టడం ద్వార ఆ వ్యాధికి శరీర రక్షణ వ్యవస్థకు రోగనిరోధక శక్తిని కలుగచేస్తాయి.

వ్యాధి బారిన పడే అవకాశం ఉన్న వారికి రోగం రాకుండా నిరోధించడం ద్వార పూర్తి రోగాన్నే మాయం చేయవచ్చు! అలా మానవాళి నుండి మాయమైన జబ్బులే – చికెన్ పాక్స్ , పోలియో! వాక్సిన్‌లు మానవాళికి అందించిన అద్భుత విజయాలివి!

**ఏ వయసు వరకు వ్యాక్సినేషన్ ఇస్తారు?**

బాల్యంలో ఇవ్వవలసిన వాక్సిన్లు ఉన్నాయి. అవి పదహారేళ్ల దాకా ఇస్తారు! వయోవృద్ధులకు, రోగనిరోధక శక్తి తక్కువ ఉన్నవాళ్లకు,ఊపిరితిత్తుల జబ్బులతో బాధపడుతున్నవారికి, సీజన్లలో న్యూమోకాకల్ వాక్సీను,ఇన్‌ఫ్లుయెంజాలకు కూడా వ్యాక్సిను ఇస్తారు! ఇక కొవిడ్ లాగా ఎపిడెమిక్‌లూ, పాండెమిక్‌లూ వచ్చినప్పుడు అన్ని వయసుల వారికి,

ఆయా వ్యాధులకు సంబంధించిన వ్యాక్సినేషన్ ఇస్తుంటారు! కొన్ని ఆఫ్రికా దేశాలకు వెళ్లాలంటే ఎల్లో ఫీవర్ బారిన పడకుండా వ్యాక్సినేషన్ తీసుకోవడం తప్పని సరి. కాబట్టి వ్యాక్సిన్‌కు వయసుతో నిమిత్తం లేదు. అదొక నిరంతర ప్రక్రియ. అవసరాన్ని బట్టి, ఆయా ప్రాంతాలను బట్టి తీసుకోవలసిందే.

**వ్యాక్సినేషన్ ప్రక్రియ ప్రపంచ వ్యాప్తంగా అమలులో ఉన్నదా?**

ప్రపంచ వ్యాప్తంగా Unicef ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్ అమలులో ఉంది! ఆయా దేశాల అవసరాలు, వనరులను బట్టి ఏ దేశానికాదేశం వాక్సినేషన్ విధానాన్ని రూపొందించుకుంటున్నాయి. ఇప్పుడు వ్యాక్సిన్ లేని ప్రపంచాన్ని ఊహించలేం.

**ప్రభుత్వాలు అందిస్తున్న వాక్సినేషన్ ఏ మేరకు?**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఇచ్చే అన్ని వ్యాక్సిన్లు ప్రభుత్వం తరపున అందుబాటులో ఉంచినవే! అవికాకుండా పల్స్ పోలియో వంటి ప్రత్యేక కార్యక్రమాల ద్వారా వాక్సిన్ పంపిణీని మరింత బలోపేతం చేస్తున్నారు.

**వ్యాక్సినేషన్ కార్యక్రమంలో సక్సెస్ రేటు ఎంత?**

మనదేశం ఎంతో పెద్దది. అత్యధిక జనాభా కలిగిన దేశాలలో భారత్‌కు రెండో స్థానం ఉంది. ఈ కోణం నుంచి వివిధ రాష్ట్రాలలో, అక్కడి జిల్లాలకి, మారుమూల ప్రాంతాలకి ప్రజారోగ్య వ్యవస్థ ఎంత మేర అందుబాటులో ఉన్నదో లేదా విస్తరించినదో అంచనాకు రాలేం. ఈ వ్యవస్థ విస్తరణ, ప్రభావం వేరు వేరు ప్రాంతాలలో వేరువేరుగానే ఉంటుంది కూడా. నిర్దిష్ట గణాంకాలు చెప్పడం కష్టం! కానీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి విశేషంగా కృషి జరుగుతున్నది! అయినా చేయవలసిందీ ఇంకా ఎంతో ఉందనే చెప్పాలి. పేదరికం, నిరక్షరాస్యత, అవగాహనా రాహిత్యం, మత సాంఘిక మౌఢ్యాలు కూడా ఇంకా అందరికీ ఆరోగ్యం అన్న ఆశయానికి అడ్డంకులు సృష్టిస్తూనే ఉన్నాయి.

**ఇప్పటికే చాలా వ్యాక్సిన్లు వచ్చాయి. ఇవే కాకుండా ఇంకా కొన్ని కొత్త వ్యాక్సిన్ల అవసరం రావచ్చునా?**

కొత్తకొత్త రోగకారక క్రిములొస్తున్న కొద్దీ కొత్త వ్యాక్సిన్ల కోసం పరిశోధన, తయారీ అవసరమెప్పుడూ ఉంటూ ఉంటుంది! కొత్త రోగకారక క్రిములపై నిఘా, వాటికనుగుణంగా కొత్త వ్యాక్సిన్ల తయారీ ఒక నిరంతర ప్రక్రియ! ఉన్నవాటి సామర్థ్యం పెంచడం, అవలక్షణాలను తగ్గించడానికి, ఇంజెక్షన్ల ద్వార కాకుండా, ముక్కు ద్వార, నోటి ద్వార ఇచ్చే విధంగా మలచడానికి పరిశోధనలు నిరంతరం జరుగుతూ ఉంటాయి!

**అరుదుగానే అయినా వ్యాక్సిన్ మీద సైడ్ ఎఫెక్ట్స్ ఆరోపణలు వస్తున్నాయి. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. వాటి గురించి చెప్పండి!**

వ్యాక్సినేషన్ చేసిన రోజున జ్వరం, ఒంటి నొప్పులు రావడం సర్వ సాధారణం! వాక్సిను పనిచేస్తున్నదనడానికి అవి ముఖ్యమైన సాక్ష్యాలు కూడా! అరుదుగా తీవ్రమైన రియాక్షన్లు, ఊపిరి అందకపోవడం, రక్తపోటు తగ్గిపోవడం, శరీరంపై దద్దుర్లు రావడం జరగవచ్చు! అవి సరైన ట్రీట్మెంటుతో తగ్గిపోతాయి! అప్పుడప్పుడు ఏ వ్యాధికి టీకా వేసామో ఆ లక్షణాలు పూర్తిగా కానీ, కొన్ని కాని కనిపించడం కూడా సహజమే! కొవిడ్ వ్యాక్సిన్ తరువాత వివిధ అవయవాలలో రక్తం గడ్డ కడుతున్నదంటూ నమోదవుతున్న కేసులు అలాంటివే! కానీ ప్రాణాపాయం ఉదంతాలు చాలా అరుదు. అన్ని పరీక్షలలో ఉత్తీర్ణత పొంది విడుదలైన వ్యాక్సిన్లు చేసే మేలుతో పోల్చి చూసుకుంటే సైడ్ ఎఫెక్టులు, కాంప్లికేషన్లు అంతగా గణించతగినవి కావు.

**భారతదేశంలో తయారవుతున్న వ్యాక్సినేషన్‌లు ఎన్ని? దిగుమతి చేసుకుంటున్నవి ఎన్ని?**

మనదేశానికి కావాల్సిన వ్యాక్సిన్లన్నీ మనదేశంలోనే తయారవుతున్నాయి! అంతేకాదు నాణ్యమైన వ్యాక్సిన్లను వేరే దేశాలకు ఎగుమతి చేస్తున్నాం. ఇది మనకు గర్వకారణం. ★



# ఎంత పెద్ద వెదురు నిర్మాణమో!

ఆత్మ నిర్భర భారత్ పథకం అద్భుతాలు సృష్టిస్తున్నది. రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ఇటీవల మహారాష్ట్రలో చేసిన ప్రయోగం ఇందుకు చక్కని ఉదాహరణ. వాని–వారోరా జాతీయ రహదారి వెంబడి ఆ మంత్రిత్వ శాఖ 200 మీటర్ల పొడవైన వెదురు క్రాష్ బారియర్ (వాహనాలు ప్రమాదానికి గురికాకుండా రోడ్డు పక్కన చేసే ఏర్పాటు)ను నిర్మించారు. ఈ జాతీయ రహదారి చంద్రపూర్, యవత్‌మల్ జిల్లాలను కలుపుతుంది. కొండలలోని ఘాట్ రోడ్ల పక్క వాహనాలు లోయలోకి జారిపోకుండా ఇనుము ఉక్కు స్తంభాలతో, కడ్డీలతో ఇలాంటి ఏర్పాటు చేస్తారు. ఇప్పుడు మహారాష్ట్రలో ఉపయోగించిన వెదురు శాస్త్రీయనామం బాంబూసా బాల్కోవా. క్రియోసొటి ఆయిల్‌ను రాసి, సాంద్రత కలిగిన, శుద్ధి చేసిన పోలీ ఎథైలిన్‌ను కూడా పూసిన వెదురు బొంగులతోనే ఆ కంచె తయారైంది. దీనిని రోడ్డు పక్కన అమర్చే ముందు ఎన్నో కఠిన పరీక్షలు చేశారు. ఈ పరీక్షలు నిర్వహించిన ఆనేక ప్రభుత్వ సంస్థలలో పిథంపూర్‌కు చెందిన నేషనల్ ఆటోమోటివ్ టెస్ట్ ట్రాక్స్ కూడా ఉంది. నిప్పు అంటుకోకుండా దీనికి ఉన్న సామర్థ్యం, ప్రత్యేకత కూడా గణనీయంగా ఉంటాయని సెంట్రల్ బిల్డింగ్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ నిర్ధారించింది. దీనిని ఇప్పుడు లాంఛనంగా ఇండియన్ రోడ్ కాంగ్రెస్ వినియోగంలోకి తేవడానికి ఆమోదించింది. కార్బన్ జాడలు కనిపించకుండా ప్రత్యామ్నాయాల కోసం ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేస్తున్నది. పర్యావరణ హితమైన నిర్మాణాలు, ఆవిష్కరణల కోసమే ఇప్పుడు అంతా ఎదురు చూస్తున్నారు. భారత్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద రోడ్డు రవాణా వ్యవస్థ కలిగిన దేశం కావడంతో ఇలాంటి ప్రత్యామ్నాయాల అన్వేషణ అనివార్యమైంది. ఇప్పుడు నిర్మించిన వెదురు బారియర్ ఇనుము ఉక్కులకు ప్రత్యామ్నాయంగా తెచ్చినదే. ఇది పర్యావరణ హితమైనది. ఇది త్వరలోనే వ్యవసాయ హితమైన, గ్రామీణ ప్రాంత హితమైన తయారీగా కూడా ఆవిర్భవించే అవకాశం ఉంది. వెదురుతో 200 మీటర్ల బారియర్‌ను నిర్మించడం ప్రపంచంలో ఇదే మొదటిసారి. ఇది గొప్ప విజయమని రోడ్డురవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ వ్యాఖ్యానించారు. ★

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశాఖలో రెండురోజుల పాటు నిర్వహించిన ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సును ఎన్నికల కోసం నిర్వహించిన ప్రచారంగా రాజకీయ పార్టీలు విమర్శిస్తున్నాయి. పరిశ్రమలు, పెట్టుబడులపై మూడున్నరేళ్లు మౌనం వహించి.. గతంలో కుదిరిన ఒప్పందాలను, వచ్చిన పెట్టుబడులను తరిమేసి ఎన్నికలు సమీపిస్తుండటతో ఇప్పుడు ఏదో చేస్తున్నామని చెప్పుకునేందుకు ఈ సదస్సును నిర్వహిస్తోందంటున్నాయి. 'లక్షల కోట్ల విలువైన ఎంవోయూ'లు కుదిరాయని చెప్పడమే లక్ష్యంగా.. అబద్ధాలు, అతిశయోక్తులూ జోడించి ప్రభుత్వం అధికారిక ప్రకటనలు జారీ చేస్తోందని విమర్శిస్తున్నాయి.**



# పెట్టుబడుల సదస్సా

ఏపీ ప్రభుత్వం మార్చి 3,4 తేదీల్లో విశాఖపట్నంలో 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్' నిర్వహించింది. తొలి రోజునే రూ. 11.87 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులపై అవగాహన ఒప్పందాలు (ఎంవోయూ) కుదిరాయని ప్రభుత్వం చెప్పుకొంది! మొత్తంగా 13 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని తెలిపింది. ఇవన్నీ కార్యరూపం దాలుస్తాయా? అనేది ప్రశ్నార్థకమే. వీటిలో పదిశాతం పరిశ్రమలు ఏర్పాటైనా మంచే జరుగుతుంది. కాని ఈ మూడేళ్లలో పారిశ్రామిక విధానం పట్ల ప్రభుత్వం చూపించిన నిర్లక్ష్య భావన, సమాజంలో అశాంతి ప్రభావంతో ఇక్కడ పరిశ్రమలు పెట్టడానికి ఎవరైనా వస్తారా? అనేది ప్రశ్నార్థకమే. ఒకరిద్దరు పేరున్న వారిని ముందు చూపించి వెనుక ఎవరో ఒకరిని నిలబెట్టి తామేదో భారీగా పరిశ్రమలు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు గొప్పలు చెప్పి ప్రచారం చేసుకునేందుకు నాటకం ఆడుతున్నట్లు కూడా భావించాల్సి వస్తోంది.

మొదటిరోజు జరిగిన సదస్సులో విద్యుత్ ఉత్పత్తి రంగానికి చెందిన సంస్థలు రూ. 8.5 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందాలు చేసుకున్నాయని ప్రభుత్వం ప్రకటించింది. సౌర, పవన విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు భారీగా భూమి అవసరం. ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల ప్రకారం ఈ సంస్థలకు 3,75,000 ఎకరాల భూమి అవసరం. ఇంత భూమిని కేటాయించడం ప్రభుత్వానికి సాధ్యమేనా? అసలు ఇంత భూమి అందుబాటులో ఉందా? అనేది ప్రశ్నార్థకం. సదస్సు ఏర్పాటు సందర్భంగా పరిశ్రమల కోసం రాష్ట్రంలో 80,000 ఎకరాల భూమి అందుబాటులో ఉందని ప్రభుత్వం తెలిపింది. మరి ఇంధన రంగానికి 3,75,000 ఎకరాల భూమి ఎక్కడ నుంచి కేటాయిస్తారని నిపుణులు, పార్టీలు ప్రశ్నిస్తున్నాయి. అయితే పరిశ్రమల పేరు చెప్పి భూములను కొట్టేసే సంస్థలు కూడా అందులో ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికే ఒక సంస్థకు 2.50 లక్షల ఎకరాల భూమిని కేటాయించడానికి ముందుగానే ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

**అన్నీ అవే సంస్థలా?**

ప్రపంచ పెట్టుబడుల సదస్సులో సోలార్ పవర్ ఉత్పత్తికి చెందిన సంస్థలే ఎక్కువగా ఉన్నాయి. వివిధ ఉత్పత్తులకు సంబంధించిన సంస్థలు రాలేదు. పైగా వచ్చినవాటిలో కూడా గత ఏడాది నుంచి చెబుతున్న పేర్లే ఇక్కడ కూడా ఉన్నాయి. ఆరు నెలల క్రితం దావోస్‌లో పర్యటించి వచ్చిన ముఖ్యమంత్రి ఏస్ అర్బన్ డెవలపర్స్, గ్రీన్ గ్రూప్, అరబిందో రియాల్టీ ఇన్‌ఫ్రా, ఆదానీ గ్రీన్ ఎనర్జీ సంస్థలతో రూ. 1.25 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు చేసుకున్నారు. తర్వాత సెప్టెంబరులో స్టేట్ ఇన్‌వెస్ట్‌మెంట్ బోర్డు ఆస్తా సోలార్ పవర్, ఇండోసోల్, అరబిందో రియాల్టీ, గ్రీన్ ఎనర్జీ, గ్రీన్‌గ్రూప్‌లతో ఒప్పందాలు చేసుకుంటే ఇప్పుడు అవే సంస్థలు మరలా ఒప్పం దాలు చేసుకున్నాయంటూ ప్రభుత్వం చెబుతోందని ప్రతిపక్షాలు, నిపుణులు విమర్శిస్తున్నారు. ఇది ప్రజలను మాయచేయడానికి పెట్టిన సదస్సు తప్ప పెట్టుబడులు తెచ్చేందుకు కాదని ఆరోపిస్తున్నారు.

**మౌలిక సదుపాయాలపై దృష్టి ఏది?**

వైసీపీ ప్రభుత్వం ఈ మూడున్నరేళ్లలో మౌలిక సదుపాయాలను నిర్లక్ష్యం చేసింది. రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం నిర్మించే ప్రాజెక్టులు తప్ప మరే విధమైన అభివృద్ధి పనులు జరగడం లేదు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రైల్వే ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం తన వంతు నిధులు ఇవ్వకపోవడంతో ముఖ్యమైన నడికుడి– శ్రీకాళహస్తి, కోటిపల్లి– నరసాపురం మధ్య నూతన లైను నిర్మాణం ఆగిపోయింది. ఇక కేంద్రం పది ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి అనుమతిని ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం నాలుగింటికి మాత్రమే శంకుస్థాపనలు చేసింది. విశాఖ–చెన్నై పారిశ్రామిక కారిడార్, కాకినాడ పెట్రోకెమికల్ సమూహం, శ్రీకాళహస్తి ఎలక్ట్రానిక్స్ పారిశ్రామిక క్లస్టర్, బెంగుళూరు–చెన్నై పారిశ్రామిక క్లస్టర్, శ్రీసిటి పారిశ్రామిక సమూహం, ప్రకాశం, చిత్తూరు జిల్లాల్లో రెండు సమీకృత పారిశ్రామిక టౌన్‌షిప్ (నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ మ్యానుఫాక్చరింగ్ జోన్)ల ఏర్పాటుకు కేంద్రం అనుమతిని ఇస్తే భూసేకరణ చేయకపోవడంతో పరిశ్రమలు ఏర్పడక, ఇవి అందుబాటులోకి రాలేదు. ఫలితంగా యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయి.

**శాంతిభద్రతలున్నాయా?**

శాంతిభద్రతల విషయంలో వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. తన పాలనా వైఫల్యాన్ని, అవినీతిని, రౌడీయిజాన్ని ప్రశ్నిస్తోన్న పార్టీలు, ప్రజలు, ఉద్యమకారులకు సమాధానం చెప్పలేక, సమస్యలు పరిష్కరించక... వైసీపీ కార్యకర్తలు, పోలీసులచే ఎదురుదాడులకు దిగుతోందనేది ప్రపంచం చూస్తున్న విషయమే. మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు జరుగుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇలా శాంతి భద్రతలు అదుపుతప్పిన సమాజంలో పెట్టుబడి దారులకు అనువైన వాతావరణం ఎలా కల్పిస్తారు?

**ఈ ప్రశ్నలకు సమాధానాలు చెబుతారా?**

పెట్టుబడుల ఆహ్వానానికై ప్రపంచ పెట్టుబడుల సదస్సును నిర్వహించిన ప్రభుత్వం ఈ రంగానికి






**వల్లూరు జయప్రకాష్ నారాయణ**

# ? ఎన్నికల ప్రచారమా?

చెందిన ప్రధాన ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని రాజకీయ పార్టీలు, నిపుణులు, పారిశ్రామికవేత్తలు కోరుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వద్ద ఏదైనా పారిశ్రామిక ప్రోత్సాహక విధానం ఉందా? ఉంటే ఈ నాలుగేళ్లలో ఎన్ని పరిశ్రమలు ఏర్పడ్డాయి? వీటితో ఎంత ఆదాయం లభించింది? ఎంతమందికి ఉపాధి లభించింది? ఎన్ని కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయి? అనే విషయంపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరుతున్నారు. అలాగే ప్రభుత్వం నుంచి సమాధానం లభించని ఇంకా ఎన్నో ప్రశ్నలున్నాయి.

- ఆంధ్రప్రదేశ్ రాజధాని ఏది? 9 ఏళ్లలో ఒక రాజధానినే నిర్మించుకోలేని రాష్ట్రంలో పెట్టుబడి దారులకు ఎలాంటి నమ్మకాన్ని కలిగిస్తారు?
- రాజధాని అమరావతి నిర్మాణానికి నమ్మి స్థలాలిచ్చిన రైతులకు అన్యాయం చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో కొత్త పరిశ్రమ లకు భూ సేకరణ సరిగా జరుగుతుందా?
- రియల్ ఎస్టేట్ నుంచి విద్యాసంస్థల వరకు, తాపీపని వారి నుంచి టీచర్ల వరకు పెట్టిన బాధలు, దాడులు కొత్తగా వచ్చే పరిశ్రమలపై ఉండవన్న గ్యారెంటీ ఉందా?
- నిర్మాణరంగంలో పనిచేసే కార్మికులకు ఈ ప్రభుత్వంపై నమ్మకం ఉందా? నాలుగేళ్లుగా నిర్మాణరంగాన్ని ఈ ప్రభుత్వమే దెబ్బతీసిందనే ఆరోపణలకు మీ సమాధానం?
- తన ఉద్యోగులకు సకాలంలో జీతాలే ఇవ్వలేని ప్రభుత్వాన్ని నమ్మి పెట్టుబడిదారులు ఇక్కడ పెట్టుబడులు ఎలా పెట్టగలరు?
- పన్నులు పెంచి, పెరిగిన ధరల్ని అదుపు చేయక, సరైన ఉపాధి అవకాశాలు కల్పించక, కొనుగోలు శక్తి పడిపోయిన సగటు పౌరుడిని ఆదుకోలేని మీరు కొత్తగా పరిశ్రమలు పెట్టేవారిని ఎలా ప్రోత్సహిస్తారు?
- కడపలో స్టీలు ఫ్యాక్టరీకి మూడుసార్లు శంకు స్థాపనలు జరిగాయి? ఇంకా ఎన్నిసార్లు చేస్తారు?
- కియా కంపెనీకి అనుబంధ కంపెనీలు ఎన్ని తీసుకువచ్చారో లులూ సంస్థ ఇక్కడ నుంచి ఎందుకెళ్లిపోయిందో చెప్పగలరా? హెచ్ఎస్‌బీసీ ఇక్కడ నుంచి వెళ్లకుండా ఆపే కనీస ప్రయత్నం చేశారా?
- అమర్‌రాజా బ్యాటరీస్‌పై కక్షసాధింపు చర్యల ఆరోపణలపై మీ సమాధానం ఏమిటి? పక్క రాష్ట్రానికి పెట్టుబడులు వెళ్లడానికి కారణం మీ ప్రభుత్వం కాదా?
- మూడున్నరేళ్లలో రాష్ట్రంలో అప్పటికే ఉన్న పోర్ట్‌లు తప్ప కొత్తగా ఒక్కపోర్ట్‌నైనా నిర్మించారా?
- 2019లో విశాఖలో దాదాపు యాభైవేల మంది ఐటీ ఉద్యోగులుంటే ఇప్పుడెందుకు తగ్గిపోయారు? ఎంత మంది పనిచేస్తున్నారు?
- మీ ప్రభుత్వం వచ్చాక ఇండస్ట్రియల్ ఇన్సెంటివ్స్ ఎంతిచ్చారు?
- గతంలో శంకుస్థాపన చేసిన అదానీ డేటా సెంటర్ తన ఉత్పత్తిని ప్రారంభించకున్నా మళ్లీ ఎందుకు అదనంగా భూమి కేటాయించారు?
- భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను నాలుగేళ్లు శంకుస్థాపన చేయకుండా వదిలేసి ఇప్పుడు ఎందుకు హడావిడి చేస్తున్నారు?

**రాజకీయ ప్రయోజనాల కోసమేనా?**

రూ. 250 కోట్లతో నిర్వహించిన ఈ సదస్సు రాజకీయ ప్రయోజనాలు, ఎన్నికలకు కావాల్సిన నిధులను సమకూర్చుకోవడం కోసం తప్ప పరిశ్రమల కోసం, ఉద్యోగకల్పన కోసం కాదనేది రాజకీయ పార్టీల విమర్శ. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ సదస్సు కేవలం నెల్లూరు నుంచి విశాఖ వరకు టూరిజం అభివృద్ధికి ఉన్న అవకాశాలపై చర్చించడం కోసమే నిర్వహించినట్లుగా ఉందని ఆరోపిస్తున్నారు.

వ్యాసకర్త : చైర్మన్, సెంట్రల్ లేబర్ వెల్ఫేర్ బోర్డు,
కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ

**శాంతిభద్రతల విషయంలో వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. తన పాలనా వైఫల్యాన్ని, అవినీతిని, రౌడీయిజాన్ని ప్రశ్నిస్తోన్న పార్టీలు, ప్రజలు, ఉద్యమకారులకు సమాధానం చెప్పలేక, సమస్యలు పరిష్కరించక... వైసీపీ కార్యకర్తలు, పోలీసులచే ఎదురుదాడులకు దిగుతోందనేది ప్రపంచం చూస్తున్న విషయమే. మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు జరుగుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.**

# రామాయణ సృష్టికి మహర్షులే స్ఫూర్తి



**రా**మాయణంలో రాజులు ఎంతటి పాత్ర పోషించారో మహర్షులూ అంతటి పాత్ర పోషించారని చెప్పవచ్చు. మనం ప్రస్తుతం రామాయణంలో ప్రముఖంగా కనిపించే కొందరి పాత్ర గురించి రేఖా మాత్రంగా తెలుసుకుందాము. ఆ తర్వాత పాత్రల ప్రాధాన్యతను బట్టి మరింత లోతుగా తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

అసలు ఆ మాటకొస్తే శ్రీరామాయణ కావ్యం వాల్మీకి, నారదమహర్షుల ప్రశ్నోత్తరాలతోనే ప్రారంభమవుతుంది.

'షోడశగుణ పూర్ణుడైన మానవుడు ఈ లోకంలో.. ఈ కాలంలో ఉన్నాడా?' అని.. తపోధనుడైన వాల్మీకి.. వేదవేత్తలలో శ్రేష్ఠుడైన దేవర్షి నారదుని అడిగాడు. 'ఇక్ష్వాకు వంశంలో రాముడను పేరుతో ప్రసిద్ధి చెందిన, లోకంలోని వారందరిచే ప్రశంసలు అందుకుంటున్న మానవుడు కలడు' అని దానికి నారదుడు బదులిచ్చాడు. అలా శ్రీ రామాయణావతరణకు నారద వాల్మీకి మహర్షులే మూలకారకులు.

శ్రీ రామాయణ గ్రంథారంభం నుండి శ్రీరామపట్టాభిషేక ఘట్టం వరకు గల అనేక ముఖ్య సందర్భాలలో కీలకపాత్రను పోషించిన వశిష్ఠ మహర్షి ఇక్ష్వాకు వంశానికి కులగురువు. బ్రహర్షియైన అయన ఆజ్ఞకు రఘువంశ రాజులు ఏనాడూ ఎదురు చెప్పలేదు. దశరథ మహారాజు నిర్వహించిన అశ్వమేధ, పుత్రకామేష్టి యాగాలు, దశరథ నందనుల నామకరణం, విశ్వామిత్రుని యాగ సంరక్షణ నిమిత్తం రామలక్ష్మణులను పంపించడానికి దశరథుని ఒప్పించడం.. ఇలా ఎన్నో విశిష్ట కార్యాలను నిర్వహించింది వశిష్ఠ మహర్షే. అలాగే.. విభాండక మహర్షి కుమారుడైన రుష్యశృంగ మహర్షి.. దశరథుని ఆహ్వానం మేరకు 'పుత్రకామేష్టి' అనే బృహద్యాగంలో పాల్గొని ఆశీస్సుల నందించి యాగ సాఫల్యానికి కారకుడయ్యాడు.




## ❄ 'మొక్క'బడి ❄

# సుగంధ ద్రవ్యాలలో మేటి లవంగం

**మ**నం వంటల్లో తరచూ ఉపయోగించే లవంగం మొగ్గలను సుగంధ ద్రవ్యాల్లో మేటిగా వ్యవహరిస్తారు. ఈ మొగ్గలు పూర్తిగా విరబూయకుండానే చెట్టు నుండి వేరు చేస్తారు. గులాబీ రంగులో ఉండే ఇవి ఎండబెట్టిన తరువాత నల్లగా మారుతాయి.

సతతహరిత వృక్షంగా చెప్పుకునే లవంగ చెట్టు 10 నుంచి 20 మీటర్ల ఎత్తువరకు పెరుగుతుంది. వందేళ్ల వరకు జీవిస్తుంది. మన దేశంలో కేరళ, తమిళనాడులలో దీనిని అధికంగా సాగు చేస్తారు. ఇప్పుడిప్పుడే దీనిని మిద్దెతోటల్లో కూడా సాగు చేస్తున్నారు. దీని ఆకులు ఆకుపచ్చ, రాగిరంగులో ఉంటాయి.

లవంగాలను కేవలం వంటల్లోనే కాకుండా ఔషధంగా కూడా పయోగించవచ్చు. ఈ మొగ్గల్లో ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయి. వివిధ రకాల అనారోగ్య సమస్యలను నయం చేయడంలో ఎంతో దోహదపడతాయి. దంతాల సమస్యల నివారణలో లవంగాలు దివ్యౌషధంగా పని చేస్తాయి. పంటి నొప్పితో బాధపడుతున్నప్పుడు రెండు లవంగాలను నోట్లో వేసుకుని చప్పరించడం వల్ల ఉపశమనం కలుగుతుంది.

చిగుళ్ల నొప్పులు బాధిస్తున్నప్పుడు లవంగం నూనెలో దూదిని ముంచి చిగుళ్లపై రాయడం వల్ల చిగుళ్ల నొప్పులు తగ్గుతాయి. నోటి దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నప్పుడు లవంగాలను నోట్లో వేసుకుని చప్పరించడం వల్ల లాలాజలంలో ఉండే బాక్టీరియా నశించి దుర్వాసన తగ్గుతుంది. ఒక కప్పు నీటిలో 8 లవంగాలను వేసి కాచి వడకట్టి ఆ నీటిని నిల్వ చేసుకోవాలి. రోజుకు మూడు పూటలా ఒక టీ స్పూన్ కషాయంలో తేనెను కలిపి తీసుకోవడం వల్ల ఉబ్బసం తగ్గ ముఖం పడుతుంది.

లవంగాల్లో ఉండే రసాయనాలు కఫాన్ని తొలగించడంలోనూ సహాయపడతాయి. లవంగం పొడిని నీటిలో మరగించిన తాగడం వల్ల అజీర్తి,



## దోర్బల పూర్ణిమాస్వాతి

శ్రీరాముని శక్తిని, శ్రీరామతత్త్వాన్ని లోకానికి ముందుగా తెలియపరిచినవాడు విశ్వామిత్ర మహర్షి. తన వద్దనున్న బల, అతిబల విద్యలను జృంభక మొదలైన అస్త్రాలను రామలక్ష్మణులకు ఉపదేశించాడు. తన యాగాలకు అడ్డంకులు కల్పిస్తున్న తాటక, సుబాహువుల సంహారం ద్వారా.. దుష్టశిక్షణకు, శిష్ట రక్షణకు అవతరించిన సత్య పరాక్రమవంతుడైన మహాత్ముడే శ్రీరాముడు అని లోకానికి చాటి చెప్పాడు. ఆ తర్వాత రామలక్షణులను జనకుని కొలువుకు తోడ్కొని వెళ్లి, శివధనుర్భంగం చేయించి, సీతాదేవితో వివాహం జరిపించి, రావణవధకు బీజం వేసి లోకక్షేమానికి దోహదపడిన మహనీయుడు విశ్వామిత్ర మహర్షి.

వనవాస దీక్షలోనున్న సీతారామ లక్ష్మణులకు ఆతిథ్యాన్ని ఇచ్చింది, చిత్రకూట ఆశ్రమ నిర్మాణానికి అనుకూల ప్రదేశమని తెలిపినవారు భరద్వాజ మహర్షి. రావణ వధానంతరం తన ఆశ్రమానికి వచ్చిన శ్రీరామునికి ఆయన రెండు వరాలు అనుగ్రహించారు.

విరాధుడు చెప్పిన ప్రకారం శ్రీరాముడు శరభంగ మహర్షి ఆశ్రమానికి వెళ్లాడు. 'నేను చేసిన తపముతో ఎన్నెన్నో పుణ్యలోకాలు, మరెన్నో పుణ్యఫలాలు నాకు వశమయినాయి. చిత్ర విచిత్రములైన సుఖాలను కలిగించే ఆ పుణ్యఫలాలను సమర్పిస్తాన'ని శరభంగ మహర్షి చెప్పినా రాముడు ఒప్పుకోలేదు.

'ఈ అడవిలో నివాసయోగ్యమైన, ఆహ్లాదకరమైన ప్రదేశాన్ని తెలపండి చాలు' అని శ్రీరాముడు కోరగా..సుతీక్ష మహర్షి దగ్గరకు పంపాడు. ఇక.. శ్రీరామచంద్రునికి ఆదిత్యహృదయాన్ని ఉపదేశించి, రావణవధకు సహకరించిన తపః సంపన్నుడు.. అగస్త్య మహర్షి.

ఇలా ఎందరో మహర్షులు రాముని తీర్చిదిద్ది.. ఆ అవతారపురుషుని చరితను జనులకు శాశ్వతంగా అందించి, వారు తరించడానికి కారకులయ్యారు. వీరిలో కొందరి గురించి చెప్పుకున్నాం. వసిష్ఠ విశ్వామిత్ర భరద్వాజ మహర్షుల గురించి ముందు ముందు మరికొంచెం నిశితంగా చర్చించుకుందాం. ★

తలతిరగడం, వాంతులు వంటి సమస్యలు తగ్గుముఖం పడతాయి. ఐదు లవంగాలను దంచి వస్త్రంలో ఉంచి వాసన చూస్తూ ఉండడం వల్ల తలనొప్పి తగ్గుతుంది. లవంగం నూనెను తల మాడుపై రాసి మర్దనా చేయడం వల్ల తలనొప్పి నుండి ఉపశమనం కలుగుతుంది. ఒక టీ స్పూన్ తేనెలో చిటికెడు లవంగాల పొడిని కలిపి తీసుకోవడం వల్ల కడుపులో వికారం తగ్గుతుంది.

దగ్గు తీవ్రంగా బాధిస్తున్నప్పుడు టీలో లవంగం పొడిని కలుపుకుని తాగడం వల్ల దగ్గు నుండి ఉపశమనం కలుగుతుంది. రెండు లవంగాలను నోట్లో వేసుకుని రసం మింగుతూ ఉండడం వల్ల మద్యం తాగాలనే ఆలోచన రాకుండా ఉంటుంది. లేత మామిడి ఆకుల రసంలో లవంగం పొడిని కలుపుకుని తాగడం వల్ల అజీర్తి, కడుపు ఉబ్బరం, వాంతులు తగ్గుతాయి. వీటిని తరచూ ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. మెదడు పనితీరు మెరుగుపడుతుంది, రక్తప్రసరణ వ్యవస్థ మెరుగుపడుతుంది, కీళ్ల నొప్పులు తగ్గుతాయి. కీళ్ల నొప్పుల ప్రదేశంలో లవంగం నూనెను పైపూతగా రాయడం వల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది.

మధుమేహ వ్యాధిగ్రస్తులు లవంగాలను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయులు నియంత్రణలో ఉంటాయి. గంధంలో లవంగం పొడిని కలుపుకుని శరీరానికి నలుగుగా రాసుకుని స్నానం చేయడం వల్ల చర్మం కాంతివంతంగా తయారవడమే కాకుండా చర్మ సంబంధిత సమస్యలు కూడా దూరమవుతాయి.

వీటిలో పుష్కలంగా ఉండే యాంటీ ఆక్సిడెంట్లు క్యాన్సర్ కారకాలను నశింపచేస్తాయి. 'అతి సర్వత్ర వర్జయేత్' అన్నట్లు లవంగం నూనెను చర్మానికి ఎక్కువ మొత్తంలో రాయడం వల్ల చర్మం సున్నితత్వాన్ని కోల్పోతుంది. అంతేకాకుండా చర్మంపై దురదలు వచ్చే అవకాశం కూడా ఉంటుంది. కనుక లవంగాలను తగిన మోతాదులో తీసుకుని ఆరోగ్యకరమైన ప్రయోజనాలను పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ★

❋ తాత్వి'కత' ❋

# వదరు మాటలు

'ఆ పాండవులెంత, ఆ భీముడెంత, ఆ అర్జునుడెంత... చిటికెలో చంపేస్తా... నా దగ్గర భీష్మ, ద్రోణ, కర్ణులు ఉన్నారు. నాకింతమంది సోదరులున్నారు. నాకిన్ని అక్షౌహిణుల సైన్యం ఉంది...' అంటూ విర్రవీగేవాడు దుర్యోధనుడు. ఆయనకు మంచి మాటలు చెప్పనివారెవరు? అందరూ చెప్పారు. కానీ వినలేదు. వినకపోగా చెప్పేవాళ్లను అవమానించేలా ప్రవర్తించేవాడు. చివరికి రాయబారం చేయడానికి వచ్చిన కృష్ణుడిని కూడా బంధించబోయాడు. ఒకరోజు మైత్రేయ మహర్షి వచ్చాడు.

'తప్పు దుర్యోధనా! పాండవులు ధర్మమార్గంలో ఉన్నవాళ్లు. వాళ్లతో నీకు గొడవలెందుకు, వాళ్లకివ్వాల్సిన రాజ్యభాగం ఇచ్చేయి' అని నచ్చచెప్పబోయాడు. ప్రతిరోజూ ఎవడో ఒకడు రావడం ధర్మపన్నాలు వల్లించడం అలవాటయి పోయిందంటూ.. మహర్షి మాట్లాడుతున్నప్పుడు వెటకారంగా తొడల మీద తాళం వేస్తున్నట్లు చెయ్యి తిప్పుతున్నాడు దుర్యోధనుడు.

దాంతో మహర్షికి ఎక్కడలేని కోపం వచ్చింది. 'నేను ప్రయాసలకోర్చి నీ మంచి కోరి నీకు నాలుగు మంచిమాటలు చెప్పిపోదామని వస్తే శ్రద్ధతో వినకపోగా ఎగతాళి చేస్తూ, నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నావు. ఏ తొడలను



తక్కువగా భావించి వాటిమీద వెకిలిచేష్టలు చేసావో ఆ తొడలే భీమసేనుడి చేతిలో చితికిపోయి యుద్ధభూమిలో పడిపోయెదవుగాక!" అని శపించాడు.

ధృతరాష్ట్రుడు వెళ్లి మైత్రేయ మహర్షి కాళ్లమీద పడ్డాడు, శాపాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ, "పాండవులతో నీ కుమారుడు సంధి చేసుకుంటే ఆ శాపం అన్వయం కాదు, చేసుకోకపోతే ... చెప్పిన మాట వినలేదు కాబట్టి జరగాల్సింది జరుగుతుంది' అన్నాడు మహర్షి. అదే జరిగింది.

బలవంతుడ నాకేమని విర్రవీగినందుకు ఫలితం అది... తన బలం, బలగం అనుకొన్నవారిలో ఒక్కొక్కరు వెళ్లిపోయారు. భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, శల్యుడు, సోదరులు అందరూ వెళ్లిపోయారు.. ఓ నలుగురు తప్ప. యుద్ధభూమిలో భీముడి గదాఘాతానికి తొడలు విరిగిపోయి, నెత్తురు ఓడుస్తుండగా అప్పుడు ఏడ్చాడు. ఋషులు చెబితే వినలేదు, విదురుడు చెప్పినా వినలేదు... చివరకు అందర్నీ చంపేసుకొన్నా... అంటూ తన దుస్థితిని తలుచుకుని విలపించాడు.

ఎందుకంత పొగరుబోతుతనం... ధనం కానీ, అధికారం గానీ, ఇతరత్రా నైపుణ్యాలు, పాండిత్యం కానీ నీకు భగవంతుడేదో ఇచ్చి ఉండ వచ్చు. వాటిని కాస్త ఎక్కువే ఇచ్చి ఉండవచ్చు. అందుకు భగవంతుడిపట్ల వినయ విధేయతలతో కృతజ్ఞుడిగా ఉండడానికి బదులు, బలం చూసుకొని అహంకారంతో వదరి మాట్లాడడం అత్యంత ప్రమాదకరం. ★




ఖనా, వరాహమిహిరుల వివాహం వైదిక సంప్రదాయం ప్రకారం విక్రమాదిత్యుని సమక్షంలో జరిగింది. డేరియస్ కోరికపై పారశీక పద్ధతిలో కొన్ని వివాహ కర్మకాండలు అతని వెంట వచ్చిన పూజారి జరిపించాడు. నూతన వధూవరులు ఛాయాదేవీ, ఆదిత్యదాసులకూ, డేరియస్‌కూ నమస్కరించాడు. తరువాత మిహిరుడు సతీసమేతంగా విక్రమాదిత్యుని దగ్గరకు వెళ్లి "నా వివాహం తమ సమక్షంలో జరగడం నా అదృష్టం మహారాజా!" అన్నాడు.

విక్రముడు "సర్వేశ్వరుడు మిమ్ము సదా రక్షించును గాక. నేడు చైత్ర పూర్ణిమ. వాల్మీకి మహర్షి 'విరరాజ మహాబాహు: చిత్రయా చంద్రమా ఇవ' అని వర్ణించారు. నీవును చిత్రా నక్షత్రయుక్త పూర్ణచంద్రుని వలె ఉన్నావు సుమా!" అన్నాడు.


మహారాణి ఖనాకు అనేక వస్త్రాభరణాలను కానుకగా ఇచ్చింది.

* * *

రాత్రి ప్రాసాదంపైకి ఖనా, మిహిరులు వెళ్లారు. జామురాత్రయింది. పున్నమి నాటి చంద్రుడు వెన్నెలను కురిపిస్తున్నాడు. మిహిరుడు చెయ్యి పైకెత్తి చూపుతూ "అదిగో చిత్తా నక్షత్రం. పౌర్ణమినాడు చంద్రునికి దగ్గరగా చిత్తా ఉంటుంది కాబట్టి ఈ నెలకు చైత్ర మాసమని పేరు" అన్నాడు.

"ఈ వేళ కూడా ఖగోళశాస్త్ర పాఠమేనా?"

"లేదు మహారాజు మనను చిత్రాచంద్రులతో పోల్చారు. అది గుర్తుకు వచ్చి....



పాలంకి సత్య

"అదిగో చిత్ర తర్వాత ఎర్రటి మందారము వంటి స్వాతి. ఆపైన బంగారు రంగులో విశాఖ".

"అసూయ ముందుగా, ఆడుది తరువాతగా పుట్టినవట. ఇతర నక్షత్రాల గురించి అభద్రతా భావమేల?"

ఖనా అలిగినట్లుగా ముఖంను మార్చి దూరంగా జరిగింది.

మిహరుడామెను దగ్గరగా తీసుకొని "నా పేరు మిహిరుడు. ఆ మాటకు సూర్యుడని అర్థం" అన్నాడు.

ఖనా ప్రసన్నదృష్టిని ప్రసరించింది.

చిత్రా నక్షత్రానికి యవన భాషలో స్పైకా అని పేరు. స్పైకా అంటే వెలుగు లేదా తేజస్సు. అపూర్వ తేజోవతివి నీవు. నిన్ను ఎవరూ మించలేరు".

ఖనా అతని భుజం మీద తల పెట్టుకున్నది.

"స్పైకా అంటే వెలుగు అని తెలియచేశాను కదా. కన్యారాశిలో అన్నిటికన్నా తేజోవంతమైన నక్షత్రం చిత్ర..." అని చెప్తున్న మిహిరుని వారిస్తూ ఖనా, "ఆకాశంలోని కన్యపైననే దృష్టి కలిగి ప్రక్కనే ఉన్న కన్యపై దృష్టి లేని వారికి కన్యావరణమేల? అన్నది.

మిహిరాడామెను మరింత దగ్గరగా తీసుకొని కన్యావరణమిందుకే అని ఆమె చెవిలో చెప్పాడు. ఖనా ఆనంద వర్షంలో తడిసిపోయింది.

* * *

జూలియస్ సీజర్ హిస్పానియాకు ప్రయాణ సన్నాహాలు చేస్తుండగా, అతని భార్య కొర్నిలియా మరణించింది. ఆమె ప్రసూతి సమయంలో మరణించడమూ, జన్మించిన మగ శిశువు సైతం దక్కకపోవడమూ సీజర్‌ని కొద్దిగా నిరుత్సాహ పరిచాయి. ఆమె అంతిమయాత్ర సమయంలో అతడిచ్చిన ఉపన్యాసమందరినీ ఆకట్టుకుంది. మేనత్త మరణించినప్పుడే జూలియస్ సీజర్ గొప్ప ప్రసంగకర్త అని అనుకున్నారు కానీ, ఇప్పుడు అప్పటికన్నా గొప్పగా మాట్లాడడం శ్రోతలను ఆశ్చర్యపరిచింది. సాధారణంగా చిన్న వయసులో ఉన్నవారు చనిపోయినప్పుడు ఎవరూ ఎక్కువగా మాట్లాడలేరు. కానీ సీజర్ కొర్నిలియా గుణగణాలను వర్ణిస్తూ, తనకు ఆమెపై గల అనురాగాన్ని తెలియజేస్తూ అందరూ కంటనీరు పెట్టేలా మాట్లాడాడు. "ఇతని హృదయానికి నేనే అధికారిని అనుకున్నాను. భార్యపై ఇంత ప్రేమ ఉందా?" అని అతని ప్రేయసి సెర్విలియా అనుకున్నది. ఆమె మొదటి పంక్తిలోనే కూర్చోవడం వల్ల సీజర్‌కు ఆమె మనోభావాలు తెలిశాయి.

హిస్పానియాకు చేరుకున్న జూలియస్ సీజర్ రాజ్యమంతటా పర్యటించి, పరిస్థితిని ఆకళింపు చేసుకున్నాడు. ఎవరు మిత్రులో, ఎవరు శత్రువులో, శత్రువులను ఏ విధంగా లొంగతియ్యాలో తెలుసుకుని, అందరూ తన పాదాక్రాంతులయ్యేలా చూసుకున్నాడు. ఒకనాటి పర్యటనలో అతనికి గుర్రం మీద ఉన్న వీరుని శిలావిగ్రహం కనిపించింది.

"ఎవరిదీ విగ్రహం?" అని అడిగిన సీజర్‌కు సమాధానం చెప్పడానికి అధికారులు సంకోచించారు.

"ఎవరిదీ విగ్రహం? మీకు తెలియదా? నాలుగు రోజులలో తెలిసికొని చెప్పండి. లేదా..." సీజర్ కంఠంలో కొరత వేయించగలనన్న బెదిరింపు.

అధికారులు ఒకరివంక ఒకరు చూసుకున్నారు. వారిలో ఒకరు ధైర్యం చేసి "ఈ విగ్రహం మాసిడోనియా రాజైన అలెక్సాండరుది" అన్నాడు.

"మాసిడోనియా అంటే గ్రీసులో భాగమే కదా. గ్రీసు ఇప్పుడు మన అధికారంలోనే ఉన్నది కదా!".


అధికారులు అంగీకార సూచకంగా తల పంకించారు.

"ఈజిప్టులో ఇతని పేర నగరమున్నట్లున్నది. గ్రీసు నుంచి ఈజిప్టు వెళ్లినాడా"?

"అలెక్సాండరు చరిత్ర వింతగా ఉంటుంది. తమ అనుమతి అయితే....."

జూలియస్ సీజర్ చెప్పమన్నట్లుగా తల ఊపాడు.

"గ్రీసు దేశంలోని రాజ్యాలలో మాసిడోనియా ఒకటి. ఏథెన్సు, స్పార్టాలవలె బలమైనది కాదు. మాసిడోనియా రాజైన ఫిలిప్ కుమారుడు అలెక్సాండరు. అతడు జన్మించినప్పుడే విశ్వవిజేత



కాగలడని జ్యోతిష్కులు భవిష్యత్తును సూచించారట. వారి మాట సత్యమయింది. అలెక్సాండరు మొదటగా ఏథెన్సు, స్పార్టాలను తన వశం చేసుకున్నాడు. ఆపైన తూర్పు దిక్కువగా కదలి, వరుసగా రాజ్యాలను జయిస్తూ, పారసీక సామ్రాజ్యాన్ని ఆక్రమించాడు. అటు తరువాత భరతభూమిమై దండెత్తాలనుకునేసరికి అతని సైనికులు తమ తమ ఇళ్లకు పోవాలని బెంగ పెట్టుకన్నారు. అలెక్సాండరు వెనుకకు తిరిగి వస్తూ బాబిలాను నగరంలో మరణించాడు. అప్పుడతని వయస్సు ముప్పది మూడేండ్లు మాత్రమే."

'అంత చిన్న వయస్సులో అలెక్సాండరు మరణించడానికి కారణమేమి' అని జూలియస్ సీజర్ అడిగినట్లుగా ఊహించుకున్న ఒక అధికారి "సైన్యాధికారులలో ఒకరు ఆల్బము జాతి పూల విషమిచ్చి ఉండవచ్చునంటారు" అన్నాడు.

"అంతటి మహావీరుని చంపేందుకు ఎవరూ సాహసించరు" అని సీజర్ అన్నాడు. సంభాషణ అంతటితో ఆగిపోగియింది. కానీ జూలియస్ సీజర్ మనసులో ఆలోచన ఆగిపోలేదు. ముప్పది మూడేండ్లకే అలెక్సాండరు సువిశాల సామ్రాజ్యాన్ని స్థాపించాడు. తనకిప్పుడు దగ్గర దగ్గరగా అదే వయసు. తానేమి సాధించినట్లు? ఈ విధంగా ఏ ప్రయత్నమూ చేయకుండా ఉండరాదు. అలెక్సాండరుని మించి పోయేందుకు సన్నాహాలు ప్రారంభించాలి.

* * *

శరన్నవరాత్రులలో దేవిని ఉపాసించి, మహా నవమినాడు ఆయుధపూజ గావించి, విజయదశమి నాడు విక్రమాదిత్యుడు దండయాత్రకు బయలు దేరినాడు. చతురంగ బలంతో పాటు అతని వెంట మహారాణి వీరలక్ష్మీదేవి ఉన్నది.

విక్రమాదిత్యుడు శ్రావణమాసంలోనే ఆమెను నివారంచే ప్రయత్నం చేశాడు. యుద్ధయాత్రలో రాజుల వెంట స్త్రీజనం వెంట ఉండడం సామాన్యం కాదా అని ఆమె ప్రశ్నించింది.

"అంతఃపురకాంతలను యుద్ధభూమికి దూరంగా రక్షణలో ఉంచటం పరిపాటి. ఆ నియమంతో రావడానికి నీకు సమ్మతమేనా?"

"మీతో కలసి జైత్రయాత్రలో పాల్గొనవలెనన్న నా కోరికను మన్నించమని ప్రార్థన. మా తండ్రిగారు నాకు సకల విద్యలను నేర్పించినది గృహాంతర్భాగము నకే పరిమితం కమ్మని కాదు కదా! నా శబ్దవేది జ్ఞానమే మిమ్ము మొదటగా నా వైపు ఆకర్షితులను చేయలేదా?

కొంతసేపు వాదోపవాదాలైనాక విక్రమాదిత్యుడు ఆమె తనతో వచ్చేందుకు సమ్మతించి "వీరా, నీకు అపజయమన్న మాట నచ్చదు కదా!" అన్నాడు. "జయాపజయాలు శత్రువుల విషయంలో ఉంటాయి. నా ప్రాణ వల్లభుడు నా ప్రార్థనను ఆలకించారన్నదే నా భావన తప్ప వాదంలో జయించానని కాదు."

విక్రముడు చిన్నగా నవ్వాడు. ఇరువురూ ఆశ్రమానికి వెళ్లి గంధర్వసేన దంపతుల ఆశీర్వాదం

**ఎండివై రామమూర్తి స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన**

పొందారు.

* * *

ఉజ్జయినీ సైన్యం మధ్య భారత రాజ్యము లన్నింటినీ జయించి, తూర్పు సముద్రాన్ని ఆనుకుని ఉన్న కళింగ రాజ్య సరిహద్దులో విడిసింది. కళింగ రాజ్యాధిపతి తన సేనలను సమీకరించి, యుద్ధానికి సిద్ధంగా ఉన్నాడు. అతని సేనలో గజబలం ఎక్కువ. విక్రమాదిత్యుడు అది గమనించాడు.

రెండు దినాలలో యుద్ధమైనాక తన సేన అపార నష్టాన్ని గమనించిన కళింగ రాజు విక్రమాదిత్యునికి రాయబారం పంపాడు. రెండువైపులా జన నష్టాన్ని నివారించేందుకు తాను ద్వంద్వ యుద్ధాన్ని సూచిస్తున్నానని అన్నాడు. ఒక్కొక్క పక్షం నుంచి ఒక్కొక్క వీరుడు మాత్రమే యుద్ధాలలో పాల్గొనాలి. వారి మధ్య జరిగిన యుద్ధ ఫలితమే రాజ్యాల మధ్య జరిగిన యుద్ధ ఫలితంగా భావించాలి. తన పరాక్రమం మీదా, ఆయుధ ప్రయోగం మీద అపార నమ్మకమున్న విక్రమాదిత్యుడు అంగీకరించాడు. కళింగరాజు ఈ పద్ధతిని ఎందుకు సూచించినాడో? తనను మించిన వీరులు కళింగసేనలో ఉన్నట్లు వినలేదే!

**ఆ రాత్రి విక్రమాదిత్యునికి గూఢచారులు ఒక విచిత్రమైన సమాచారం తెచ్చారు. కళింగ రాజ్యం వైపు నుంచి రాజకుమారి కళింగసేన పోరాడుతుందట. ఔరా కాళింగుల కుటిల నీతి! తాను కానీ, తన సైనికులు కానీ ఒక స్త్రీతో యుద్ధం చేయరు. స్త్రీలను రక్షించడమే తమ కర్తవ్యం కానీ, వారితో పోరాడి గాయపరచడం కాదు. దురుదృష్టవశాత్తు ఆమె మరణిస్తే స్త్రీ హత్యా పాతకం చుట్టుకుంటుంది. ఇప్పుడు కర్తవ్యం? ఓటమిని అంగీకరించడం అసాధ్యం. ద్వంద్వ యుద్ధానికి అంగీకరించి, మాట తప్పడం మహా పాపం. స్త్రీతో యుద్ధం అధర్మం.**



ఆ రాత్రి విక్రమాదిత్యునికి గూఢచారులు ఒక విచిత్రమైన సమాచారం తెచ్చారు. కళింగ రాజ్యం వైపు నుంచి రాజకుమారి కళింగసేన పోరాడు తుందట. ఔరా కాళింగుల కుటిల నీతి! తాను కానీ, తన సైనికులు కానీ ఒక స్త్రీతో యుద్ధం చేయరు. స్త్రీలను రక్షించడమే తమ కర్తవ్యం కానీ, వారితో పోరాడి గాయపరచడం కాదు. దురుదృష్టవశాత్తు ఆమె మరణిస్తే స్త్రీ హత్యా పాతకం చుట్టుకుంటుంది.

ఇప్పుడు కర్తవ్యం? ఓటమిని అంగీకరించడం అసాధ్యం. ద్వంద్వ యుద్ధానికి అంగీకరించి, మాట తప్పడం మహా పాపం. స్త్రీతో యుద్ధం అధర్మం.

విక్రమాదిత్యుడు కింకర్తవ్యం అన్న ఆలోచనలో బాహ్య ప్రపంచంతో సంబంధం లేకుండా కూర్చుండి పోయాడు. వీర గుడారములోనికి వచ్చి అతని ప్రక్కన నిల్చున్నది. విక్రమునికి ఆమె వచ్చినదన్న స్పృహ లేదు.

"ప్రాణేశ్వరా!" వీర పిలుపూ అతడికి వినబడ లేదు. ఆమె కొంతసేపు నిలబడి భర్తకు దగ్గరగా జరిగి "ఆలోచన మగ్నులైనారేమి?" అన్నది.

విక్రముడామె రాకను గుర్తించి "ప్రేయసీ, కూర్చో!" అని అన్నాడు ఆమె కూర్చుని "ఏ విషయమై అంత దీర్ఘాలోచన" అన్నది.

విక్రముడామెకు గూఢచారులు తెచ్చిన సమాచారం, స్త్రీతో యుద్ధం చేయరాదన్న నియ మమూ చెప్పి, కళింగరాజు కౌటిల్యాన్ని ఎలా ఎదుర్కొనవలెనని ఆలోచిస్తున్నానని చెప్పాడు.

"అంత క్లిష్టమైన సమస్యా ఏమిటి? సులభంగానే పరిష్కరించవచ్చును" అని వీర విక్రమాదిత్యుని చెవి దగ్గరగా రహస్య సంభాషణ చేసినది.

విక్రముని ముఖంలో కొంత సంకోచమూ, కొంత ఆశ్చర్యమూ వ్యక్తమైనట్టు వీరకు అన్పించింది.

"నా మాటలపై నమ్మకం లేదా?"

"నమ్మకం లేకేమి వీరా!"

"అయితే అంగీకరించండి మహావీరా!"

* * *

మరునాడు ఉదయమే యుద్ధారంభాన్ని సూచిస్తూ శంఖారావాలు వినిపించాయి. ద్వంద్వ యుద్ధంలో తన కుమార్తె కళింగ సేన పాల్గొనగలదనీ, ఉజ్జయినీ రాజ్యంలోని వీరులెవరైనా ఆమెను ఎదుర్కొన వచ్చుననీ, ఆమెను జయించిన పక్షంలో తాను ఓటమిని అంగీకరించడమే కాక పుత్రికా సహితంగా కళింగ రాజ్యాన్ని విజేతకు ధారాదత్తం చేయగలననీ కళింగ రాజు అన్నాడు. విక్రమాదిత్యుని ధర్మ నిబద్ధతను గురించి ఆయన ఇదివరలోనే విని ఉన్నాడు. ఉజ్జయినీ పతికానీ, అతని సైనికులు కానీ స్త్రీపై ఆయుధ ప్రయోగం చేయరు. విజయలక్ష్మి తమ వైపే ఉన్నది.

విక్రముడు చార చక్షువు అని ఆయన ఊహించ లేకపోయాడు. అతడు కళింగాధిపతి ఎదురుగా నిలబడి "మా వైపున పోరాడుటకై వీరసేనుడు సిద్ధంగా ఉన్నాడు. ఈ మహావీరుని జయించుట మీ వలన కాదు. వెంటనే ఓటమిని అంగీకరించమని సూచిస్తున్నాను" అని అన్నాడు.

తండ్రి సమాధానం చెప్పే లోగానే శంఖాన్ని పూరించి, గుర్రాన్ని ముందుకు నడిపింది. విక్రమా దిత్యుని వంక చిరునవ్వుతో చూసిన వీరసేనుడు తన అశ్వాన్ని కళింగసేన వైపుగా నడిపి, బాణాన్ని ప్రయోగించాడు. ఇరువురి మధ్య జరిగిన ద్వంద్వ యుద్ధం రెండు గడియలలోనే పూర్తయింది. గాయపడ్డ కళింగసేనను ఆమె అంగరక్షకులు దూరంగా తీసికొనిపోయారు.

ఉజ్జయినీ సైన్యం విజయోత్సవం జరుపుకున్నది.

* * *

రెండు దినములైన తర్వాత కళింగరాజు విక్రముని వద్దకు దూతలను పంపించాడు. ఓటమిని అంగీకరిస్తున్నాననీ, ఉజ్జయినీ పతికి సామంత రాజుగా ఉండగలననీ, ప్రభువు సూచించిన మేరకు కప్పం చెల్లించగలననీ, తమ పుత్రిక వీరసేనునికి ఇల్లాలుగా ఉండగలదనీ తెలియజేశాడు.

కాళింగులు చెల్లించవలసిన మొదలైన విషయ ములు మాట్లాడిన తర్వాత విక్రమాదిత్యుడు "కన్య అంగీకారం లేనిదే ఆమెను వివాహం చేసుకోవడం మాకు సమ్మతం కాదు. యుద్ధ సమయంలో కళింగ రాజు మాట ఇచ్చి ఉండు గాక. ఆమెను తీసికొని మా వద్దకు రావలసినదిగా తెలియజేయండి!" అన్నాడు.

మరునాడు ఉదయం కళింగసేనను వెంట పెట్టుకుని ఆమె తండ్రి వచ్చినాడు. గుడారంలో విక్రమాదిత్య, వీరసేనలిరువురే ఉన్నారు. రాజకుమార్తె ముఖం భావరహితంగా ఉంది.

విక్రముడు "కళింగాధిపతీ! మీరు అతి తెలివి తేటలను ప్రదర్శించబోయి భంగపడ్డారు. ద్వంద్వ యుద్ధానికి మేము అంగీకరించిన పిదప మీ వైపున ఒక స్త్రీని యద్ధంలో పాల్గొనేలా చేస్తే, మేమెవరమూ ఆయుధ ప్రయోగం చేయమన్నది మీ దురాలోచన. నిజమేనా?" అన్నాడు.

"చిత్తం ప్రభూ... కానీ..."

"మీ కుమార్తె యుద్ధం చేసి ఓడిపోయింది. ఇదెలా జరిగిందో ఆలోచించారా?"

'ప్రభూ, అదే ఆశ్చర్యంగా ఉంది. నా కుమార్తెను గాయపరిచారు" అంటూ ఆయన వీరసేనుని వైపు చూశాడు. వీరసేనుని చిరునవ్వు కళింగరాజుకి కోపం తెప్పించింది. కానీ ఏమీ చెయ్యలేక నిస్సహాయంగా ఉండిపోయాడు.

"ఉజ్జయినీ వాస్తవ్యులైన పురుషులెవరూ స్త్రీపై ఆయుధ ప్రయోగం చేయరు. మీ కుమార్తెతో యుద్ధం చేసినదీ, స్వల్పంగా గాయపరచినదీ, ఓడించినదీ ఒక స్త్రీయే. వీరసేనునిగా ద్వంద్వ యుద్ధంలో పాల్గొన్నది నా ధర్మపత్ని, ఉజ్జయినీ మహారాణి".

కళింగ రాజుకు విషయం తెలిసింది. కానీ ఏమి మాట్లాడాలో తెలియక మౌనం వహించాడు.

**(సశేషం)**



# పెంచిపోషించిన ఉగ్రవాదమే పెనువిపత్తుగా మారి..

**పాకిస్తాన్ ఇప్పుడు రెండు విధాలా నలిగిపోతోంది. పీకల్లోతు అప్పులు దేశాన్ని నిండా ముంచేస్తోంటే, పెంచి పోషించిన ఉగ్రవాద సంస్థలే కాటేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితిలో మన పొరుగు దేశంలోని తాజా పరిణామాలు ఆసక్తిని కలిగిస్తున్నాయి. పాకిస్తానీయులు భారత ప్రభుత్వంతో పోల్చుకుంటూ తమ దేశ నాయకులను నిందిస్తున్నారు. తాజాగా కశ్మీర్ ఉగ్రవాదంతో సంబంధం ఉన్న కొందరు వ్యక్తులు పాకిస్తాన్‌లో అనూహ్యంగా హత్యకు గురయ్యారు. దీనిపై పాక్ ప్రభుత్వం కూడా నోరు మెదపడం లేదు. సాధారణ పరిస్థితుల్లో అయితే పాకిస్తాన్‌లో జరిగిన ఆ హత్యలు తీవ్ర కలకలం రేపేవి. పాక్ ప్రభుత్వం, ప్రతిపక్షాలు, మీడియా భారతదేశాన్ని నిందించేవి. ప్రపంచ వేదికపై నానా యాగీ చేస్తూ భారత్‌ను తూర్పార పట్టేవి. కానీ ఇప్పుడు తేలు కుట్టిన దొంగలా మౌనంగా ఉండిపోయాయి. అధికారికంగా, అనధికారికంగా కూడా ఎలాంటి స్పందన లేదు. ఇంతకీ ఏం జరిగింది? చనిపోయిన ఆ వ్యక్తులు ఎవరు? వారికి అంత ప్రాధాన్యం ఏముంది?**

ఫిబ్రవరి 20న.. పాకిస్తాన్‌లోని ప్రముఖ నగరాల్లో ఒకటైన రావల్పిండిలో బషీర్ అహ్మద్ పీర్ అలియాస్ ఇంతియాజ్ ఆలం అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. మోటర్ సైకిల్ మీద ఇద్దరు వ్యక్తులు వచ్చి అతన్ని హతమార్చారని అక్కడి పత్రికల్లో వార్త వచ్చింది. ఫిబ్రవరి 26న.. కరాచీలో సయ్యద్ ఖాలిద్ రజా అనే పాఠశాల యజమానిని ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మోటర్ సైకిల్ మీద వచ్చి హత్య చేశారు. గత సంవత్సరం మార్చి 9న పాకిస్తాన్ లోనే జహూద్ మిస్త్రీ అనే వ్యక్తి కూడా ఇదే తరహాలో ఇద్దరు వ్యక్తులచే హత్యకు గురయ్యాడు. ఈ ముగ్గురూ పాకిస్తాన్‌లోని వేర్వేరు నగరాల్లో, వేర్వేరు తేదీల్లో హత్యకు గురైనా, ఇవన్నీ ఒకే తరహాలో జరిగాయి. హతులంతా సామాన్య పౌరుల్లానే కనిపిస్తున్నారు. కానీ వీరి నేపథ్యం వేరు. వీరి గత చరిత్ర అంతా జమ్ముకశ్మీర్‌తో ముడిపడి ఉంది.

బషీర్ అహ్మద్ పీర్ అలియాస్ ఇంతియాజ్ ఆలం జమ్ముకశ్మీర్‌లో హిజ్బుల్ ముజాహిద్దీన్ సంస్థకు చెందిన ఉగ్రవాది. ఉగ్రవాదులను సరిహద్దు దాటించడంలో, ఆయుధాలు సమకూర్చడంలో సిద్ధహస్తుడు. ఇతనికి ఎన్నో ఉగ్రవాద నేరాలతో సంబంధం ఉంది. తాజాగా జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు జమ్ముకశ్మీర్ కుప్వారాలోని బాబాపోరా గ్రామంలో ఈ ఉగ్రవాదికి చెందిన ఆస్తులను ఉపా చట్టం కింద స్వాధీనం చేసుకున్నారు. సయ్యద్ ఖాలిద్ రజా జమ్ముకశ్మీర్‌లో అల్ బదర్ ఉగ్రవాద సంస్థకు 8 ఏళ్లపాటు నాయకునిగా ఉన్నాడు. ఎన్నో విధ్వంసాలు, హత్యలతో ఇతనికి సంబంధం ఉంది. ఇక జహూర్ మిస్త్రీ చరిత్ర మరింత గగుర్పాటు కలిగిస్తోంది. ఇతను హర్కతుల్ ముజాహిద్దీన్ సంస్థకు చెందిన ఉగ్రవాది. 1999లో జరిగిన కాందహార్ విమాన హైజాక్ ఘటనలో నిందితుడు. ఈ ఘటనలో కరడుగట్టిన హఫీజ్ సయీద్ సహా అయిదుగురు ఉగ్రవాదులను విడిపించుకెళ్లాడు.

జమ్ముకశ్మీర్‌లో అనేక ఉగ్రవాద ఘటనల్లో పాలుపంచుకొని పాకిస్తాన్‌లో రహస్యంగా తలదాచుకుంటున్న వీరిని అప్పగించాలని భారత్ గతంలో కోరింది. అయితే తమ దేశంలో అలాంటి వారెవరూ లేరని పాకిస్తాన్ బుకాయిస్తూ వచ్చింది. ఇప్పుడు వీరు అనూహ్యంగా తమ దేశంలోనే ఒకే తరహాలో హత్యకు గురి కావడం గమనార్హం. వీరిని హతమార్చింది భారత్‌కు చెందిన రా (రీసెర్చ్ అండ్ అనాలిసిస్) ఏజెంట్స్ అని కొందరు అంటున్నారు. ఇజ్రాయిల్ ఇంటెలిజెన్స్ సంస్థ మొసాద్ వీరిని మట్టుబెట్టిందని మరికొందరు భావిస్తున్నారు. పాకిస్తాన్ మాత్రం ఈ

ఘటనలపై ఏమాత్రం నోరు మెదపడం లేదు. భారత్ లేదా ఇజ్రాయిల్‌కు చెందిన అధికారులు వీరిని మట్టుబెట్టారని ప్రకటిస్తే తమ పరువు పోతుందని, పాకిస్తాన్‌లోనే వారు ఇంతకాలం తలదాచుకున్నారనే వార్త ప్రపంచానికి తెలిసిపోతుందని భయం. అందుకే పాకిస్తాన్ తేలు కుట్టిన దొంగలా వ్యవహరి స్తోంది. మరోవైపు భారత్ కూడా ఎలాంటి స్పందన వ్యక్తం చేయలేదు.

**ఉగ్రవాదుల స్వర్గధామం పాక్**

ప్రపంచంలో ఏ దేశంలో లేనన్ని ఉగ్రవాద సంస్థలు పాక్‌లోనే ఉన్నాయి. పాకిస్తాన్ ప్రభుత్వ గూఢచార సంస్థ ఇంటర్–సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ) వీటిని పర్యవేక్షించడంతో పాటు నిధులు ఇస్తోంది. శిక్షణశిబిరాలను కూడా నిర్వహిస్తుంది. ఇనిస్టిట్యూట్ ఫర్ కన్‌ఫ్లిక్ట్ మేనేజిమెంట్ (ఐసీఎం) వారి సౌత్ ఏసియా టెర్రరిజం పోర్టల్ (ఎస్ఏటీపీ) ప్రకారం పాకిస్తాన్‌లో ఇలాంటి సంస్థలు 162 ఉన్నాయి. ఇందులో లష్కరే తోయిబా, జైష్–ఎ–మహ్మద్ ముజాహిదీన్, ఇస్లామిక్ స్టేట్, అల్‌ఖైదా, తాలిబన్, హిజ్బుల్–ముజాహిదీన్, హక్కాని నెట్వర్క్ తరదిర పేర్లు అందరికీ సుపరిచితమే. అమెరికా ఒత్తిడి కారణంగా పాకిస్తాన్ 81 సంస్థలపై నిషేధం విధించగా, 46 సంస్థలు క్రియాశీలకంగా ఉన్నాయి. మిగతా 36 పెద్దగా ఉనికిలో లేవని చెబుతారు. కశ్మీర్, పంజాబ్ సహా భారత్‌లో తీవ్రవాదాన్ని రెచ్చ గొట్టడం, సైన్యం, ప్రభుత్వ కార్యాలయాలు, రాయబార కార్యాలయాలు, పౌరులపై కాల్పులు, బాంబుపేలుళ్లకు పాల్పడటం వీటి నిత్యకృత్యాలు. అదేవిధంగా ప్రముఖులను హత్య చేసేందుకు నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంటాయి. ఈ గ్రూపులన్నీ భారత్‌తో పాటు అమెరికా, రష్యా, బ్రిటన్, ఇజ్రాయిల్, చైనా, నాటో కూటమి దేశాలకు వ్యతిరేకంగా పని చేస్తుంటాయి.

బ్రిటిష్‌వారు స్వాతంత్ర్యం ఇస్తూ భారతదేశాన్ని చీల్చి పాకిస్తాన్‌ను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత కొద్ది రోజులకే కశ్మీర్ కోసం భారతదేశం మీద దండెత్తి ఓడిపోయిన ఘనత పాకిస్తాన్‌కు ఉంది. భారత్‌తో మూడుసార్లు యుద్ధం చేసింది. అవకాశం దొరికిన ప్రతిసారీ భారత్‌ను ఛిన్నాభిన్నం చేయాలనేది దాని ప్రధాన ధ్యేయం. పాకిస్తాన్ ఏర్పడింది మొదలు ఇప్పటివరకూ అక్కడ సుస్థిరమైన పాలన లేదు. ప్రజాస్వామ్యం బలపడలేదు. భారత వ్యతిరేకతపైనే ఆ దేశ మనుగడ ఆధారపడి ఉంది. అక్కడి రాజకీయ పార్టీలు అధికారంలోకి రావడానికీ, అధికారం నిలుపుకోవడానికి భారత్‌నే బూచిగా చూపిస్తాయి. పాకిస్తాన్ ప్రభుత్వం, సైన్యం భారత్‌లో నిరంతరం మత, ప్రాంతీయ విద్వేషాలను రగిలిస్తుంటాయి. ఇందుకోసం ఉగ్రవాదులను తయారుచేసి శిక్షణ ఇస్తున్నారు. కానీ వారు పెంచిపోషించిన ఉగ్రవాదులే ఆ దేశానికి ఇప్పుడు ప్రమాదకరంగా తయారయ్యారు. పాక్ ప్రస్తుతం ఎదుర్కొంటున్న దుస్థితికి నేపథ్యం ఇదే. భారత్‌ను అస్థిరపరచడంలో ఉన్న శ్రద్ధ సొంత ప్రజల బాగోగులపై చూపకపోవడంతో పాకిస్తాన్ మునుపెన్నడూ లేనంత తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో మునిగిపోయింది. ప్రపంచంలోనే అతితక్కువ అక్షరాస్యత ఉన్న దేశాల్లో పాకిస్తాన్ ఒకటి. 68 శాతం మంది పిల్లలు మాత్రమే ప్రాథమిక విద్యకు నోచుకున్నారు. 34.8 శాతం యువత తీవ్రవాదం వైపు ఆకర్షితులు అవుతున్నారు. ప్రస్తుతం ఆ దేశంలోని విదేశీ మారక నిల్వలు పూర్తిగా నిండుకున్నాయి. ఆర్థిక సహాయం కోసం ఐఎంఎఫ్‌తో పాటు యూఏఈ, సౌదీ అరేబియా వంటి దేశాల వైపు చూస్తోంది. ఎక్కడా అప్పులు పుట్టడం లేదు. చెప్పుకోవడానికి అణ్వస్త్ర దేశమైనా అప్పుల కోసం అడుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఇటీవల వాపోయారు.

పాకిస్తాన్ పెంచి పోషించిన 'తెహ్రీక్ ఇ తాలిబన్ (టీటీపీ) భస్మాసుర హస్తంగా మారిపోయింది. ఈ తాలిబన్లు ఆ దేశంలోని ఖైబర్ ఫక్తున్‌ఖ్వా, బెలూచిస్తాన్, సింధ్, పంజాబ్ సహా పలు కీలక ప్రాంతాల్లో సైన్యం, పోలీసులతో పాటు ప్రభుత్వ కార్యాలయాలపై దాడులు చేస్తున్నారు. 'తెహ్రీక్ ఇ తాలిబన్' పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా ఇతర ఉగ్రవాద సంస్థలను కూడా కలుపుకొని పనిచేస్తోంది. ఆ దేశంలోని నిరుద్యోగ యువకులనూ తమ సైన్యంలో చేర్చుకుంటూ, ఆయుధ శిక్షణ కూడా ఇస్తున్నారు. ఇది 'బెలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ'ని తమ సంస్థలో విలీనం చేసుకున్నట్లు పాకిస్తాన్ నిఘా వర్గాలు చెబుతున్నాయి. 'తెహ్రీక్ ఇ తాలిబన్'కు ఆఫ్ఘనిస్తాన్‌లోని తాలిబన్ ప్రభుత్వ సహకారం పూర్తిస్థాయిలో ఉంది. ఈ పరిస్థితుల్లో పాకిస్తాన్ దీనిపై పూర్తిస్థాయి యుద్ధం చేయాల్సి వస్తే ఎదుర్కోలేని దుస్థితి నెలకొంది. నాటో దళాలు ఆఫ్ఘనిస్తాన్‌ను వదిలి వెళ్లేటప్పుడు సుమారు 22,000 వాహనాలు, 64,000 మిషన్ గన్స్‌ను అక్కడే వదిలి వెళ్లాయి. ఇందులో ఎమ్ 16, ఏకే 47 రకానికి చెందిన ఆయుధాలు సుమారుగా మూడు లక్షలకు పైగా ఉంటాయి. ఇంతటి ఆధునిక ఆయుధాలు, కమ్యూనికేషన్ వ్యవస్థ కలిగిన తాలిబన్ మీద పాకిస్తాన్ విజయం సాధించడం అసంభవం.

తెహ్రీక్ ఏ తాలిబన్ విషయంలో ఆఫ్ఘనిస్తాన్–పాకిస్తాన్‌ల మధ్య విభేదాలు ముదిరాయి. ఆఫ్ఘన్‌లోని టీటీపీ రహస్య స్థావరాలపై తాము సైనికచర్య చేపట్టవచ్చునే పాక్ హోంమంత్రి రాణా సనావుల్లా చేసిన వ్యాఖ్యలపై తాలిబన్లు తీవ్రంగా స్పందించారు. పాక్– ఆఫ్ఘన్ సరిహద్దుల్లోని ఖైబర్ పఖ్తూన్‌క్వా రాష్ట్రంలో 7,000 నుంచి 10 వేల వరకు టీటీపీ ఉగ్రవాదులు ఉన్నారని ఇటీవల ఓ వార్తా సంస్థకు చెప్పారు పాక్ మంత్రి. అయితే టీటీపీ రహస్య స్థావరాల ఏరివేత పేరిట పాకిస్తాన్ తమ దేశంలోకి అడుగు పెడితే.. 1971లో భారత్ బలగాలకు లొంగిపోయినటువంటి అవమానకర పరిస్థితే పునరావృతం అవుతుందని ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన తాలిబన్ కీలక నేత అహ్మద్ యాసిర్ హెచ్చరించారు. బంగ్లాదేశ్ ఏర్పాటుకు దారితీసిన ఆ యుద్ధంలో భారత బలగాలకు పాకిస్తాన్ లొంగిపోయినప్పుడు తీసిన చారిత్రక ఫొటోను ట్విటర్ వేదికగా ఆయన పంచుకున్నారు. 'పాకిస్తాన్ హోం మంత్రి! సిరియాలోని కుర్దులను టర్కీ లక్ష్యం చేసుకున్నట్లుగా ఇక్కడ ఆఫ్ఘన్.. సిరియా కాదు. పాకిస్తాన్.. టర్కీ కాదు! ఇది ఆఫ్ఘనిస్తాన్. మహోన్నత సామ్రాజ్యాలు ఏలిన నేల. మాపై సైనిక దాడి గురించి ఆలోచించొద్దు. లేదంటే 1971 నాటి పరిస్థితి పునరావృతం అవుతుంది' అని పేర్కొన్నారు.

**కష్టకాలంలో భారత్ వైపు చూపు!**

పాకిస్తాన్ ఇటువంటి పరిస్థితుల్లో పొరుగున ఉన్న భారత్‌తో విభేదాలను పక్కనపెట్టి సత్సంబంధాలు ఏర్పరచుకోవటమే మంచిదని ఆ దేశంలోని

**భారత్‌ను అస్థిరపరచడంలో ఉన్న శ్రద్ధ సొంత ప్రజల బాగోగులపై చూపకపోవడంతో పాకిస్తాన్ మునుపెన్నడూ లేనంత తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో మునిగిపోయింది. ప్రపంచంలోనే అతితక్కువ అక్షరాస్యత ఉన్న దేశాల్లో పాకిస్తాన్ ఒకటి. 68 శాతం మంది పిల్లలు మాత్రమే ప్రాథమిక విద్యకు నోచుకున్నారు. 34.8 శాతం యువత తీవ్రవాదం వైపు ఆకర్షితులు అవుతున్నారు. ప్రస్తుతం ఆ దేశంలోని విదేశీ మారక నిల్వలు పూర్తిగా నిండుకున్నాయి. ఆర్థిక సహాయం కోసం ఐఎంఎఫ్‌తో పాటు యూఏఈ, సౌదీ అరేబియా వంటి దేశాల వైపు చూస్తోంది.**



మేధావులు, రక్షణ నిపుణులు సలహా ఇస్తున్నారు. భారతదేశం ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో అభివృద్ధిలో ఎంతో వేగంగా దూసుకుపోతోందని అక్కడి మీడియా కూడా ప్రశంసిస్తోంది. మోదీ నాయకత్వంలో భారత్ అంతర్జాతీయ స్థాయిలో తనదైన ముద్ర వేసుకుంటోందని ఇటీవల పాకిస్తాన్ దినపత్రిక 'ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్' పేర్కొంది. ఈ కారణంగానే అమెరికా, రష్యాలు కూడా భారత్‌తో బలమైన సంబంధాలు కోరుకుంటున్నాయని పేర్కొంది. భారత్‌కు వ్యతిరేకంగా కొనసాగితే పాకిస్తాన్‌కు ఎలాంటి ఉపయోగం లేదు. కశ్మీర్ కారణంగా భారత్‌తో మూడు యుద్ధాల్లో తలపడటం వల్ల కష్టాలూ, పేదరికం, నిరుద్యోగం మిగిలాయి. ఆ మూడు యుద్ధాలతో ఇప్పుడు తాము పాఠాలు నేర్చుకున్నాం అంటున్నారు పాక్ నాయకులు. ఇప్పుడు శాంతియుతంగా జీవించాలని అనుకుంటున్నామనీ, కశ్మీర్ వంటి సమస్యలపై భారత ప్రధాని మోదీతో నిజాయితీగా చర్చలు జరపాలనీ కోరుకుంటున్నట్లు పాక్ ప్రధాని ఇటీవల పిలుపునిచ్చారు. అయితే ఈ దిశగా అడుగులు మాత్రం పడటం లేదు. ఇంతటి సంక్షోభంలో కూరుకుపోయినా, ఐక్యరాజ్య సమితితో పాటు ప్రపంచ వేదికలపై ఆ దేశ నాయకులు భారత దేశంపై వ్యతిరేకతను, కశ్మీర్‌పై విషప్రచారాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు.

**అమెరికా విధానంలో మార్పు!**

ఉగ్రవాదంపై పోరు పేరుతో దశాబ్దాలుగా పాకిస్తాన్‌కు ఆర్థికసాయం చేస్తూ వచ్చిన అమెరికా దృక్పథంలోనూ మార్పు వచ్చింది. పాకిస్తాన్ ఉగ్రవాద నిర్మూలనకు ఆ నిధులను ఉపయోగించకపోగా, ఆ సంస్థలను మరింత బలోపేతం చేసేందుకు ఉపయోగిస్తూ వచ్చింది. అయితే డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షునిగా ఉన్న కాలంలో పాకిస్తాన్‌కు ఇచ్చే నిధులను దాదాపు నిలిపివేశారు. కానీ ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ మళ్లీ పాకిస్తాన్ వైపు స్వల్పంగా మొగ్గును ప్రదర్శించడం విమర్శలకు దారి తీస్తోంది. ఇటీవల ట్రంప్ పార్టీ రిపబ్లికన్ నేత నిక్కీ హేలీ పాకిస్తాన్‌కు అమెరికా అందించే సాయంపై అసహనం వ్యక్తం చేశారు. భారత సంతతికి చెందిన ఈ నాయకురాలు రానున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం కోసం ప్రయత్నిస్తున్నారు. అమెరికా విరోధులకు ప్రతి ఏటా చేస్తోన్న విదేశీ సాయం తగ్గించాల్సిన అవసరముందని 'ది న్యూయార్క్ పోస్టు'కు రాసిన వ్యాసంలో నిక్కీ పేర్కొన్నారు. 'పాకిస్తాన్‌కు సైనిక సాయాన్ని బైడెన్ ప్రభుత్వం పునఃప్రారంభించింది. అమెరికన్లు పన్నుల రూపంలో చెల్లించే బిలియన్ల కొద్దీ డాలర్లను పర్యావరణ కార్యక్రమాల పేరుతో అటు చైనాకు అందిస్తోంది. చైనా నుంచి అమెరికన్లకు తీవ్ర ముప్పు ఉందని తెలిసి కూడా ఈ సాయం అందిస్తోంది. పుతిన్‌కు అత్యంత సన్నిహితుడైన బెలారస్‌కూ అమెరికా సహాయం చేస్తోంది. క్యూబా విషయంలోనూ అంతే' అని నిక్కీ హేలీ తీవ్రంగా స్పందించారు.

**గ్రే లిస్టు నుంచి బయటపడ్డా అందని నిధులు**

ఉగ్రవాద సంస్థలకు నిధులు సరఫరా చేస్తోందన్న కారణంతో పాక్‌ను గ్రే లిస్టులో ఉంచిన ఆర్థిక చర్యల కార్యదళం (ఎఫ్ఏటీఎఫ్) గతేడాది అక్టోబర్ చివరలో ఆ జాబితా నుంచి తొలగించింది. ఉగ్రవాదానికి ఊతమిచ్చే అతి ప్రమాదకర దేశాలను ఎఫ్ఏటీఎఫ్ బ్లాక్ లిస్ట్ జాబితాలోకి చేరుస్తుంది. బ్లాక్ లిస్టులో ఉన్న దేశాలు అంతర్జాతీయ సంస్థల నుంచి నిధులు పొందడం చాలా కష్టం. ఈ దేశాలకు అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంక్, ఏడీబీ, యూరోపియన్ యూనియన్ వంటి సంస్థలు ఆర్థిక సాయం చేసే అవకాశం లేదు. తొలిసారిగా 2018 జూన్‌లో ఎఫ్ఏటీఎఫ్ పాకిస్తాన్‌ను గ్రే లిస్ట్‌లో ఉంచింది. దీని నుంచి బయటపడేందుకు పాక్‌కు రెండుసార్లు అవకాశమిచ్చింది. ఇందులో భాగంగా ఉగ్రవాదులకు అందుతున్న నిధుల మూలాలను కనిపెట్టే దిశగా పాక్ చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా ఐక్యరాజ్య సమితి ఉగ్రవాదులుగా గుర్తించిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలి. అలాగే పట్టుబడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకున్నట్లు నిరూపించగలగాలి. వారికి నిధులు అందకుండా ఆర్థికపరమైన ఆంక్షలు విధించాలి.

ఎఫ్ఏటీఎఫ్ నిర్దేశించిన ఈ లక్ష్యాలను చేరుకోవడంలో పాక్ ఇప్పటివరకు విఫలమవుతూనే వచ్చింది. కానీ గతేడాది జూన్‌లో ఎఫ్ఏటీఎఫ్ ప్లీనరీ సమావేశంలో చైనా, టర్కీ, మలేషియా దేశాలు పాకిస్తాన్‌కు మద్దతు ఇవ్వడంతో గ్రే లిస్ట్ నుంచి బయటపడింది. గ్రే లిస్టు నుంచి బయట పడ్డా పాకిస్తాన్‌కు ఉన్న ఉగ్ర చరిత్ర కారణంగా అప్పులు ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో విధిలేని పరిస్థితుల్లో ఉద్దీపన ప్యాకేజీ కోసం అధిక వడ్డీతో ఐఎంఎఫ్ విధించిన షరతులను పాకిస్తాన్ అంగీకరించక తప్పట్లేదు.

**వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్**


# FORM IV

**(See Rule 8)**

The Registration of Newspapers (Central) Rules, 1956.

| | | |
|---|---|---|
| Place of Publication | : | HYDERABAD |
| Periodicity of Publication | : | WEEKLY |
| Printer's Name | : | **Nagol Sreenivas Reddy** |
| Nationality | : | INDIAN |
| Address | : | 10-3-304/13, C/o Ashwini Poly Clinic, Humayun Nagar, Hyderabad-500 028. Telangana. |
| Publisher's Name | : | **Nagol Sreenivas Reddy** |
| Nationality | : | INDIAN |
| Address | : | 10-3-304/13, C/o Ashwini Poly Clinic, Humayun Nagar, Hyderabad-500 028. Telangana. |
| Editor's Name | : | **Dr. Goparaju Narayana Rao** |
| Nationality | : | INDIAN |
| Address | : | Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli Kachiguda, HYDERABAD - 500 027. |
| Names and Address of indivi duals who own the news paper and partners or Shareholders holding more than one percent of the total capital | : | **JAGRITI PRAKASHAN TRUST(Regd.)** Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli Kachiguda, HYDERABAD - 500 027. |


**1. I Nagol Sreenivas Reddy hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.**

1-3-2023 Sd/-
HYDERABAD Publisher

చట్టసభల్లో మహిళా ప్రాతినిధ్యం. ఈ మూడు పదాలకు సార్థకత కలిగించే తాజా పరిణామం నాగాలాండ్‌లో చోటుచేసుకుంది. అది ఈశాన్య భారతాన చిన్న ప్రాంతమైనా ఉనికి పరంగా ఎంతో కీలకం. రాష్ట్రాల జాబితాలో చివరి వరుసలో కనిపించినా, జనచైతన్యరీత్యా ముందు వరుసన నిలిచిన చారిత్రాత్మక ప్రదేశం. మూడు వైపులా సరిహద్దు ప్రాంతాలు అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్. మరోవైపు మయన్మార్ ప్రాంతం సరిహద్దులు. మొత్తం వైశాల్యం 18 వేల చదరపు కిలోమీటర్లకు మించి ఉండదు. జిల్లాల సంఖ్య 10కి అటు ఇటు. రాష్ట్ర ఆవిర్భావం జరిగి ఆరు దశాబ్దాల పైమాటే. జనసంఖ్య ఇంచుమించు 18 లక్షలు. పేరుకు తగినట్లు నాగాలదే ప్రధాన జనాభా. మొత్తం మీద 85 శాతం వరకు ఆ ప్రజలే. ఇతరులందరు ఆ తర్వాతే. నాగాలాండ్ అనగానే ముందుగా కోహిమా గుర్తుకొస్తుంది. దిమాపుర్ తలపులోకి వస్తుంది. వీటితో పాటు కిఫిరె, లాంగ్‌లెంగ్, మొకొకు ఛుంగ్,నొక్‌లాక్, పెరిన్, ఫెక్, ఓఖా, జునెబొటొ, మోన్ ఇంకొన్ని ప్రదేశాలు మదిలో మెదులుతాయి. అటవీ ప్రాంతాలు, లోయలు, అక్కడి కష్టజీవుల బతుకు చిత్రాలు.. వేటికి అవే భిన్నం. జలాశయ అందాలు కనువిందు చేస్తుంటాయి. వీటన్నింటికీ అదనంగా, పలు కోరికల సాధనకు ప్రజలు కొనసాగించిన ఉద్యమాలు ఉన్నాయి. అక్షరాస్యత 40 శాతమే అయినా జనంలో గమనింపుశక్తి, స్పందన గుణాలు దండిగా ఉన్న విలక్షణ స్థలమిది. ఇంత చేసిన ఎక్కడా లక్షకు మించిన జనసంఖ్య చాలావరకు కనిపించదు. వ్యవసాయం ప్రధాన వృత్తి కావడంతో, అక్కడి వారు... ప్రత్యేకించి శ్రమజీవులు. నీటి పారుదల సరేసరి. మరి జల ప్రాజెక్టులు ఉన్నాయా? అంటే వేళ్లమీద లెక్కించాల్సిందే. పట్టు, చేనేత తప్ప గణనీయమైన పరిశ్రమలు ఏవీ ఆ భూమిలో చూడలేం. ఇలా ఉన్నవీ, లేనివీ అటుంచి, ఇదీ 'నాగాలాండ్' అని చాటిచెప్పారు ఇద్దరే ఇద్దరు నారీమణులు. ఒకరు హెకానీ జఖాలు, మరొకరు సల్హౌతునొ క్రుసె. ఇద్దరూ అరవై ఏళ్ల రాష్ట్ర చరిత్రలో మొట్టమొదటిసారిగా శాసనసభకు ఎన్నికయ్యారు. రాజకీయ రంగస్థలాన, వనితా రంగాన చరిత్ర సృష్టికర్తలయ్యారు. రికార్డును తిరగ రాయడమంటే ఏమిటో నిరూపించారీ అగ్రస్థాయి నేతలు.

# చరిత్రకర్తలు ఈ నాయ

నాగాలాండ్‌లో ఇన్నేళ్లూ వరసబెట్టి ఎన్నికలయ్యాయి. శాసనసభకు పోటా పోటీలు, హోరాహోరీలు కొనసాగాయి. డజను పైగా ఎన్నికలు జరిగినా ఈసారి ప్రత్యేకత మాత్రం అతివలదే. హెకానీ, క్రుసె పేర్ల పక్కన సరికొత్తగా చేరిన ఎం.ఎల్.ఎ. అక్షరాలు వనితా నేతృత్వం అగ్రతను చాటుతున్నాయి. ఒకరు దిమాపుర్ ప్రాంతం నుంచి, వేరొకరు అంగామీ పశ్చిమ ప్రాంతం నుంచి విజయ బావుటాలు ఎగురవేసి జయజయధ్వానాలు అందుకున్నారు. ఉభయులదీ ఒకటే రాజకీయపక్షం. నేషనల్ డెమోక్రెటివ్ ప్రోగ్రెసివ్ పార్టీ. తొలి విజేతగా హెకానీ పేరు ప్రకటితమైంది. ఆమె వివరాలు, అభ్యర్థినిగా దూసుకెళ్లిన నేపథ్యాలు ఎంతటి వారికైనా ఆశ్చర్యచకితులను చేస్తాయి. పెదవుల మీద నవ్వులు చెదరని తన స్వస్థలం తొలువి. కుటుంబసభ్యుల ప్రోత్సాహం ఎలా ఉన్నా తన సంకల్పాన్ని చెక్కు చెదర నివ్వలేదు. బాగా చదివి సమాజానికి తనదైన రీతి సేవలను అందిం చాలన్న పట్టును వీడలేదు. అందువల్లనే, ముఖ్యంగా మాతృమూర్తి అందించిన తోడ్పాటుతో ప్రగతి పథాన సాగారు. ఉన్నత విద్యను ఇతర ప్రాంతాలలో అభ్యసించారు. న్యాయశాస్త్ర అంశాలను కూలంకషంగా అధ్యయనం చేసి, విదేశీ విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ సంపాదించారు. చట్టాలు,శాసనాలు, న్యాయ సంబంధ పరిజ్ఞానం పెంచుకోవడంతో ఆమె దృక్పథం మరింత విస్తృతంగా మారింది. కొంతకాలం బోధనావృత్తిని చేపట్టిన హెకానీ సాధన, శోధనలలో ఆరితేరారు. దేశ రాజధాని నగరంలో న్యాయసంబంధ సేవా సహాయ సహకారాలు అందచేశారు. మహిళా న్యాయవాదిగా గడించిన అనుభవం సామాజిక వాస్తవికాల అవగాహనను పెంచి పోషించాయి. సుప్రీంకోర్టులోనే న్యాయవాదిగా పటిమ చాటుకున్నారు. అటు తర్వాత స్వరాష్ట్రానికి తిరిగొచ్చి తన ప్రాంతీయుల కోసం ఇంక ఏమీ చేయగలనా? అని పరితపించారు. ఆ తపన,ఆత్మవిశ్వాసం, చిత్తశుద్ధి, నాయక లక్షణాలే అనంతర కాలంలో వెల్లివిరిశాయి.



**జంధ్యాల శరత్‌బాబు**
సీనియర్ జర్నలిస్ట్

**సేవా సంస్థల స్థాపనతో....**

హెకానీ తనకు తానుగా ఒక స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. అందుకు కారణాన్ని ఆనాడే ఒక సభలో విపులీకరిం చారు. 'ఏ ప్రాంతం అభివృద్ధి చెందాలన్నా యువతరానిదే బాధ్యత. వారు తలచుకుంటేనే ప్రగతి, సంక్షేమం సాధ్యమవుతాయి. ప్రసంగాలు చేస్తేనో, సందేశ పుస్తకాలు రాస్తేనో, నినాదాలు సాగిస్తేనో పురోగమనం రాదు. అన్నింటినీ మించి ఆచరణంటూ కావాలి. వంద మాటలు అక్కర్లేదు. ఒక్క పనిచేస్తే చాలు. ఆ ఉద్దేశంతోనే యువజన సేవా సంస్థను ఆరభించాను. ప్రతి ఒకరు మరొకరిని ప్రభావితం చేసి తన వెంట తీసుకు రావాలన్నదే నాయకురాలిగా నా పిలుపు' అన్నారామె. ఆ మాటలు, చేతలు యువతను ఆకట్టుకున్నాయి. వేలమంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. సాటివారికి సాయం చేశారు, తామూ పొందారు. విద్య, ఉపాధి రంగాలలో ఆనాడు ఆ ప్రాంతంలో అదొక సంచలనమే. సమాజసేవలో భాగంగా యువజన బృందాలు ఊరూరా పర్యటించాయి. గ్రామీణశక్తిని ఇతోధికంగా సేకరించాయి. నేటికి పెను సమస్యగా ఉన్న బాల్య వివాహాల పట్ల సమరభేరి మోగించారు. స్త్రీలు చదివితేనే వారికి, కుటుంబాలకు, మొత్త సమాజానికి చక్కని భవిత అంటూ ప్రచారాస్త్రాలు సంధించారు. వీటన్నిటి వెనుక హెకాని నాయకత్వ ప్రతిభ ఉంది. యువతను, వనితలను జాగృత పరిచినందుకు



హెకానీ



క్రుసె

# ...కీమణులు

గుర్తింపుగా, ఐదేళ్ల కిందటే ఆమెను నారీశక్తి పురస్కారం వరించింది. తదుపరి కాలంలో ఆమె సేవ విస్తారమైంది. ఈసారి ఆమె నాగాలాండ్ ఎన్నికల నిర్వహణ వ్యయం తీరుతెన్నులపై చూపు సారించారు. 'ఎన్నికల కోసం కోట్ల రూపాయలు వ్యయం చేయడం ఏమిటి? అని నిగ్గదీసి అడిగారు. ప్రజావళి స్పందన లభ్యమైంది. తమ ధనాన్ని వృథావ్యయం చేయడం తగదన్న డిమాండ్ వినవచ్చింది. ఇవన్నీ కాల పరిణామక్రమంలో ఆ మహిళామణిని ఎన్నికల బరిలో నిలిపాయి. పోటీచేసి గెలుపొంది అసెంబ్లీలో అడుగుపెట్టేలా చేశాయి.

## పోటీకి పోటీ... దీటుకు దీటు


క్రుసె గురించి ఎంత చెప్పినా ఇంకా చెప్పాల్సింది ఎంతో కొంత ఉండనే ఉంటుంది. కళాశాల విద్యను అభ్యసించిన ఆమె, అనంతర స్థితిగతుల్లో వాణిజ్యంలో రాణించారు. హెకానీ మాదిరిగా తాను కూడా సమాజ సేవాభిలాషి. మహిళా సంస్థను దాదాపు పాతికేళ్లుగా నిర్వహిస్తూ వస్తున్నారు. నేతృత్వ పరంగా ఆ సంస్థకు కర్త, కర్మ, క్రియ అన్నీ తాను ఒక్కరే. ఇక రాజకీయాల గురించి చెప్పాల్సి వస్తే ఆమె కుటుంబంలో ఎవరికీ ఆటువంటి ఆసక్తే లేదు. అయినా, ప్రజాసేవకు రాజకీయాలు అత్య వసరమన్న స్థిరనిర్ణయానికి వచ్చారు. భర్త అండదండలు పుష్కలంగా లభించాయి. మునుపటి ఎన్నికల్లో ఆయనే పోటీ చేయగా, కారణాంతరాల వల్ల వ్యతిరేక ఫలితం వచ్చింది. ఈసారి వనితారత్నమే రంగ ప్రవేశం చేశారు. అదే పార్టీ (డెమోక్రటిక్) తరపు అభ్యర్థినిగా నిలిచారు. విజయబావుటా ఎగురవేశారు. గతంలో తన ప్రత్యర్థిగా నిలిచిన వారిపైనే ఈ ఎన్నికలలోనూ పోటీపడి గెలిచారు. సంకల్పశక్తికి ఎదురే ఉండదని అందరికీ తేటతెల్లం చేశారు క్రుసె. రంగంలో ఉన్న ఆమె కోసం ఒక్క నాగాలాండ్ మాత్రమే కాదు... అసోం అగ్రనేతా వెన్నుదన్ను అయ్యారు. సమర్థ వనితకు పట్టం కట్టండంటూ ఊరువాడ ప్రచారాలు సాగించారు. అందరి శ్రమ ఫలించింది. శాసన సభ్యురాలిగా ఎన్నికైన ఆమెకు ఎన్నో ప్రశంసలు వెల్లువెత్తాయి. పోరాట పటిమ కనబరచి నెగ్గారన్న అభినందనలు వర్షించాయి. అదీ క్రుసె అంటే.

## గర్వకారణం

ఓటర్ల సంఖ్య నాగాలాండ్‌లో 14 లక్షల వరకు ఉంటుంది. వారిలో సగానికి సగం వనితలే. అంతటి ప్రాధాన్యమున్న అక్కడి శాసనసభకు హెకానీ ఎన్నికవడం, ఆ వెనువెంటనే క్రుసె ఉండడం..ఏ విధంగా చూసినా చారిత్రాత్మకం, అభినందనీయమే. మొదటిసారిగా అసెంబ్లీలోకి అడుగుపెట్టిన ఆ మహిళా ఎమ్మెల్యేలను చూసి అతివలంతా గర్వపడుతున్నారు. అది సగర్వం.

ఒకటా, రెండా, మూడా, నాలుగా, ఐదా.. ఆరుపదుల నాగాలాండ్ చరిత్రలో విజేత మహిళల ప్రవేశం, అదీ మొట్టమొదటి సారిగా.. రికార్డుగాక మరేమిటి? మీరే చెప్పండి. ★

ఓటర్ల సంఖ్య నాగాలాండ్‌లో 14 లక్షల వరకు ఉంటుంది. వారిలో సగానికి సగం వనితలే. అంతటి ప్రాధాన్యమున్న అక్కడి శాసనసభకు హెకానీ ఎన్నికవడం, ఆ వెనువెంటనే క్రుసె ఉండడం..ఏ విధంగా చూసినా చారిత్రాత్మకం, అభినందనీయమే. మొదటిసారిగా అసెంబ్లీలోకి అడుగుపెట్టిన ఆ మహిళా ఎమ్మెల్యేలను చూసి అతివలంతా గర్వపడుతున్నారు. అది సగర్వం.






# వ్యక్తిగత లబ్ధి కన్నా

**వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కంటే ప్రజాభ్యున్నతి ప్రధానమని నమ్మి ముఖ్యమంత్రి పదవిని సయితం తృణప్రాయంగా పరిత్యజించిన నేత. సువిశాల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణకు ముఖ్యకారకులు. దీనివల్ల తన పదవికి ముప్పువాటిల్లుతుందని తెలిసినా వెరవనివారు బూర్గుల రామకృష్ణారావు. ఆయన సరియైన సమయం రాగానే ఆంధ్రులకు ఒకే రాష్ట్రం ఉండాలని ప్రతిపాదించారు. దానికి కేంద్రమంత్రి మౌలానా ఆజాద్ 'మీ ప్రతిపాదనకు గల ఉద్దేశ మేమిటి' అని అడిగినప్పుడు 'హైదరాబాద్ పక్క రాష్ట్రంలో విలీనమైనప్పుడు అది విశాలమైన ఒక దేశంలో ఒక చిన్నభాగంగా ఉండి పోగలదన్న విషయం విస్మరించరాదు. అప్పుడు నేను దానికి ముఖ్యమంత్రిగా వుండను. నా ఈ ప్రతిపాదనకు అర్థం నా రాజకీయ మరణ వారంటుపై నేనే సంతకం చేసుకోవడమన్న మాట' అని నిర్భయంగా చెప్పారు.**

తెలుగునేలను పాలించిన ముఖ్యమంత్రులలో బూర్గుల రామకృష్ణారావు స్థానం విశిష్టమైనది. తెలుగు జాతి సగర్వంగా చెప్పుకోగలిగిన మహా పురుషులలో ఆయన అగ్రేసరులు. విద్యాధికులు. జాతీయతా భావాలకు బద్ధ శత్రువైన నిజాం నిరంకుశ ప్రభుత్వ కాలంలో ఖద్దరు ధరించిన దేశభక్తాగ్ర గణ్యుడు, న్యాయవాద శిరోమణి, రాజ్యాంగ సమ్మత మార్గానుయాయి. స్వాతంత్ర్య సమరయోధుడు, బహుభాషా కోవిదుడు. తెలుగు, ఉర్దూ, ఇంగ్లీషు, సంస్కృతం, హిందీ భాషలలో రచనలు చేసిన ప్రతిభా సంపన్నుడు. ఒక హైస్కూలులో పర్షియన్ బోధించే ఉపాధ్యాయునిగా పనిచేసిన ఆంధ్రుడు బహుశ ఈయన ఒక్కరేనేమో ఆ సమయంలో 'పారశీక వాఙ్మయ చరిత్ర' రాశారు.

హైదరాబాద్ రాష్ట్ర ప్రప్రథమ ప్రజా ముఖ్య మంత్రిగా పనిచేసి చరిత్ర కెక్కారు. ఆ సందర్భం లోనే...

**'రెండు వందల యేడుల నుంచి చిమ్మ**
**చీకటుల మ్రగ్గి, వెలుతురు రేక గనని**
**మాకు ప్రథమ ప్రజా ముఖ్యమంత్రి వీవు**
**కీర్తనీయ, బూర్గుల రామకృష్ణరాయ'** అని

దాశరథి కృష్ణమాచార్యులు శ్లాఘించారు.

'రామకృష్ణారావు పూర్ణపురుషుడు, వినయశీలి, సచ్ఛీలుడు, నిజాంకు అతి సన్నిహితంగా ఉండే వ్యక్తుల కూటమి విశ్వాసాన్ని సైతం చూరగొనగలిగిన స్ఫటిక సదృశ్యమైన నిజాయతీపరుడు. ఆయన గుండె నిబ్బరం, యుక్తాయుక్త విచక్షణ, సూక్ష్మ పరిశీలనా దృష్టిని పొగడకుండా ఉండలేకపోతున్నాను. ఒకప్పుడు నిజాం బంట్లు కొందరు రామకృష్ణరావును జైలులో పెట్టవలెనని చూచారు. క్రూరాతి క్రూరంగా గడిచిన ఆ తొమ్మిది మాసాల చరిత్రలో ఆయనకు 'మంత్రి పదవి ఇస్తామ'ని ఒకసారి నిజాం నుంచి ఆహ్వానం కూడా అందింది. బెదిరింపులకు లొంగనట్టే, ఆయన ఎరగా చూపిన పదవికి వశుడు కాలేదు' అని మున్షీ హైదరాబాదు జ్ఞాపకాలపై రాసిన 'ది ఎండ్ ఆఫ్ ఏన్ ఎరా' అనే గ్రంథంలో పేర్కొన్నారు.

స్వాతంత్ర్యానంతరం భారత్ యూనియన్‌లో చేరేందుకు నిరాకరించిన వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని, ప్రజావ్యతిరేక, నిరంకుశ, మతోన్మాదాన్ని తుడిచి వేయాలని పిలుపు నిచ్చారు. హైదరాబాద్ రాష్ట్రాన్ని యథాతథంగా ఉంచడం మౌలానా ఆజాద్ అభిమతం కాగా, అది దేశానికి ఎప్పటికైనా ప్రమాద కరమని ఆయన చేసిన హెచ్చరిక ఆంధ్రుల చరిత్రలోనేగాక మహారాష్ట్ర, కర్ణాటక ప్రజల చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే రాజకీయ అంశం.

హైదరాబాద్ స్టేట్ ముఖ్యమంత్రి పదవి స్వీకరించిన వెంటనే రామకృష్ణారావు ఆల్ ఇండియా రేడియో హైదరాబాద్ కేంద్రం నుంచి ప్రసంగిస్తూ 'భారతదేశంలో హైదరాబాద్ విడదీయరాని భాగం. బాధ్యతాయుత ప్రభుత్వం కావాలన్న ప్రజల కోర్కె నేటికి ఈడేరింది. స్వతంత్ర ప్రవృత్తితో ఆలోచించడం గానీ, వ్యవహరించడం గానీ హైదరాబాదు ప్రజలకు తగదు' అని అన్నారు.

రామకృష్ణారావు 1899 మార్చి 13వ తేదీన (విళంబి నామ సంవత్సరం ఫాల్గుణ శుద్ధ విదియ, సోమవారం, రేవతీ నక్షత్ర చతుర్థ చరణ యుక్త మకర లగ్నం)మహబూబ్ నగర్ జిల్లా కల్వకుర్తి తాలూకా పడకల్లు గ్రామంలో వైష్ణవ కుటుంబంలో నరసింగ రావు, రంగనాయకమ్మ దంపతులకు జన్మించారు. వీరి ఇంటి పేరు పుల్లంరాజు కాగా, పూణేలో ఉన్నత విద్యాభ్యాసం రోజుల్లో మహారాష్ట్ర సంప్రదాయా ననుసరించి తమ గ్రామనామాన్నే ఇంటిపేరుగా పెట్టుకొని 'రామ్‌కిషన్ రావు బూర్గుల' అని రాసుకున్నారు. అలా 'పుల్లంరాజు' కాస్తా 'బూర్గుల' అయ్యింది. వీరి ఇంట్లో నిత్యారాధన ఉండేది. వారి తల్లిగారు రామానుజుల విరచిత గద్యత్రయము



బూర్గుల రామకృష్ణారావు

# జనసంక్షేమం మిన్న

(శ్రీరంగ గద్యము, శరణాగతి గద్యము, వైకుంఠ గద్యము) చదవనిదే భోజనం చేసేవారు కారట.

బూర్గులకు 13వ ఏట 1912లో కొంపెల్ల నరసింహారావుగారి రెండవ కుమార్తె రత్నమ్మతో వివాహం (ఆమెకే రాధమ్మ అని మరోపేరు) జరిగింది ఆమె ఒక కుమారుడు కుమార్తె (రంగనాధరావు, శ్యామలాదేవి) లకు జన్మనిచ్చి. దురదృష్టవశాత్తూ 1920లో మరణించారు. 1924 బూర్గుల వారు మందుముల వెంకట నరసింహారావు కుమార్తె అనంతలక్ష్మీదేవి వీరి ద్వితీయ కళత్రంగా స్వీకరించారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కలిగారు.

పూణేలో గోపాలకృష్ణ గోఖలే స్థాపించిన పెర్గుసన్ కాలేజీలో బీఏ, బొంబాయి విశ్వవిద్యాలయం నుండి ఎల్.ఎల్.బి. చేసిన బూర్గుల 1923లో హైదరాబాద్‌లో న్యాయవాద వృత్తి ప్రారంభించి, అగ్రేసర న్యాయవాదిగా పేరు పొందారు. దివంగత పూర్వ ప్రధాని పి.వి.నరసింహరావు వీరి వద్ద జూనియర్‌గా పనిచేసిన వారే. 'బూర్గుల వారిలో కొన్ని గొప్ప గుణాలుండేవి.ఆయన దిక్కులు పిక్కటిల్లజేసే పెద్ద ప్రాక్టీసును పెంచుకోలేదు. క్లయింట్లకు ఆయన సామర్థ్యంపై విశ్వాసముండేది. దాంతో ఆయనకు చేతినిండా పని వుండేది. వారి దగ్గరకు వచ్చే కేసులలో అత్యధికం రాజకీయ సంబంధమైనవే. వాటిని వాదించడానికి ఫీజు తీసుకునేవారు కాదు. ఒక కేసును ఆయన ఆమూలాగ్రం అధ్యయనం చేయడమంటూ ఎన్నడూ లేదు. కేసును తీసుకొనేటప్పుడు ఒకమారు నోట్సు, రిఫరెన్సులు గుర్తు కొరకు వ్రాసి పెట్టుకునేవారు. కాని ఆయన కోర్టులోకి వచ్చి వాదించడం మొదలు పెడితే సూక్ష్మంగా వ్రాసి ఉంచుకొన్న ఆ నోట్సును ప్రకాశమానమైన తమ ప్రజ్ఞతో విస్తృతీకరించి, కేసును దుర్భేద్యంగా రూపొందించి, అద్భుతమైన సాక్ష్యాధారాలు తయారు చేసేవారు. నేను బహుశ ఆయన జూనియర్లందరిలోకి జూనియర్‌ని తల్లికి కడగొట్టు బిడ్డపై కొంచెం హెచ్చుగా ప్రేమ ఉంటుందని అంటారు. అలాగే ఆయన నాపై ప్రత్యేకమైన ప్రేమ వాత్సల్యాలు చూపేవారు' అని పీవీ నరసింహారావు వృత్తిరీత్యా గురువు గురించి రాశారు.

బూర్గుల ప్రజాహిత రంగాలలో ప్రసిద్ధులై ఉండటంవలన రాజకీయ సంబంధమైన కేసులు వీరివద్దకే వచ్చేవి. ముఖ్యంగా ఆర్య సమాజం కార్యకర్తలపైన, కేసులు, నిజాం పోలీసు వేధింపు కేసులు వచ్చేవి. కేసులు ఫీజు లేకుండా ఉచితంగా వాదించేవారు. ప్రజా ఉద్యమాలలో పనిచేసే కార్యకర్తలకు రక్షణ కల్పిస్తూ, ప్రజలలో ధైర్య సాహసాలు, చైతన్యం నింపేవారు. వృత్తి రీత్యా రాజకీయాలకు అతీతంగా వ్యవహరించేవారని, కమ్యూనిస్టు కార్యకర్తల కేసులు వాదించారని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన గోపాలరావు ఎక్బోటే పేర్కొన్నారు.

1950 జనవరి 26వ తేదీన అమలులోకి వచ్చిన భారత రిపబ్లిక్ రాజ్యాంగాన్ని అనుసరించి దేశమంతటితో పాటు హైదరాబాద్ రాష్ట్రంలో కూడా సాధారణ ఎన్నికలు జరిగాయి. బూర్గుల కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి భారీ మెజారిటీతో విజయం సాధించారు. శాసనసభలో మొత్తం సీట్లు 175కు గాను కాంగ్రెస్-93 పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్-77 స్థానాల్లో గెలిచాయి. ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరనే విషయంలో తర్జన భర్జన జరుగుతుండగా దిగంబరరావు బిందూ పేరును స్వామి రామానందతీర్థ సూచించారు. కానీ బిందూ అందుకు సుముఖత వ్యక్తం చేయలేదు. ఆ పదవికి బూర్గుల రామకృష్ణారావు తగిన వ్యక్తని చెప్పడంతో బూర్గుల హైదరాబాద్ స్టేట్ ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన హయాంలోనే అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన (1955 డిశంబరు 10) చేశారు. వినోబాభావే భూదానోద్యమం కూడా వీరి కాలంలోనే ప్రారంభమయినది.

శాసనసభలో సభ్యులు తెలుగు, ఉర్దూ, ఇంగ్లీషు, మరాఠీ, కన్నడ భాషలలో మాట్లాడుతూ వుండేవారు. ఎవరు ఏ భాషలో ప్రశ్నవేస్తే వారికి ఆ భాషలోనే తడుముకోకుండా సమాధానం చెప్పేవారు. ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా వెళ్లబోతున్నప్పుడు రాధాకృష్ణన్ 'మీ బహు భాషా పాండిత్యం అక్కడ మీకు బాగా ఉపయోగపడగలదు' అని అన్నారు. బూర్గుల దక్షిణ భారత హిందీ ప్రచారసభ ఆంధ్రశాఖకు పెద్ద అండగా ఉండేవారు.




**కాశింశెట్టి సత్యనారాయణ**

విశ్రాంత ఆచార్యుడు


ఒకే తెలుగు రాష్ట్రం కావా లన్న తన అభిప్రాయం పట్ల కేంద్రమంత్రి గోవిందవల్లభ పంత్‌కు సానుభూతి ఉన్నట్లు బూర్గుల గ్రహించారు. నెహ్రూపై మౌలానా ప్రభావాన్ని విరుగుడు మంత్రం వేసి, దేశ నడిబొడ్డున మతతత్వ దృష్టి గల రాష్ట్రం వల్ల ఎదురయ్యే ప్రమాదాలను గురించి ఆయనకు నచ్చజెప్పడంలో కృతకృత్యుడయ్యాడని చెప్పుకునే వారు. అందుకే భోగరాజ పట్టాభి సీతారామయ్య ఆయనను 'మహేంద్ర రాజనీతిజ్ఞుడు'గా అభివర్ణించారు.

బూర్గుల వారికి గ్రంథ పఠనము, సాహిత్యాధ్యయనం నిత్య అభ్యాసాలుగా వుండేవి. 'నాకు కూడా వ్రాసే గుణం ఉంది, ఏదో ఒకటి వ్రాస్తూ వుండేవాడిని' అని ఆయనే చెప్పుకున్నారు. 1924లో ఆంగ్లకవి థామస్ ఎలిజీని 'మృత సంస్మృతి' పేర తెలుగులో వ్రాశారు. ★



కథ

# పునరుజ్జీవం!

**కె.వి.లక్ష్మణరావు**



"సార్! మొండిబాకీని ఎలాగైనా వసూలు చేసేయాలని ఇంత దూరం తీసుకొచ్చేశారు. ఇక్కడ చూస్తే బైక్ ఆగిపో యింది. ఊరు కానీ ఊరు; పైగా పల్లెటూరు. ఏం చేద్దాం సార్?" అసహనాన్ని వ్యక్తం చేస్తూ అడిగాడు సుందరం.

"సుందరం! రంగారావు మొండిబాకీని ఎలాగైనా వసూలు చేస్తానని బ్యాంక్ మేనేజర్తో 'చాణక్య శపథం' చేసి మరీ వచ్చాను. "విషయం, వివరం కనుక్కో కుండా వెనక్కి వెళ్లేది లేదు. ఎన్ని అవాంతరాలెదురైనా సరే!" అన్నాను.

"ఫీల్డ్ ఆఫీసర్ అనిపించుకున్నారు..!" అసహనాన్ని అలా వ్యక్త పరుస్తూ అన్నాడు సుందర్.

"తప్పదు..! ఊళ్లోకి వచ్చేస్తుంటాం.." అంటూ బైక్ సెంటర్ స్టాండ్ వేశాను. బైక్ రిపేర్ సెంటర్ కూడా కనుచూపు మేరలో లేదు. అసలే శీతాకాలం, ఆకాశం నిండా మబ్బులు ఆవరించడంతో పగలు కూడా సాయంత్రంలా ఉంది. "బాకీ ముందు, బైక్ బాగు పడటం తరువాత" సుందర్తో అన్నాను.

మా వైపుగా పంచెకట్టులో ఉన్న పెద్ద మనిషి వస్తున్నాడు. పట్నంలో ఒకరి ఆచూకీ చెప్పమంటే ఎవ్వరూ చెప్పరు కానీ అదే పల్లెటూరిలో మనిషే కాదు, ప్రతీ చెట్టూ-పుట్టా కూడా చెబుతుంది.

"రంగారావు ఇంటికి ఎలా వెళ్లాలి ?" పెద్ద మనిషినడిగాను.

అతను ఆగి... "ఈ ఉళ్లో రంగారావులు చాలా మందే ఉన్నారు. మీకు ఏ రంగారావు" కావాలి? అడిగాడు. నేను చెప్పలేక సుందర్ కేసి చూశాను.

'రైతు కూలీ' సుందర్ అన్నాడు.

'ఊళ్లో అందరూ రైతులే... మీకు ఏ రంగారావు కావాలి?" పెద్దమనిషి వెంటనే అడుగుతూ జవాబు కోసం చూశాడు.

"కష్టం" అనుకుంటూ సుందర్ కేసి చూశాను.

నా అసహనాన్ని కనిపెట్టేసిన సుందర్ తన ఫోన్లో ఉన్న రంగారావు ఫోటోను పెద్దమనిషికి చూపిం చాడు. "బుర్రకథ రంగారావా?" అంటూ ఆ పెద్దమనిషి, "తిన్నగా వెళ్లండి. అమ్మవారి గుడి వస్తుంది, గుడి నుండి కుడివైపు తిరగండి, కొంత దూరం వెళ్లాక.. పూరిపాకే అయినా 'బుర్రకథలు చెప్పబడును' అన్న చెక్కబోర్డు కనబడుతుంది. అక్కడే ఉంటాడ వెళ్లండి బాబూ!" సవివరంగా చెప్పాడు.

'ధన్యవాదాలండీ'! అంటూ ముందుకు కదిలాను.

నాతో సుందర్ "బుర్రకథ రంగారావని అడగాలట. ఆ మాట వినగానే భలే నవ్వొచ్చింది సార్?" అన్నాడు.

"ఎందుకని?" అడిగాను.

"ఈ రోజుల్లో బుర్రకథలెవరు చూస్తారు సార్. బుర్రఉన్న వాళ్లెవ్వరూ చూడరు. పెద్దవాళ్లకి గుర్తు లేదు, చిన్నవాళ్లకి వాటితో పనిలేదు!" వెటకారంగా అన్నాడు.

సుందరం మాట నాకు నచ్చలేదు. "జానపద కళలలో బుర్రకథ ఒకటి... నీకు తెలిసే వెక్కిరిం చావా?" ఒక్కసారిగా సుందరం కేసి సీరియస్గా చూస్తూ అన్నాను.

సుందర్ కూడా వెనక్కి తగ్గకుండా... "పోనీ మీకు తెలుసా సార్?" ఎదురు ప్రశ్న అడగటం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది.

నేను సుందరానికిచ్చిన చనువుతోనే చొరవగా అలా అన్నాడనిపించింది. బుర్రకథ గురించి చెప్పడం ఇప్పుడవసరం అనిపించింది.

నేను కోపం తగ్గించుకుంటూ "సుందర్...! బుర్ర కథ పితామహుడు షేక్ నాజర్. జానపద కళలలో బుర్రకథ కూడా ఒకటి. "వినరా భారత వీర కుమార వీరగాధ నేడు"! అంటూ తంబుర చేతపట్టి అభినయం చేస్తూంటే, అటూ ఇటూహాస్యం, కథ చెప్పేవాళ్ల జోడు గుర్రాల్లా అభినయిస్తూ డిక్కీ కొడుతుంటారు, చూసేవాళ్లు తమని తాము మరిచిపోతారు. వాళ్లు చెప్పే కథలో లీనమైపోయి మైమరచి పోతారు"

"ఇవన్నీ మీకెలా తెలుసుసార్?" సుందరం ప్రశ్నార్థకంగా చూస్తూ అడిగాడు.

"మా నాన్న కామేశం బుర్రకథ కళాకారులు" అంటూ గర్వంగా చెప్పాను. సుందరానికి నాన్న పేరు చెప్పగానే నా గతం కళ్లముందు కదలాడింది.

"కుమార్! డిక్కీ వాయించమంటే నీకంతిష్టమా?" నాన్న బుర్ర కథ చెప్పేందుకు మేకప్ వేసుకుంటూ నన్ను చూసి అడిగారు.

డిక్కీ వాయించడం ఆపి నాన్న కేసి నవ్వుతూ చూశాను.

"ఆపకు! బాగా వాయిస్తున్నావురా. ఈసారి బుర్రకథ రిహార్సల్లో నీకు బుర్రకథ నేర్పిస్తాను! సరేనా?" నాన్న నన్ను దగ్గరకు తీసుకుంటూ అన్నారు.

నాలో ఆనందంతో కూడిన ఉద్వేగం కలిగింది. "అలాగే నాన్నా! మీ ప్రోత్సాహం" అన్నాను.

సత్యహరిశ్చంద్ర, అల్లూరి సీతారామరాజు, తాండ్ర పాపారాయుడు వంటి వీరుల చరిత్రను నాన్న క్షుణ్ణంగా చదివి ఆ చరిత్రను బుర్రకథ రూపంలోకి మార్చి రాసేవారు. పాటలు కూడా చేర్చి బుర్రకథగా చెప్పేవారు. షేక్ నాజర్ గారి పాటలను కూడా పాడేవారు.

అల్లూరి సీతారామరాజులో ''లాగరా.. హైలెస్సో... లాగరా.. హైలస్సా" అంటూ గిరిజనులు రోడ్డు వేస్తూ పాడే పాటనూ, బొబ్బిలి యుద్ధంలో "అరెరే... ఇక్కడ పుట్టిన 'కుందేలు' అక్కడ 'కుక్క'ను ధిక్కరించుమన్నా!" అంటూ బొబ్బిలి ప్రాంతం పౌరుషం చెప్పే పాటలను. బుర్రకథలో చెబుతూంటే ప్రేక్షకులు లేచి చప్పట్లు కొట్టేవారు.

గణపతి నవరాత్రులకు, దేవీనవరాత్రులకు గుడి ప్రాంగణంలో వేదిక మీద నాన్న మరో ఇద్దరి కళాకారులతో బుర్రకథ చెప్పేవారు.

"మా గుడి వద్ద చెప్పండి, మా ఉళ్లో చెప్పండి" అంటూ ఎక్కడెక్కడి వాళ్లో వచ్చి ఉదయం నుండీ మా ఇంటి ముందు క్యూ కట్టేవారు. ఆరోజుల్లో నోట్లోకి నాలుగు వేళ్లూ వెళ్లేవి. కానీ అన్ని రోజులూ ఒకేలా ఉంటే అది జీవితం ఎందుకవుతుంది.?

సినిమా ప్రభావం బాగా పెరిగింది. నవరాత్రి ఉత్సవాల్లో కూడా రోడ్డు మీద రాత్రి ప్రదర్శించే సినిమాకే గిరాకీ పెరిగింది. బుర్రకథ ప్రభావం బాగా తగ్గింది. కేవలం కళను నమ్ముకుని బ్రతికే నాన్నలాంటి కుటుంబాల నోట్లో మట్టి కొట్టింది సినిమాయే'!! చాలా మంది కళాకారులు మూలన పడిపోవాల్సి వచ్చింది..

ఒకప్పుడు మా ఇంటికి వచ్చి బుర్రకథ చెప్పమని నాన్నను అడిగిన వాళ్లందరూ నాన్న కనబడితే మొహం చాటేస్తున్నారు. బ్రతుకు తెరువు కోసం నాన్నే

వాకాటి పాండురంగరావు స్మారక దీపావళి కథల పోటీకి ఎంపికైనది




స్వయంగా పందిట్లోకి వెళ్ళి "బుర్రకథ చెబుతాం బాబూ"! అని అడిగే (దు)స్థితికొచ్చేశారు. అప్పుడు నేను ఎనిమిదో తరగతి చదువుతున్నాను.

దీనంగా ఉన్న నాన్నతో "నాన్నా! తోలు బొమ్మలాటలు చెప్పేవాళ్లకు రోజులు లేవు, నాటకం వేసేవాళ్లు పగటి వేషగాళ్లుగా మారి బ్రతుకీడుస్తున్నారు. ఇప్పుడు బుర్రకథ చెప్పే నీలాంటి వారికి కూడా ఈ పరిస్థితి దాపురించింది. 'రంగు' పూసుకుని కళను నమ్ముకుని బ్రతికే కళాకారుల జీవితాలలో రంగులు లేవు, పగటి పూట గడవదు, రాత్రి నిద్రపట్టదు. 'కల'కు కూడా నోచుకోని "కళ' లెందుకు? నాన్నా! బాధగా అడిగాను.

నా బాధలో ఆవేశాన్ని గమనించిన నాన్న నన్ను దగ్గరకు తీసుకుంటూ "కుమార్! కళలెప్పుడూ గొప్పవే, కానీ రోజులే మారిపోతాయి. సినిమా ప్రభావంతో బుర్రకథ ప్రభావం తగ్గడం మాట నిజమే...కాదనను. కానీ తగ్గిందని తలొగ్గడం మనిషి లక్షణం కాదురా! అది ధీరగుణం అనిపించుకోదు. ఓర్పుతో వేచి ఉండాలి. సత్యహరిశ్చంద్రుడు సత్యం కోసం కష్టాలెన్నో పడ్డాడు. పాలకుని స్థాయి నుండి కాటికాపరిగా దిగజారినా కూడా సత్యాన్ని వీడలేదు. కష్టాలు తృణప్రాయంగా త్రోసి 'రాజ'న్నాడు. తిరిగి సత్యంతో పాటు తాను నెగ్గి, మహరాజయ్యాడు. ఆయన కథనే బుర్రకథగా చెప్పిన నేను ఇప్పుడు కష్టం వచ్చిందని కృంగిపోతే ఎలా.? 'కళ".. నా దృష్టిలో 'కల'గా మిగిలిపోకూడదు. జీవం కోల్పోయిన కళ తిరిగి పునరుజ్జీవం పొందుతుంది. నాకా నమ్మకం ఉంది!" అన్నారు.

నాన్న మొక్కవోని ధైర్యానికి, సంకల్పబలానికి చాలా సంతోషం వేసింది.

బుర్రకథ పునరుజ్జీవం కోసం ఎవరి దగ్గరా పైసా పుచ్చుకోకుండానే బుర్రకథలు చెప్పేవారు. నాకది నచ్చక... "నాన్నా! పైసలు రాని, విలువలేని బుర్రకథను చెప్పి సమయాన్ని పాడుచేసుకోకు. బ్రతుకుతెరువు కోసం మరో పని చేయరాదా?" అని నేను అన్నప్పుడు "కుమార్! పంట పండలేదని నష్టం వచ్చిందని రైతు పుడమిని నిందించడు. తిరిగి అదే నేలపై సాగుకు సిద్ధమౌతాడు. కళాకారుడు కూడా అంతేరా? ఒకప్పుడు నన్ను బ్రతికించిన కళను తిరిగి బ్రతికించుకోపోతే ఎలా? అప్పు పెరిగిపోదూ?" అంటూ చమత్కారంగా మాట్లాడేవారు. శ్వాస ఆగిపోయే వరకూ బుర్రకథనే ధ్యాసగా బ్రతికారు. నాన్నను బ్రతికించలేని బుర్రకథ అంటే నాకు అసహ్యం వేసి అప్పటి నుండీ అటువైపు పోలేదు. కానీ నాన్న 'కళ'ను కొనసాగించలేకపోయానన్న బాధ మాత్రం ఈ మధ్యనే కలుగుతోంది. కనీసం కళకు గౌరవం ఇవ్వాలనీ, తప్పు సరిదిద్దుకోవాలనీ మనసులో వేదన మొదలైంది.

నా కళ్లు తడిబారుతున్నాయి. అది చూసి "సారీ! సార్" అన్న సుందర్ మాటతో ప్రస్తుతంలోకి వచ్చాను. జ్ఞాపకం నెమరు వేసుకుంటూనే రంగారావు ఇంటికొచ్చేశాను. పూరిపాక, సూర్యచంద్రులు కూడా ఆ పాకలో తలదాచుకునేలా పైన అక్కడక్కడా చిల్లులున్నాయి. అక్కడక్కడా గుంటలు పడిన అరుగు మీదే కుదురుగా కూర్చుని రంగారావు ఉన్నాడు.

తంబుర చేత బూని... ఎడమ చేతుల్లో రెండు కంజిరలు పట్టుకుని "వినరా భారత వీరకుమారా! వీరగాథ నేడు..తందాన తాన!" అంటూ ఒక్కడే బుర్రకథ పాట పాడుతూ, మా ఇద్దరిని చూసి ఒక్కసారిగా ఆగాడు. అతణ్ణి చూస్తున్న చిన్న పిల్లలతో "నా కోసం ఎవరో వచ్చారు మీకు తరువాత బుర్రకథ నేర్పుతాను వెళ్లండి!" అన్నాడు.

"నాన్నా! పైసలు రాని, విలువలేని బుర్రకథను చెప్పి సమయాన్ని పాడుచేసుకోకు. బ్రతుకుతెరువు కోసం మరో పని చేయరాదా?" అని నేను అన్నప్పుడు "కుమార్! పంట పండలేదని నష్టం వచ్చిందని రైతు పుడమిని నిందించడు. తిరిగి అదే నేలపై సాగుకు సిద్ధమౌతాడు. కళాకారుడు కూడా అంతేరా? ఒకప్పుడు నన్ను బ్రతికించిన కళను తిరిగి బ్రతికించుకోపోతే ఎలా? అప్పు పెరిగిపోదూ?" అంటూ చమత్కారంగా మాట్లాడేవారు.



"అలాగే తాతయ్యా!" అంటూ పిల్లలు వెళ్లారు...

"చెప్పండి బాబూ! మీ ఊరిలో బుర్రకథ ప్రదర్శన ఇవ్వాలా?" ఎంతో ఆర్తిగా, ఆశగా అడిగాడు.

నాకు నాన్న గుర్తొచ్చారు. గొంతు గద్గదమైంది. మాట రాలేదు.

నా పరిస్థితి గమనించిన సుందర్..."కాదండీ! మేము బ్యాంక్ నుండి వచ్చాము. మీ మొండీబాకీ గురించి అడగడానికొచ్చాము!" విషయం సూటిగా చెప్పాడు.

వెంటనే రంగారావు "కూర్చోండి బాబూ! అంటూ నాలుగో కాలు సరిగా లేని పీటను మా ముందు వేసి వినయంగా నిల్చొన్నాడు.

"మీరు నిలబడకండి! కూర్చోండి.!" అంటూ నేను అరుగు మీద కూర్చున్నాను.

నా ముందు మొహమాటంగా కూర్చుంటూనే "పంట పండలేదు. నష్టం వచ్చింది. కానీ వ్యవసాయం మానలేను. బుర్రకథ "కళ" తప్పింది. కానీ కళను వీడలేను. కాలం కలిసొస్తుంది. శిశిరం వెనుక వసంతం వస్తుంది. పంట పండుతుంది కళకు పునరుజ్జీవం కూడా వస్తుంది. అప్పుడు మీ బాకీ వడ్డీ సహా తీర్చేస్తాను" నేను ఏమి అడక్కుండానే రంగారావు చెప్పాడు.

ఆయనలో "నాన్న" కనిపిస్తున్నాడు. ఆయన మనోధైర్యంలో నాన్న వినిపిస్తున్నాడనిపించింది.

కష్టంలో కళను వీడలేదు. పిల్లలకు నేర్పుతూ బుర్రకథకు పునరుజ్జీవం కలిగిస్తున్నారు.

నేను వెంటనే లేచాను. చేతులు జోడించిన రంగారావు చేతులను పట్టుకుంటూ మా అపార్ట్మెంట్ వద్ద ప్రతీ సంవత్సరం సంక్రాంతి పండుగకు ఉత్సవాలు జరుగుతాయి. అక్కడ మీ బుర్రకథ ప్రదర్శన కావాలి. మేము వచ్చింది మీ బాకీ వసూలు చేయడానికే కాదు, మీ ప్రదర్శన ఇవ్వాలని అడగడానికి కూడా వచ్చాం ఇస్తారా?" వినయంగా అడిగాను.

రంగారావు కళ్లు తడిబారాయి. రెండు కళ్లనూ తుడుచుకుంటూ "తప్పకుండా! బుర్రకథ ప్రదర్శన ఇస్తాను బాబూ!" అన్నారు. ఆ మాటల్లో బుర్రకథ మళ్లీ జీవం పోసుకున్నట్లనిపించింది.

"ఇరవై వేలు" చెక్ రంగారావు చేతుల్లో పెట్టాను. సుందర్... నన్ను ఆశ్చర్యంగా గమనిస్తున్నాడు... "దేనికి బాబూ!" రంగారావు నన్నడిగారు.

"మీ కథా ప్రదర్శనకు! వద్దనకండి" అన్నాను.

చాలా సంతోషం బాబూ! కానీ బ్యాంకు బాకీ పడిన ఇరవై వేల రూపాయలు అప్పును మీరే తీర్చేయండి బాబూ!" అంటూ చెక్కును నా చేతిలో తిరిగి పెట్టాడు.

'నిజమైన కళాకారులంతే అప్పును ఉంచుకోరు" అనిపించింది.

నేను నవ్వుతూ చెక్కు తీసుకుని "మీ బాకీ తీరింది. ప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తానంటూ భుజం తట్టాను".

అప్పుడే అక్కడ గోడ మీద వేలాడుతున్న ఫొటో అప్రయత్నంగా చూశాను.

'ఫొటోలో ఉన్నది? రంగారావు...' దాని గురించి అడిగాను.

ఆయన ఆ ఫొటో వద్దకు వెళ్లి "మా గురువుగారు బాబూ! ఆయన శిష్యులలో నేనూ ఒకడిని" గర్వంగా చెప్పారు.

నా కళ్లలో అప్రయత్నంగా నీళ్లు...అవి కన్నీళ్లు కావని, ఆనంద బాష్పాలని అర్థమైంది. తడిబారిన కళ్లను తుడుచుకుంటూ 'కళ' 'కల' కాలేదు... పునరుజ్జీవమయింది. అన్నాను... ఫొటోలో ఉన్న నాన్నకు దణ్ణం పెడుతూ... ★



# ఆటగాళ్ల దశను మారుస్తున్న కబడ్డీ!

భారత ఉపఖండ దేశాలలోని పల్లెల నుంచి ప్రపంచ స్థాయికి ఎదిగిన క్రీడ కబడ్డీ. గ్రామీణ ప్రాంతాలలోని యువజనుల జీవితంలో ఓ ప్రధాన భాగంగా ఉన్న కబడ్డీ ఏమాత్రం ఖర్చులేని, అత్యంత నిరాడంబరమైన క్రీడ. మహారాష్ట్ర, హర్యానా, పంజాబ్, రాజస్తాన్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాల గ్రామీణ ప్రాంతాలలో కబడ్డీ ఓ ప్రధాన క్రీడగా వెలిగిపోతోంది. అపార ప్రతిభ కలిగిన గ్రామీణ క్రీడాకారులకు కబడ్డీ అమ్మఒడిలా మారిపోయింది. అక్కున చేర్చుకొని కోట్ల రూపాయలు సాధించి పెడుతోంది.

ఆటలు కూటికా, గుడ్డకా అంటూ పిల్లల్ని వాటికి దూరంగా ఉంచే రోజులకు కాలం చెల్లింది. ఫుట్‌బాల్, క్రికెట్, టెన్నిస్, బ్యాడ్మింటన్ వంటి గ్లోబల్ క్రీడలు మాత్రమే కాదు, పక్కా దేశవాళీ క్రీడ కబడ్డీ సైతం హర్యానా, మహారాష్ట్ర, పంజాబ్ రాష్ట్రాలకు చెందిన ప్రతిభావంతులైన గ్రామీణ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది. అంతేకాదు, ప్రో-కబడ్డీ లీగ్‌తో ఆటగాళ్లను రాత్రికి రాత్రే కోటీశ్వర్లుగా మార్చి దర్జాగా బతికేలా చేస్తోంది.



కబడ్డీకి, మహారాష్ట్రకు అవినాభావ సంబంధమే ఉంది. ఎనిమిది దశాబ్దాల క్రితమే మహారాష్ట్రలో కబడ్డీ విప్లవానికి తెరలేచింది. శంకర్‌రావ్ సాల్వేని మరాఠీ కబడ్డీ పితామహుడిగా చెబుతారు. కబడ్డీనే ఊపిరిగా భావించిన ఈయనకి కబడ్డీ మహర్షి అన్నబిరుదు కూడా ఉంది. 1970లోనే మహారాష్ట్ర కబడ్డీ జట్టు నేపాల్, జపాన్ దేశాలలో ఎగ్జిబిషన్ మ్యాచ్‌లు ఆడటం ద్వారా ఈ ఆటకు మరింత ఖ్యాతి తీసుకువచ్చింది. మహారాష్ట్ర నుంచే అభిలాష్ మాత్రే, మాయా కాశీనాథ్, శాంతారామ్ జాదవ్, రాజు భవసార్ వంటి పలువురు ప్రపంచ మేటి క్రీడాకారులు దూసుకొచ్చారు. ఒక్క ముంబై మహానగరంలోనే 300కు పైగా కబడ్డీ క్లబ్‌లు ఉన్నాయి. థానే జిల్లాలో 200 కబడ్డీ క్లబ్‌లు ఉన్నాయి.

2014లో ప్రారంభమైన ప్రో-కబడ్డీ లీగ్ ద్వారా రిషాంక్ దేవడిగ తొలి మరాఠా కబడ్డీ సూపర్ స్టార్‌గా వెలుగులోకి వచ్చాడు. ఆ తర్వాత పంకజ్ మోహితే, సంకేత్ సావంత్, నీలేష్ షిండే, అస్లాం ఇనామ్ దార్, విశాల్ మానే, ఆకాశ్ షిండే, బాజీరావ్ హెగ్డే, కాశీలింగ్ అడ్కే, నితిన్ మద్నే, గిరీశ్ మారుతీ ఎర్నాక్ లాంటి ప్లేయర్లు మరాఠీ కబడ్డీకి వెలుగురేఖలుగా ఉంటూ వస్తున్నారు.

మహారాష్ట్రలోని మారుమూల గ్రామానికి చెందిన సిద్ధార్థ దేశాయ్ తన అన్న సూరజ్‌తో కలసి కబడ్డీ ఆడుతూ ఉండేవాడు. ప్రో-కబడ్డీ లీగ్ పుణ్యమా అంటూ సిద్ధార్థ దశ ఒక్కసారిగా తిరిగిపోయింది. 7వ సీజన్ వేలంలో రికార్డు స్థాయిలో కోటీ 45 లక్షల రూపాయల ధర పలికింది. 2022లో జరిగిన ప్రో కబడ్డీ లీగ్ 8వ సీజన్ ఫైనల్స్‌కు పుణే నగరం వేదికగా నిలిచింది. హర్యానా, పంజాబ్ రాష్ట్రాల నుంచి సైతం డజన్లు కొద్ది గొప్ప గొప్ప క్రీడాకారులు ప్రో-కబడ్డీ లీగ్ ద్వారా అభిమానులను ఓలలాడి స్తున్నారు.

**ప్రో కబడ్డీ లీగ్‌తో..**

2014లో ప్రో-కబడ్డీ లీగ్‌తో ఆటకు కొత్త కళ వచ్చింది. క్రీడాకారులకు కాంట్రాక్టు విధానం ప్రవేశ పెట్టడంతో స్టార్ ప్లేయర్లు, ప్రధాన రైడర్లు, డిఫెండర్ల జీవితాలు ఒక్కసారిగా మారిపోయాయి. ప్రారంభ కబడ్డీ లీగ్ సీజన్‌లో ఆటగాళ్ల సంఖ్య 96 మంది ఉంటే 8వ సీజన్ నాటికి 300 దాటిపోయింది. రైడింగ్, బ్లాకింగ్‌తో సాగే కబడ్డీలో స్పెషలిస్ట్ రైడర్లు, డిఫెండర్లతో పాటు, ఆల్ రౌండర్లకు ఎనలేని ప్రాధాన్యం ఉంది. ఆటగాళ్ల ప్రతిభను బట్టి వేలంలో తగిన ధర పలుకుతోంది. మూడు నుంచి నాలుగు మాసాలపాటు సాగే లీగ్‌లో పాల్గొనే ఆటగాళ్లకు కనీస వేతనం 6 లక్షల రూపాయలుగా నిర్ణయించారు. అత్యధికంగా తెలుగు టైటాన్స్ రైడర్ సిద్ధార్థ దేశాయ్‌కు వేలంలో కోటీ 45 లక్షల రూపాయల ధర పలికింది.


**ఒకేఒక్కడు ప్రదీప్ నర్వాల్**

హర్యానాలోని మారుమూల గ్రామంలో జన్మించిన ప్రదీప్ నర్వాల్.. ప్రో-కబడ్డీ లీగ్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకొన్నాడు. తన రైడింగ్ ప్రతిభతో డబ్బుకు డబ్బు, గుర్తింపుకు గుర్తింపు సంపాదించుకొన్నాడు. ప్రో-కబడ్డీ లీగ్ రెండో సీజన్ ద్వారా అడుగుపెట్టిన ప్రదీప్ నర్వాల్ ఆ తర్వాత మరి వెనుదిరిగి చూసింది లేదు. మూడుసార్లు చాంపియన్ పట్నా పైరేట్స్‌కు కెప్టెన్ కమ్ స్టార్ రైడర్‌గా సేవలు అందిస్తున్న ప్రదీప్ కేవలం కబడ్డీ లీగ్ ద్వారానే ఏడాదికి 70 లక్షల నుంచి 90 లక్షల రూపాయల వరకూ ఆర్జిస్తున్నాడు.

**ఐపీఎల్ తర్వాతి స్థానంలో**

భారత్‌లో అత్యంత జనాదరణ పొందుతున్న మొదటి నాలుగు ప్రొఫెషనల్ లీగ్‌లలో ప్రో కబడ్డీ లీగ్ సైతం నిలవడం విశేషం. ప్రో-కబడ్డీ లీగ్ టైటిల్ స్పాన్సర్‌షిప్ కోసం వీవో సంస్థ 42 మిలియన్ డాలర్ల భారీ మొత్తం చెల్లించిందంటే ఈ లీగ్‌కు ఉన్న ఆదరణ ఏపాటిదో చెప్పాల్సిన పనిలేదు. ఐపీఎల్ తర్వాత అత్యధిక మంది అభిమానులున్న, టీవీ ప్రసారాల ద్వారా వీక్షిస్తున్న క్రీడ ప్రో-కబడ్డీ లీగ్ మాత్రమే.

ప్రపంచీకరణతో భారత క్రీడారంగానికి ఏదైనా మేలు జరిగిందంటే అది కేవలం స్టార్ స్పోర్ట్స్ ప్రాయోజిత ప్రో-కబడ్డీ లీగ్ మాత్రమే. గ్రామీణ క్రీడాకారులకు ఉపాధితో పాటు, కబడ్డీకి ప్రపంచవ్యాప్తంగా 180కి పైగా దేశాలలో గుర్తింపు లభించడం విశేషం. ★



క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్

# అవినీతి అడ్డా ఆప్!

అవినీతికి వ్యతిరేకంగా మహారాష్ట్రకు చెందిన సామాజిక కార్యకర్త అన్నా హజారే ఆధ్వర్యంలో 2011లో ప్రారంభమైన ఉద్యమం అప్పట్లో దేశ ప్రజలను అమితంగా ఆకట్టుకుంది. మన్మోహన్ సింగ్ నాయకత్వంలోని యూపీఏ-2 ప్రభుత్వం కొంత వరకు దిగివచ్చింది. కొన్ని డిమాండ్లను అంగీకరించేందుకు తలూపక తప్పలేదు. దీంతో అప్పట్లో అన్నా హజారే ఒక్కసారిగా దేశ ప్రజల దృష్టిలో పడ్డారు. ఆయనను మరో గాంధీ అంటూ కొంత మంది పొగడ్తలతో ముంచెత్తారు. అప్పట్లో ఆయన వెంట అనేకమంది అభ్యుదయవాదులు నడిచారు. వారు కూడా హీరోలుగా గుర్తింపు పొందారు. అటువంటి వారిలో అరవింద్ కేజ్రీవాల్ ఒకరు. ప్రజాజీవితంలో ఊడలు దిగిన అవినీతి కల్మషాన్ని సమూలంగా తొలగించాల్సిన ఆవశ్యకతను ఆయన గుర్తించారు. ఇందుకోసం ఆయన ఐఆర్ఎస్ (ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్) ఉద్యోగాన్ని వదులుకున్నారు. ప్రజా జీవితంలోకి అడుగుపెట్టారు. కాలక్రమంలో కేజ్రీవాల్ క్రియాశీలకంగా వ్యవహరించారు. సొంతంగా ఆమ్ ఆద్మీ పార్టీ (ఏఏపీ)ని ప్రారంభించారు. ఆయన జాతీయ కన్వీనర్గా ప్రారంభమైన పార్టీలో అప్పట్లో అనేకమంది సామాజిక కార్యకర్తలు, మేధావులు, న్యాయవాదులు చేరారు. అవినీతి రహిత సమాజ స్థాపనే అంతిమ లక్ష్యమని ఘనంగా ప్రకటించారు. అవినీతిని తొలగించాలన్న ఉద్దేశంతో పార్టీ గుర్తుగా 'చీపురు'ను ప్రకటించారు. దీంతో అప్పట్లో అందరూ కేజ్రీవాల్లో కొత్త నాయకుడిని చూశారు. ఆశావాద నాయకుడిగా రాజకీయాల్లో పేరొందారు. అందరూ అనుకున్నట్లుగానే అనంతరం జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అరవింద్ కేజ్రీవాల్ పార్టీ అద్భుత విజయాన్ని నమోదు చేసింది. అప్పటివరకు వరుసగా మూడు దఫాలుగా (పదిహేనేళ్ల నుంచి) అధికారంలో కొనసాగుతున్న హస్తం పార్టీ అడ్రసే గల్లంతైంది. నాటి ఢిల్లీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్పై న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి పోటీచేసిన కేజ్రీవాల్ ఘన విజయం సాధించారు. మొత్తం 70 సీట్లకు గాను ఆప్ ఖాతాలో ఏకంగా 67 సీట్లు జమ కాగా కేంద్రంలో చక్రం తిప్పుతున్న భారతీయ జనతా పార్టీ కేవలం 3 సీట్లతో సరిపెట్టుకుంది. అరవింద్ కేజ్రీవాల్ ప్రజాజీవితంలో కొత్త శకాన్ని ప్రారంభిస్తారని, ప్రజల జీవన ప్రమాణాల్లో గణనీయ మార్పులు వస్తాయని అందరూ ఆశించారు. తొలి రోజుల్లో కేజ్రీవాల్ పాలన కూడా ఆ దిశ గానే సాగింది. రెండోదఫా, మూడో దఫా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ కేజ్రీవాల్ పార్టీ ప్రజల మన్ననలు అందుకుంది.



మనీశ్    జైన్

ఇప్పుడదంతా చరిత్ర. గతానికీ, వర్తమానానికీ పోలికే లేదు. నాటి కేజ్రీవాల్కు, ఇప్పటి కేజ్రీవాల్కు హస్తిమశకాంతరం అంత తేడా ఉంది. అప్పట్లో ఆయనలో ఉద్యమకారుడు ఉన్నారు. ఇప్పుడు ఆయన ఫక్తు రాజకీయ నాయకుడిగా మారిపోయారు. వర్తమాన రాజకీయాల్లో దశాబ్దాల అనుభవం గల నాయకులకే పాఠాలు చెప్పగల స్థాయికి కేజ్రీవాల్ చేరుకున్నారు. ఫలితంగా అప్పట్లో ఆయనతో కలిసి నడిచిన నాయకులంతా ఒక్కరొక్కరు దూరమయ్యారు. క్రియాశీల రాజకీయ నాయకుడిగా మారిన కేజ్రీవాల్తో కలసి ప్రయాణించడం కష్టమైన పని అని అనుభవపూర్వకంగా అర్థం చేసుకున్నారు. ఫలితంగా ఆయన ఇప్పుడు ఒంటరయ్యారు. ఆయన పక్కన అభ్యుదయవాదులు ఇప్పుడు మచ్చుకైనా లేరు. ఉన్నదంతా ఫక్తు అవకాశాద రాజకీయ నాయకులే. ఫలితంగానే ఆయన మంత్రివర్గ సహచరులు జైలుపాలయ్యారు. అవినీతి కేసుల్లో పీకల్లోతుల్లో కూరుకుపోయి ఇప్పుడు తీరిగ్గా కటకటాలు లెక్కిస్తున్నారు. కేజ్రీవాల్ కుడిభుజాలుగా పేరుగాంచిన ఇద్దరు మంత్రివర్గ సహచరులు జైలుపాలయ్యారు. వారిలో అనేక శాఖలు నిర్వహించిన సత్యేంద్ర జైన్ గత ఏడాది మే నెలలో అరెస్టయ్యారు. ఇప్పటికీ ఆయన జైల్లోనే ఉన్నారు. తాజాగా మరో మంత్రివర్గ సహచరుడు, ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోదియాను పోలీసులు ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టు చేశారు. ప్రస్తుతం ఆయన బెయిల్ కోసం కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. తొలుత ఆయన బెయిల్ కోసం సుప్రీంకోర్టు తలుపుతట్టగా సర్వోన్నత న్యాయస్థానం నిర్మొహమాటంగా తిరస్కరించింది. బెయిల్ కోసం ట్రయల్ కోర్టును లేదా ఢిల్లీ హైకోర్టును సంప్రదించకుండా నేరుగా తమ వద్దకు రావడంలో అర్థం లేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పి.ఎస్. నరసింహలతో కూడిన ధర్మాసనం తలంటింది. ఇప్పుడు తాము పిటిషన్ విచారణకు స్వీకరిస్తే తప్పుడు సంకేతాలు వెళతాయని ధర్మాసనం పేర్కొంది.

అరెస్టయిన సిసోదియా దర్యాప్తులో పోలీసులకు సహకరించకుండా అడ్డదిడ్డంగా వ్యవహరిస్తున్నారు. కీలక సమాచారం చెప్పకుండా పోలీసుల ప్రశ్నలను దాటవేస్తున్నారు. అడిగిన ప్రశ్నలే అడుగుతున్నా రంటూ పోలీసులపై సిసోదియా ఎదురుదాడి చేశారు. దీంతో ఆయన్నుంచి సమాధానాలు రాబట్టేందుకు పోలీసులు కొత్త వ్యూహంతో ముందుకెళ్లారు. ఆయన సమాధానాల్లోని నిజానిజాలను నిగ్గు తేల్చేందుకు ఆయన వద్ద పనిచేసిన మాజీ అధికారులను కూడా ఎదురెదురుగా కూర్చోబెట్టి విచారించారు. సిసోదియా మాజీ కార్యదర్శి పి.అరవింద్, అప్పటి ఎక్సైజ్ కమిషనర్ గోపీ కృష్ణలను అదే గదిలో ఉంచి సమాచారం రాబట్టే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా సిసోదియా వైఖరిని, ఆయన ప్రవర్తన, హావభావాలను పోలీసులు నిశితంగా గమనించారు. అరెస్టు సమయంలో, విచారణ సమయంలో సిసోదియా వైఖరి బాధ్యతా యుతంగా లేదు. అసలు తన అరెస్టే అక్రమమని, మద్యం విధాన రూపకల్పన అన్నది ప్రభుత్వ విధాన నిర్ణయమని, ఇందులో

ఆర్థికమంత్రిగా తన పాత్ర ఏమీ లేదని ఆయన వాదించారు. మద్యం విధాన సవరణకు ఆమోద ముద్ర వేసింది లెఫ్టినెంట్ గవర్నర్ అని, కానీ దర్యాప్తు సంస్థ ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని వేధిస్తుందని సిసోదియా తరఫు లాయర్ కోర్టుకు తెలిపారు. అనేక సంప్రదింపుల అనంతరం మద్యం విధాన రూప కల్పన జరిగిందదని, ఇందులో లెఫ్టినెంట్ గవర్నర్ నుంచి సలహాలు కూడా తీసుకు న్నట్లు సిసోదియా తరఫు లాయర్ వివరించారు. సీబీఐ ఆరోపిస్తున్నట్లు తాను ఫోన్లు మార్చిన మాట వాస్తవమే అయినప్పటికీ అది తప్పేమీ కాదన్నారు సిసోదియా. అయితే మద్యం విధాన రూపకల్పనకు సంబంధించి ముసాయిదాలో న్యాయనిపుణుల అభిప్రాయాలను సిసోదియా తొలగించారని సీబీఐ పేర్కొంది. ముసాయిదాలో మార్పులపై తమకు వాట్సప్ సందేశాలు ఒక ఫోన్ నుంచి వచ్చాయని ఎక్సైజ్ మాజీ అధికారి ఒకరు విచారణలో పేర్కొ న్నారు. ఆ ఫోన్ నెంబరు సిసోదియాదేనని అధికారులు చెబుతున్నారు. 2022 ఆగస్టు, సెప్టెంబరు మధ్య సిసోదియా 18 ఫోన్లు, 4 సిమ్ కార్డులు, ఉపయోగించినట్లు వెల్లడైంది. ఆగస్టు 19న కేసు నమోదైతే మర్నాడే ఒకే నంబరుపై 3 ఫోన్లు మార్చడం పైనా సరైన సమాధానాలు ఇవ్వలేదని అధికారులు పేర్కొన్నారు. ఒక సిమ్‌ను ఒకే రోజు రెండు వేర్వేరు ఫోన్లలో వాడినట్లు బయట పడిందన్నారు.


ఢిల్లీ ఉపముఖ్యమంత్రి సిసోదియా అరెస్టును తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఖండించడం గమనార్హం. ఆయన అరెస్టుకు, కేసీఆర్ ఖండనకు సంబంధం ఏమిటో!? ప్రధాని, అదానీల అనుబంధంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ప్రజల దృష్టిని మళ్లించడానికే సిసోదియా అరెస్టును తెరపైకి తీసుకువచ్చారని ఆయన పేర్కొన్నారు. వాస్తవానికి మద్యం కుంభకోణానికి సంబంధించి కేసీఆర్ కూతురు కవిత పాత్రపై అనేక ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఆమెను దర్యాప్తు సంస్థ విచారించిన సంగతి కూడా తెలిసిందే. ఆమె వ్యక్తిగత ఆడిటర్‌ను ఇప్పటికే అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఆయన ఇప్పటికీ కస్టడీలోనే ఉన్నారు. రేపో మాపో కవితను కూడా అరెస్టు చేసే అవకాశం ఉందన్న వార్తలు వస్తున్నాయి.

సీబీఐ రిమాండు నివేదికను గమనిస్తే నిందితుల పాత్ర గురించి స్పష్టంగా అర్థమవుతుంది. సిసోదియా దక్షిణ భారత వ్యాపారులతో కుమ్మక్కై ఢిల్లీ ఎక్సైజ్ విధానాన్ని రూపొందించినట్లు సీబీఐ తన రిమాండు రిపోర్టులో పేర్కొంది. ఈ విధాన రూపకల్పన సమయంలో ఆయన నాలుగు ఫోన్లు మార్చారు. ఈ వ్యవహారానికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించకుండా వాటిల్లో మూడింటిని ధ్వంసం చేశారు. ఈ పాలసీ కోసం రూపొందించిన ముసాయిదాలో తొలుత అయిదు హోల్ సేలర్స్ లాభం మార్జిన్ 5 శాతం, రూ.100 కోట్ల టర్నోవర్ ఉండాలని ప్రతిపాదించారు. అయితే తరవాత మూడు రోజుల్లోనే హోల్ సేలర్స్ ప్రాఫిట్ మార్జిన్‌ను 5 నుంచి 12 శాతానికి, టర్నోవర్ పరిమితిని వంద కోట్ల నుంచి 5 వందల కోట్లకు పెంచుతూ మార్పులు చేశారు. ఇందుకు గల కారణాలను సిసోదియా వివరించలేకపోయారని సీబీఐ పేర్కొంది. ఈ కేసును సీబీఐకి ప్రతిపాదించిన 2022 జులై 22నే సిసోదియా తన ఫోన్ మార్చారు. దానిని దర్యాప్తు సమయంలో సీబీఐకి ఇవ్వలేదు. 2021 జనవరి 1 నుంచి ఆగస్టు 19 మధ్యకాలంలో నాలుగు ఫోన్లు మార్చారు. వాటిల్లో మూడింటిని ధ్వంసం చేశారు. సీఆర్పీసీ 41ఏ కింద మూడుసార్లు నోటీసులు ఇవ్వగా సిసోదియా గత ఏడాది అక్టోబరు 17న, తాజాగా ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరులో హాజరయ్యారు. తగినంత సమయం ఇచ్చినా విచారణలో సిసోదియా వాస్తవాలను దాచిపెట్టారు. మద్యం విధానానికి సంబంధించి కొన్ని దస్త్రాలు కనపడకపోవడం, మాజీ కార్యదర్శి ఇచ్చిన వాంగ్మూలాలు సిసోదియా అరెస్టుకు దారితీశాయి. కీలక ఫైళ్లలో ఏముంది, అన్నిసార్లు ఫోన్లు ఎందుకు ఉపయోగించారు తదితర వివరాలు తెలుసు కునేందుకు దర్యాప్తు అధికారులు ప్రయత్ని స్తున్నారు. గత ఏడాది ఆగస్టులో ఢిల్లీ ఎక్సైజ్ కార్యాల యంలో స్వాధీనం చేసుకున్న డిజిటల్ సాధనంతో ఈ వ్యవహారంలో సిసోదియా పాత్ర వెలుగులోకి వచ్చింది. ఎక్సైజ్ శాఖకు సంబంధం లేని మద్యం విధానం ముసాయిదా పత్రం ఉన్నట్లు తేలిందని సీబీఐ వర్గాలు చెబుతున్నాయి.

కేజ్రీవాల్ మంత్రివర్గంలో సిసోదియా అనేక కీలక శాఖలను నిర్వహించారు. పార్టీకి, ప్రభుత్వానికి సంబంధించి అరవింద్ కేజ్రీవాల్‌కు మనీశ్ సిసోదియా కుడిభుజం వంటివాడు. సిసోదియా సలహా లేకుండా కేజ్రీవాల్ అడుగు కూడా ముందుకు వేయరు. కీలకమైన వైద్య, ఆరోగ్య శాఖ, ఆర్థిక, రిజిస్ట్రేషన్లు, స్థానిక సంస్థలు, భవనాలు, ఉన్నత విద్య, విజిలెన్స్, సహకారం, ఐటీ, ఎక్సైజ్ వంటి కీలక శాఖలకు సిసోదియా సారథిగా వ్యవహరిస్తున్నారు. సిసోదియా పూర్వాశ్రమంలో పాత్రికేయుడు. జన లోక్‌పాల్ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఢిల్లీలోని పట్పర్ గంజ్ నియోజకవర్గం నుంచి వరుసగా (మూడుసార్లు) అసెంబ్లీకి ఎన్నికవుతున్నారు. గత ఏడాది అరెస్టయిన జత్యేంద్ర జైన్ కూడా కేజ్రీవాల్‌కు కీలక సహచరుడే. జైన్ కూడా సిసోదియా మాదిరిగానే పలు ముఖ్య శాఖలకు మంత్రిగా పనిచేశారు. ఆరోగ్యం, పరిశ్రమలు, విద్యుత్, గృహ నిర్మాణం, పర్యాటకం, నీటి పారుదల, వరదల నియంత్రణ, ప్రజా పన్నులు, శ్రమ, ఉపాధి వంటి ప్రధాన శాఖలకు సచివుడుగా పనిచేశారు. యూపీలోని బాగ్ పత్‌కు చెందిన జైన్ తరవాత రోజుల్లో ఢిల్లీలో స్థిరపడ్డారు. ఢిల్లీలోని షకుర్ బస్తీ నియోజకవర్గం నుంచి వరుసగా మూడుసార్ల నుంచి అసెంబ్లీకి ఎన్నికవుతున్నారు. గత ఏడాది మే నెలలో అరెస్టయిన జైన్‌కు ఇప్పటివరకు బెయిల్ రాలేదంటే ఆయనపై గల అభియోగాల తీవ్రత ఏమిటో అర్థమవుతుంది. జైన్, సిసోదియా రాజీనామాలను కేజ్రీవాల్ ఇప్పుడు ఆమోదించడం విశేషం. ఎప్పుడో అరెస్టయిన జైన్ రాజీనామాను ఇప్పటిదాకా పెండింగులో పెట్టడం అర్థరహితం. తీవ్రమైన అభియోగాలపై జైల్లో ఉన్న వ్యక్తులు ఇన్ని శాఖలకు ఎలా సారథ్యం వహించారన్న ప్రశ్నకు ఇక్కడ సమాధానం లభించదు. రాజీనామాల ఆమోదం అనంతరం వారి శాఖలను తాత్కాలికంగా రాజకుమార్ ఆనంద్‌కు, కైలాశ్ గెహ్లాట్‌లకు ప్రభుత్వం కేటాయించింది. మొత్తానికి అవినీతిని అంతమొంది స్తానంటూ ఆర్భాటంగా రాజకీయ అరంగ్రేటం చేసిన అరవింద్ కేజ్రీవాల్ ఇప్పుడు అదే ఊబిలో పీకల్లోతుల్లో కూరుకుపోవడం కాల వైచిత్రి.

వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్

ఢిల్లీ ఉపముఖ్యమంత్రి సిసోదియా అరెస్టును తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఖండించడం గమనార్హం. ఆయన అరెస్టుకు, కేసీఆర్ ఖండనకు సంబంధం ఏమిటో!? ప్రధాని, అదానీల అనుబంధంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ప్రజల దృష్టిని మళ్లించడానికే సిసోదియా అరెస్టును తెరపైకి తీసుకువచ్చారని ఆయన పేర్కొన్నారు. వాస్తవానికి మద్యం కుంభకోణానికి సంబంధించి కేసీఆర్ కూతురు కవిత పాత్రపై అనేక ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే.



చదువులు భయపెడుతున్నాయి. విద్యార్థుల్లో దడ పుట్టిస్తున్నాయి. తల్లిదండ్రులను బెంబేలెత్తిస్తున్నాయి. లక్షల రూపాయలు పెట్టి పిల్లల్లో భయాన్ని, ఒత్తిడిని కొనుక్కుం టున్న చందంగా తయారవుతున్నాయి. విద్యార్థుల్లో ఉన్న అవగాహన, విజ్ఞానం బట్టీలు, మార్కులు, ర్యాంకుల వరదలో కొట్టుకుపోతున్నాయి. మొత్తానికి విద్యార్థులు యంత్రాల్లా తయారవుతున్నారు. తెలంగాణలో ఈ పరిస్థితి ఒకింత అధ్వా నంగా ఉంది. కార్పొరేట్ విద్య మాయలో చదువులు అల్లాడిపోతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం విద్యారంగాన్ని వెక్కిరి స్తోంది. ఫలితంగా తల్లిదండ్రుల్లో తెలియని ఓ భయాందోళన నెలకొంది. ఈ పరిస్థితులు అసలు హాస్టల్ చదువులంటేనే తల్లిదండ్రులు భయపడిపోయేలా పరిణమించాయి.

ఓవైపు ర్యాగింగ్, మరోవైపు మార్కుల కోసం అధ్యాపకుల ఒత్తిళ్లు విద్యార్థులను గందరగోళ పరిస్థితుల్లోకి నెట్టేస్తున్నాయి. అయితే సీనియర్ల ఆగడాలు, లేదంటే అధ్యాపకుల అరాచకాలు విద్య కోసం హాస్టళ్లలో చేరే వాళ్ల మనసును కలుషితం చేస్తున్నాయి. తమ గమ్యం ఏంటో కూడా మర్చిపోయే పరిస్థితులను సృష్టిస్తు న్నాయి. తెలంగాణలో గత కొన్నిరోజులుగా చోటు చేసుకుంటున్న పరిణామాలు సమాజానికి సవాలు విసురుతున్నాయి. అసలు అవి ఆత్మహత్యలా? హత్యలా? అని అందరూ ఆలో చించేలా చేస్తు న్నాయి. కానీ సమాధానాలు మాత్రం లభించడం లేదు. వీటికి మూలం ఎక్కడుంది అనే అంశాలపై ప్రస్తుతం విస్తృతంగా చర్చ జరుగుతోంది.

ముఖ్యంగా కార్పొరేట్ విద్యా సంస్థలు ర్యాంకుల పంట పండాలని లక్ష్యాలు విధిస్తుండటంతో లెక్చరర్లు బట్టీ చదువులకే మొగ్గు చూపుతున్నారు. అప్పటికే రూపొందించిన మెటీరియల్‌ను విద్యార్థులతో బట్టీ కొట్టిస్తున్నారు. ఫలితంగా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలికితీయకపోగా ఉన్నది కాస్త పోయే రీతిలో కార్పొరేట్ చదువులు కొనసాగుతున్నాయి. ఇక స్పెషల్ సిలబస్ అంటూ ఐఐటీ, జేఈఈ, ఏఐఈఈఈ, నీట్ బ్యాచ్‌ల విద్యార్థులపై చేస్తున్న ఒత్తిడి మాటల్లో చెప్పలేం. ఉదయం నిద్రలేచింది మొదలు రాత్రిళ్లు పొద్దుపోయే వరకు స్పెషల్ క్లాసులంటూ రుద్దుడే.. రుద్దుడు. చదువు.. చదువు తప్ప వేరే ధ్యాస లేకపోవడంతో మానసిక ప్రశాంతత, స్వేచ్ఛ కరువై వారిలో ఉన్న సహజ ప్రతిభకు కూడా ఫుల్ స్టాప్ పడుతోంది.

ఇక హాస్టళ్లలో ఉండే విద్యార్థుల సంగతి.. కొంతమంది ఇష్టంగా చేరితే కొంతమంది అయిష్టంగానే హాస్టళ్లలో చేరుతున్నారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో విద్యనభ్యసించడానికి హాస్టళ్లలో చేరిన విద్యార్థులు ఒక్కసారిగా మారిన వాతావరణాన్ని ఆకంపు చేసుకోలేకపోతున్నారు. అంతకు క్రితం వరకు పాఠశాలల్లో చదువు పూర్తికాగానే ఇంటికి వెళ్లి తల్లిదండ్రుల వద్ద మెలిగిన వాతావరణం ఒక్కసారిగా దూరమవుతుంది. ప్రథమ సంవత్సరంలో చేరిన తర్వాత ఒకటి రెండు వారాలు కొత్తగా, ఉత్సాహంగా అనిపించినా రాను రాను విద్యార్థుల్లో కొంత అలజడి మొదలైపోతుంది. తల్లిదండ్రులతో ఫోన్లో మాట్లాడాలన్నా నిర్ణీత సమయం ఉండటంతో ఆయా క్యాంపస్‌ల్లో వేలాది విద్యార్థుల మధ్య తమకెప్పుడు మాట్లాడే సమయం వస్తుందోనని



# ఇవేం చ

ఆశగా ఎదురుచూస్తుంటారు. ఇక విద్యార్థినుల పరిస్థితి దయనీయం. అప్పుడే కౌమారదశకు రావడం, శారీరకంగా వారిలో వచ్చే మార్పులు, ఇబ్బందులను ఇతరులకు చెప్పుకునేందుకు ఇబ్బందిపడే మానసిక స్థితి వర్ణనాతీతం. ఆదివారం వచ్చినా పుస్తకాలతో మాత్రమే కుస్తీపట్టాలి. దీంతో ఎంతోమంది విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. రెండు సంవత్సరాలు ఎలా గడుస్తాయో! అంటూ స్నేహితులు, క్లాస్‌మెట్స్‌తో చర్చించుకుంటూ రాత్రుళ్లు నిద్రిస్తున్నా అవే ఆలోచనలతో మునిగిపోతుంటారు. ఈ క్రమంలో అధ్యాపకుల ఒత్తిడిని తట్టుకోలేక, ర్యాంకుల వేటలో పరుగెత్తలేక, ఇంటి వద్ద తల్లిదండ్రుల పరిస్థితిని అర్థం చేసుకుని వారికేం సమాధానం చెప్పాలో తెలియక వారిలో వారు మథన పడుతూ కుంగిపోతూ ఆత్మన్యూనతా భావంలో కొట్టుమిట్టాడుతున్నారు. కాబట్టి తల్లిదండ్రులు కార్పొరేట్ విద్యా సంస్థల వలలో పడకుండా పిల్లలకు ఉజ్వల భవిష్యత్తును అందిం చాలి. స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించాలి. వారిని సొంత నిర్ణయాలు తీసుకునే విధంగా ప్రేరేపించాలి. వారికి దేనిపై ఆసక్తి ఉందో గ్రహించి, ఆ దిశగా వారిలో ప్రోత్సహించాలి.

ఇటీవలి పరిణామాలని గమనిస్తే వరంగల్‌లో మెడిసిన్ విద్యార్థి ప్రీతి ఘటన, హైదరాబాద్



ప్రీతి



సాత్విక్

సుజాత గోపగోని, 6302164068



# దువులు?

నార్సింగిలో ఇంటర్ విద్యార్థి సాత్విక్ ఆత్మహత్య కన్నవాళ్లకు కడుపుకోతను మిగులుస్తున్నాయి. విద్యావ్యవస్థలో లోపాలను ఎత్తిచూపుతున్నాయి. చదువుకునే వ్యవస్థలో ఏం లోపించిందో, ఏం అవసరం ఉందో అర్థమయ్యేందుకు గుణపాఠాలుగా మారుతున్నాయి.


తనపై ర్యాగింగ్ జరిగిన విషయం మెడిసిన్ విద్యార్థి ప్రీతి తల్లిదండ్రులకు చెప్పింది. కానీ, రెండు రకాల భయాలు ఆమె తల్లిదండ్రులను ఆవరించాయి. అప్పటికే ఎంతో ఖర్చుచేసి కూతురుని చదివిస్తున్న తాము ఇప్పటికిప్పుడు చదువు ఆపేస్తే ఆ ఖర్చు అంతా బూడిదలో పోసిన పన్నీరు అవుతుందనుకున్నారు. మరోవైపు.. కాలేజీలో గట్టిగా అడిగితే వేధింపులు ఎక్కువవుతాయని భయపడ్డారు. అందుకే మింగలేక కక్కలేక తమ బాధను లోపలే దాచుకున్నారు. కానీ తమ బిడ్డ దూరం అవుతుందని ఊహించలేక పోయారు.

ప్రీతి ఇంతటి ఘోరమైన నిర్ణయం తీసుకుందంటే దీని వెనక ఎంత మానసిక క్షోభ అనుభవించి ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఆమె చిన్నపిల్ల కాదు. ఒక డాక్టర్. బ్యాచిలర్ డాక్టర్ కోర్సు పూర్తి చేసికొని వైద్యురాలిగా పనిచేస్తుంది కూడా. ఇప్పుడు స్పెషలైజేషన్ కోసం పీజీ మెడిసిన్ కోర్సు అభ్యసిస్తోంది. కాలేజీలు ఎలా ఉంటాయి, చదువులు ఎలా ఉంటాయి తెలియనివి కాదు. అలాగే ర్యాగింగ్ అంటే కూడా అవగాహన లేని అమ్మాయి కాదు. కానీ ఊహించని రీతిలో కడతేరింది. ఆమె ఆత్మహత్య చేసుకుందని కాలేజీ వర్గాలు చెబుతుంటే.. లేదు హత్య చేశారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఏది జరిగినా దానికి కారణం మాత్రం వేధింపులు, ఒత్తిడి అనేది మాత్రం స్పష్టం అవుతుంది. ఇక నార్సింగ్ శ్రీచైతన్య కాలేజీలో అసువులు బాసిన సాత్విక్‌ది మరో కథ. ప్రీతి సీనియర్ల వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకుంటే.. సాత్విక్ అధ్యాపకుల ఒత్తిడి భరించలేక బలవన్మరణం చెందాడు.

వాతావరణం ఇలా ఎందుకు తయారవుతుంది? సీనియర్లు ర్యాగింగ్ అంటూ జూనియర్లను ఎందుకు వేధిస్తున్నారు? అధ్యాపకులు కూడా విద్యార్థులు స్వతంత్రంగా, ప్రశాంతంగా ఉండే వాతావరణాన్ని ఎందుకు కల్పించలేక పోతున్నారు? ఇక, కార్పొరేట్ యాజమాన్యాలు, అధికారులు, ఉన్నతాధికారులు ఈ పరిస్థితులను ఎందుకు మార్చలేక పోతున్నారు? ఇలా వేసుకుంటూ పోతే అన్ని ప్రశ్నలే ఎదురవుతున్నాయి. వాటికి పరిష్కార మార్గాలు ఉన్నప్పటికీ అవి అమలవుతాయా, లేవా? అనే సందిగ్ధతను లేవనెత్తుతున్నాయి.

ధరావత్ ప్రీతి తన సీనియర్ వేధింపులు భరించలేక ఒత్తిడికి గురైందని తల్లిదండ్రులు, పోలీసులు వెల్లడించారు. అది నిర్ధారణ కూడా అయింది. అయితే మరో కోణం కూడా ఉంది. ప్రీతి ఒత్తిడి వెనక కళాశాల యాజమాన్యం తీసుకునే 50 లక్షల రూపాయల బాండ్ కూడా కారణమంటున్నారు. వైద్య విద్యలో పీజీ సీటు వచ్చిన సమయంలో అడ్మిషన్ బాండ్ కింద 50 లక్షలరూపాయల అగ్రిమెంట్‌పై సంతకం చేయాల్సి ఉంటుంది. అడ్మిషన్ తీసుకున్న తర్వాత ఒకవేళ ఏ కారణాలతోనైనా కోర్సును మధ్యలో వదిలేస్తే విశ్వవిద్యాలయానికి 50 లక్షల రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. ఇలా బాండ్ తీసుకుంటే అత్యంత ప్రతిష్టాత్మకమైన వైద్య విద్యా కోర్సును విద్యార్థులు ఎవరూ మానుకోరని భావించి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం. పీజీ మెడికల్ సీటు మధ్యలో వదిలేస్తే రూ.20 లక్షలు చెల్లించాలని గత సంవత్సరం దాకా నిబంధన ఉండేది. అయితే, చాలామంది వైద్య విద్యార్థులు మెడికల్ పీజీ కోర్సులను మధ్యలోనే వదిలేస్తున్న కారణంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఆ మొత్తాన్ని 50 లక్షల రూపాయలకు పెంచింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఒకవేళ ఏవైనా ఇబ్బందులతో చదువు వద్దు అనుకున్న విద్యార్థులు కూడా, వదిలి వెళ్లలేని పరిస్థితి. అటువంటి పరిస్థితినే ప్రీతి కూడా ఎదుర్కొందని చెబుతున్నారు. ఈ క్రమంలోనే సీనియర్ల ఒత్తిడి తట్టుకోలేని ప్రీతి, అందులో నుంచి బయట పడలేని పరిస్థితి. ఒకవేళ చదువు మానేద్దామని భావిస్తే 50లక్షల రూపాయలు యూనివర్సిటీకి చెల్లించాలంటే తన తండ్రి అంత డబ్బు ఎక్కడి నుంచి తెచ్చి కడతాడని ప్రీతి తీవ్ర ఒత్తిడికి, మనోవేదనకు గురైందని అంటున్నారు. ఈ క్రమంలోనే ప్రస్తుతం మెడికల్ పీజీ విద్యార్థులకు ప్రభుత్వం తప్పనిసరి చేసిన యాభై లక్షల బాండ్ విషయంపై చర్చ జరుగుతోంది. ర్యాగింగ్ భూతంపై కూడా ఉక్కుపాదం మోపాలని, ర్యాగింగ్‌కు పాల్పడిన వారికి కఠిన శిక్షలు విధించాలని కోరుతున్నారు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్



కథ

ఇయ్యాల పోలాల అమాస. నాను ఎక్కడ వున్నా, ఎలా వున్నప్పటికీ దసరాకి మావూరు ఎల్లాల్సిందే. దసరాకి తొమ్మిది దినాలు ముందే పోలాల ఆమాసకి మావూరు పొలిమేరలో వుండి కాపుకాసే గేమ దేవత అసిరిపపోలమ్మను బారికి మేలం, అగ్గి దిమిటీలతో వూర్లోకి తెచ్చి దసరా వరకు మావూరు నడిబొడ్డున వున్న నాయుడు గారింట్లో పెట్టి పూజిత్తాం. ఇది మా తాతలు, ముత్తాతలు దగ్గర్నుంచి వత్తున్న ఆచారం. ఉపుడు నా వయసు రమారమి ఎనిమిది పదులు దాటుతున్నాయి. ఒకప్పుడు ఉద్దానం ఏరూ... ఉపుడు ఉద్దానం ఏరు. వరుసపెట్టి గాలోనలు, సీడ పీడలతో ఉద్దానం అద్దానమైపాయింది. మాబోటి రైతులు అప్పులపాలై దేశాలు పట్టేసినారు. అందులో మాయదారి పులక జబ్బుసేసి మాసానికో సేవం సొసానంలో కాలి బుగ్గావ్వాల్సిందే. మా ఇంటి ఆడది సచ్చిపాయినాక నాను ఎంత ఒద్దని బతిమలాడినా నా కొడుకు, కోడలు మాత్రం బలవంతాన ఇసాకపట్నం తీసుకెల్లిపోయారు. ఇరవై సమ్మస్సరాలు నుంచి ఇక్కడే వుంతున్నాను. అందుకే పండక్కో, పబ్బానికో వూరు సూసినట్టు, బందువులు, ఇరుగు,పొరుగు వార్ని కలిసివున్నట్టూ వుంతాదని పాతికేళ్ల మనమడ్ని తోడెట్టుకొని వత్తుంటాను. వచ్చే ఏడాది ఈ దినానికి నాను ఉంతానో, పోతానో తెల్దు గానీ... ఈ దసరా వారం దినాలు మాత్రం నాను పుట్టి, పెరిగిన ఉద్దానంలో గడిపెయాలని వత్తున్నా.

ఆపసోపాలు పడి నా మనుమడితో లింకు బసులో మా వూరు పెద్ద సావుకారి దుకాణం వద్ద దిగాను. అప్పటికే సిన్నపాటి సినుకులు పడుతున్నాయి. వూరు నాయుడోలు ఇంటికాడ బారికి మేలం దరువు నా సెవిలో పడగానే ఒక్కసారి ఒళ్లు జలదరించింది. ఉన్నపలంగా కాల్లు అటే లాగేసాయి. అమ్మోరు జంగిడిని తలమీద పెట్టుకొని జన్ని పూజారి వూరు పొలిమేర దాటుతున్నాడు. పూజారి ఎనకే సిన్నా, పెద్దా తేడా లేకుండా నడుత్తున్నారు. నాను కూడా నా మనమడ్ని తోడెట్టుకొని మూడు గోర్జీల సంది వరకు ఎల్లినాను. అక్కడకు ఎళ్లగానే నా కాలుకు బందాలు పడిపోయినట్లు నిలబడిపోయాను. పదడుగుల దూరంలో రెల్లసెట్టు, దానికింద తాటికమ్మల గుడిసెలో బారికి కామయ్య తాత, బారికమ్మల రాయి బొమ్మలు. ఉప్పుడే జన్నిపూజరి ఆముదం దీపం ఎలిగించినట్లు వున్నాడు. ఆ దీపం ఎలుతురులో ఆ జత ఇగ్రహాలు దగదగా మెరిసిపోతున్నాయి. బారికమ్మ ఇగ్రహానికి నింపుగా పసుపురాసి, నుదుటన పది పైసాల బిల్లంతా ఎర్రటి కుంకుమ బొట్టు. బారికి తాత ఇగ్రహం సూస్తే ఒళ్ళు పులుము కుంది. సేతిలో ఎదురు దుడ్డుగర్ర, పెద్ద మీసాలు, తలకు తలపాగాతో బయంకరంగ వున్నాడు. రెండు సేతులు జోడించినాను.

‘బారికి తాత...మా వూరును, మమ్మల్ని సల్లగా సూడు’ అని మొక్కినాను. మావోడికి దండం పెట్టమన్నాను. కానీ ఆడు పర్వలేదన్నాడు. రాతి బొమ్మలకి దండం పెట్టడం ఏంటి తాతా అని నాతో ఎలాకోలం ఆడినాడు.

‘ఒరేయ్...అవి రాతి బొమ్మలు కావురా... మనందరినీ కాపుకాసే పేణం లేని, దేవుడు సేసిన రాతి మనుసులు’ అని సెప్పినాను. మా వోడు ఓ సిన్నపాటి సిరినవ్వు నవ్వి

‘ఇంతకీ ఇవి ఎవరి రాతి బొమ్మలు తాతా..?!’ అంటూ ఆ రాతి బొమ్మలు గురించి తెల్సుకోవాలని నన్ను పెశ్నించాడు.

‘మనూరు బారికి కామడు, అతని బార్య బారికమ్మ ఇగ్రహాలు’

‘ఇంతకీ బారికి అంటే ఎవరు తాతయ్య...?’ అని అడిగాడు.

‘బారికి అంతే.... వూరిని కాపలా కాసేవాడు అని అర్థం’ అని సెప్పినాను మనవడికి.

‘ఓహో...అలాగా తాతయ్య, ఇంతకీ వూరును కాపలా కాసేది ఎవరు తాతయ్య...?’

‘అదేరా..అమ్మోరు దగ్గర డప్పు కొడుతుంటారు



కదా... అల్లే' ఇంకా ఇడమరుసి సెప్పాలని ఇట్టం లేక.

'ఓహో.. మాలోలా...?!'

'నోర్ముయ్యార ఎదవా... అలా కులం పేరెట్టకూడదు తెలీసా..? కూటికి నేకపోయినా.. కులానికి తక్కువైనా ఆలు సత్తిమైన మనుషులు. అందరూ అల్లని ముద్దుగా 'బారికి' అని పిలుత్తూ ఉంతారు'. అని ఆల్లకు, మాకు వున్న సంబందాన్ని గొప్పగా సెప్పినాను.

'వూరికి దూరంగా ఉన్నోళ్లకి రాతి బొమ్మలు చేసి పూజిస్తున్నారు అంటే వాళ్ల గొప్పతనం తెలుసు కోవాల్సిందే తాతయ్య' అంటూ మా వాడు నన్ను కోరడం సంతోసంగా వుంది. ఎక్కడో పట్టనాల్లో సదివే ఇయ్యాల్టి కుర్రోళ్లు పల్లె మట్టి వాసన పసిగట్టలేక పోతున్నారు.

'నాకు అపుడు పన్నెండేళ్ల వయసు. కర్ణమొలు కొమరయ్య అంతే మనూరుతో పాటు సుట్టు పక్కల పెజానీకానికి మోతుబారి రైతు.

కర్ణం బాబు సెప్పిందే యాదం. ఆడదాని మీన మనసుపడితే... కొమరయ్య ముందు కొంగు

# రాతి మనుషులు

## మద్దిలి కేశవరావు



సాపాల్సిందే. ఆయన మాటకు ఎదిరెల్లినోడు తెల్లారేసరికి కామిటోడు సెరువులోన సెవమై తెలాల్సిందే. ఆ రోజుల్లో అలా వుండేది ఆయన పలుకుబడి. దసరాకు తొమ్మిది దినాలు ముందు వచ్చే పోలాల ఆమాసనాడు వూరు వూరంతా పిండి ముగ్గులు, ఏప కొమ్మలు, మామిడి తోరణాలతో గేమ దేవత అసిరి పోలమ్మ తల్లి రాకకోసం సందడి సేత్తున్నారు. పొలిమేర నుంచి వచ్చే అమ్మోరమ్మకు వూరికి దూరంగా.. తూరుపు కొసాన వున్న మాలీదిలోనే తొలిపూజ. వూరికి కాపలా కాసే బారికి కాముడు ఇంటోల్లే జన్ని పూజారికి పసుపు నీటితో కాలు కడగాలి. ఆ తర్వాతే వూరందరూ అమ్మోరు తల్లికి కాళ్లుకడగడం, పూజలు సెయ్యడం పూర్వం నుంచి వత్తున్న ఆచారం.

ఆ దినం రానే వచ్చింది. బారికి గురవడు సొన్నాయి పది కోసుల దూరం వరకు ఇనిపిత్తావుంటే... బారికి కాముడు పెద్ద తుడుమూ, బారికి ఎర్రిగాడు, మేకుడు పూజి కుండలను దమాయించి కొడుతున్నారు. అమ్మోరు ఇగ్రహం తలపై తులిసి కొమ్మల మధ్య వున్న పొకచెక్క ఎవరి సేతుల మీన పడితే ఆళ్లకు అదృష్టమం కలిసొస్తుందని మా వూరోల్ల నమ్మకం. అందుకే కర్ణం కొమరయ్య తో పాటు సేనా మంది గేమస్తులు అమ్మోరు ముందు సెయ్యి సాపినారు. ఏమీ సిత్రమో గానీ.. అమ్మోరు పోక దలాయి సొట్ట మిత్తయ్య సేతిలో పడింది. అప్పుడే కర్ణమొలి కొమరయ్య మొకము వాలిపోయింది. వూరంతా అమ్మోరు మీన అక్షింతలు నల్లి దండమొక్కినారు. జన్ని పూజారి అమ్మోరు జంగిడిని నెత్తిమీద పెట్టుకొని ఒక్క ఉదుటున మాలీది పొలిమేర సేరుకున్నాడు. అప్పటికే రౌలీది ఒంపులో ఆముదం కర్రలకు మట్టి సమురు, కొబ్బరి నూనెతో తయారు సేసిన అగ్గి దిమిటీలతో అమ్మోరుకు సోగతం పలికారు.

అప్పటికే బారికి కాముడు పెళ్లం అవు పేడతో సక్కగా అలికి ముగ్గులువేసి, ఆరతి పల్లెంతో అమ్మోరుకు ఎదురుగా నిలబడింది. తెల్లటి సీర, నుదుటన ఇరవై పైసాల బిల్లంత ఎర్రటి సిందూరం బొట్టు... ముఖానికి రాసుకున్న పసుపుతో బారికమ్మ అచ్చం అవ్మోరమ్మ తల్లిగానే మాకందరికీ అగుపిత్తుంది. నలబై ఏళ్లు కూడా దాటని బారికమ్మకు పిల్లలు లేరు. ఎప్పుడూ వూరమ్మోరునే కొలుత్తా వుంటాది. అందుకే వూరందరు బారికమ్మను సెల్లిగా పిలుస్తుంతారు. అమ్మోరుకు ఆరతి ఇచ్చిన బారికమ్మ కొబ్బరి బురికిలో నిండా ఎర్రటి అగ్గి నిప్పులు వేసి, అందులో గుగ్గిలంతో జన్నిపూజారికి దూపం వేసింది. అమ్మోరికి నైవేద్యంగా పాయసం పెసాదం పెట్టిందో లేదో....బారికి మేళం సప్పుడికి పూనకం వచ్చేసినాది. ఒంటిమీన బట్ట కానకుండా వూగిపోయినాది. మాలీదికి సెందిన ఆడోల్లు బారికమ్మను ఆపడానికి ఎంత పయత్నించినా వారి వల్ల సేతనవ్వలేదు. జన్ని పూజారి బారికమ్మ తలపై సెయ్యేసి,పసుపు బొట్టు పెట్టగానే తెలివి తప్పిపోయి కొమరయ్యపై వాలిపోయింది. అప్పటికే బారికమ్మ అంద సందాలు సూసి సొంగలు కారేసుకుంతున్న కొమరయ్య మీద పడటంతో ఇంకా కామంతో రగిలిపోయాడు. అమ్మోరు జంగిడి ముందుకు కదిలింది. కానీ కొమరయ్య మాత్రం మాలీది మూలనే మంగడితో వుండిపోయాడు. పాడుబుద్ది ఆలోనలతో కొమరయ్య ఉక్కిరిబిక్కిరైపోతున్నాడు. ఇతగాడు వాలకం సూసిన మంగడికి అర్ధమైపోయింది.

'అయ్యా... అమ్మోరు వూర్లోకి ఎల్లిపోతుంది.. పదండి ఎల్దా' మంగడు మెల్లగా అన్నాడు.

'ఒరేయ్ మంగా....'

'ఎంటి అయ్య గారూ...?!'

'ఆ బారికి కాముడు పెళ్లాం ఏంట్రా అంత బాగుంది. ఎప్పుడూ దూరం నుంచే సూసినొడ్ని... ఇయ్యాలేన్రా దగ్గరగా.. అబ్బో దానెమ్మ బారికిదాయి అయితేనేం సిలక సక్కగానే వుందిరోయ్' నవ్వుతూ కొమరయ్య మీసంపై సెయ్యేసి అన్నాడు.

'అయ్యా..మీబోటి వారికి తగదయ్యా... ఆలు బారికోలు...తక్కువ జాతికి సెందిన వారు... మీరు మహారాజులు ' అన్నాడు మంగడు.

'నూర్మియ్యోసే తొత్తి కొడకా...నానొదిలేసిన ఎంగిలి మెతుకులు తిన్నొడివి నాకే నీతి కబుర్లు సెప్తావా...?!' అంటూ కొమరయ్య కల్లెర్ర జేసినాడు.

మంగడికి అర్థమైపోయింది. వెంటనే సుట్ట ఎలిగించి కొమరయ్య నోట్లు పెట్టాడు. సిన్న వెకిలి నవ్వు నవ్వుతూ కొమరయ్య గుప్పు గుప్పుమంటూ సుట్ట పొగను బయటకు ఇడిసిపెడుతూ బారికి కామదు ఇంటిదుక్కు దారితీసినాడు.

మాలీది మూల తాటి కమ్మల గుడిసె బారికి కామదు ఇల్లు. మట్టి గోడలు... అరుగు వరకు కిందకు ఏలబడిన తాటికమ్మల పంచ. ఇంటి లోపల ఓ మూల గూటిలో మిసుకు మిసుకుమంటూ ఎలుగు తున్న మట్టి సమురు దీపం. మంగడ్ని పంచలోపే వుండమన్నట్టు సైగసేసి కొమరయ్య బారికమ్మ వున్న ఇంట్లో దూరాడు.

పుట్టెడు వుపాసంతో వున్న బారికమ్మ ఈత సాపమీన ఎల్లకిలా పడుకొనివుంది. పైట సెంగు వున్న జాగాలో లేకపోగా...సీర మోకాలి పిక్కలు వరకు ఎగిరిపోయి వుంది. మట్టి సమురు దీపం ఎలుతురులో బారికమ్మ అందాలు పిండారబోసిన ఎన్నిల్లా కొమరయ్యకు కనిపిచ్చింది. ఆగనేక పోయాడు... అమాంతంగా బారికమ్మ మీన పడి తన సేతులతో బలంగా తన ఒళ్లోకి లాగుకున్నడు.

'వుపాసంతో వున్నాను బావ.... ఎల్లి కాలు, సేతులు కడుక్కొని రా.. పాసిం తింతువు గానీ..' బారికమ్మ నిద్రమత్తులోనే వచ్చింది మొగుడే అనుకొని సేపుతోంది.

తన ఒళ్లు అంతా హూనం కావడంతో పాటు సుట్ట పొగ వాసన ఎక్కువగా వత్తుండటంతో నిద్రమత్తులోనే కళ్లు తెరిసి సూసింది బారికమ్మ.

తనపై ఎవరో బారీ మనిషి వున్నాడు. గట్టిగా అరవాలని సూసినా సాధ్యం కాలేదు.

కల్లతో 'వద్దు బాబు..' అని బతిమాలడినా కనికరించని కొమరయ్య కామపిశాసం ముందు తప్పించుకోవాలని సూసిన బారికమ్మకు సాధ్య పడనేదు.



తెల్లారింది... రాత్రి కురిసిన వర్సానికి బారికి కామదు మట్టిల్లు కూలిపోయిందని, వాటికిందే ఇద్దరు మొగుడూ, పెళ్లాలు వుండిపోయినారని వూరు వూరంతా గుప్పుమంది. మంగడికి ఏదో అనుమానం వొచ్చి కొమరయ్యతో ఆ మాటే కదిపాడు. కొమరయ్య సిన్నగా నవ్వుతూ....

ఇంతలో తుడుం కుండ పట్టుకొని బారికి కామదు ఇంటికి రావడం గమనించిన మంగడు మద్దిలోనే ఆపేసాడు.

'అదేటిరా మిత్తయ్యా....మా ఇంటి ముందు తచ్చాడుతున్నావు..?!' అనుమానంగా అడిగినాడు మంగడని కామదు.

'నీకోసం కలడానికి కర్ణం బాబు వచ్చద్రా....' మంగడు కటువుగా సెప్పాడు.

'నాకోసం ఎపుడూ లేనిదీ ఇయ్యాల కర్నం బాబు రవడమా...నాకేదో అనుమాన ఐతందిరా మిత్తయ్య....' ఆందోలన సెందినాడు కామయ్య.

ఒక్క ఉదిట్న గడపలోకి ఎల్లిన కామయ్యకు ఇంట్లో జరుగుతున్న తంతు సూసి ముచ్చెమటలు పట్టేసినాయి. ఏమీ సేయ్యాలో పాలుపోక తుడం కుండతో కర్ణం కొమరయ్య బుర్రమీద బలంగా బాదాడు. మట్టి కుండ కావడంతో పది బక్కలై పాయింది. కొమరయ్య బుర్ర నుంచి రక్తం జరజరా కారింది.

మంగడు ఎనకనుంచి వచ్చి కామదు పీకకు తువ్వాలు తగిలించాడు. అటు కర్ణం... ఇటు మంగడు పట్టుకు బారికి కామదు పేనం గాల్లో కలిసిపోయింది.

'అయ్యా.... కామదు పేనం పోయినట్టుంది...' అనుమానంగా అన్నాడు.

'ఈ ముండ పేనం కూడా ఎప్పుడో పోయిందిరా మంగా.. మోజు తీరకపోయి, శవంతో సరససమాడినాను...' అంటూ కొమరయ్య మూలన ఎలుగుతున్న మట్టి సమురు దీపానికి సుట్ట ముట్టిత్తూ ఎటకారంగ నవ్వాడు.

'ఈ సేవాల్ని ఏటి సేత్తం బాబు...?' మంగడి అనుమానంగా అడిగాడు కొమరయ్యను.

'ఏటి సెయ్యడము ఏంట్రా....తెల్లారేసరికి కాముటోడి సెరువులో సెవాలే కదా.... ముందు పదా...నన్ను ఇంటి దగ్గర దిగబెట్టి, తర్వాత నీ పని సూడు' అంటూ బయటకు వచ్చారో లేదో బయట మేగం దట్టంగా మారిపోయింది. ఎంటనే గాలోనతో వర్సం పేరంబమైంది. కరణం కొమరయ్య, మంగడు వాళ్ల ఇంటికి సేరుకునారు.

సెవాల్ని సెరువులో ఏసెందుకు కూడా సమయమియ్యకుండా ఎడతెరిపి లేకుండా వర్సం కురుత్తుంది. తెల్లారే సరికి ఏ కొంప మునుగు తుందొనని మంగడు ఆందోళన సెందుతున్నడు. కొమరయ్య మాత్రం తన ఇంట్లో కునుకుతీత్తున్నాడు.

తెల్లారింది... రాత్రి కురిసిన వర్సానికి బారికి కామదు మట్టిల్లు కూలిపోయిందని, వాటికిందే ఇద్దరు మొగుడూ, పెళ్లాలు వుండిపోయినారని వూరు వూరంతా గుప్పుమంది. మంగడికి ఏదో అనుమానం వొచ్చి కొమరయ్యతో ఆ మాటే కదిపాడు. కొమరయ్య సిన్నగా నవ్వుతూ....

'నిన్ను నమ్ముకుంతే నా పేనాలికే పెమాదమని ముందే గేహించి నా పని నాను సేసినాన్రా మంగా....' కొమరయ్య మాటలకు మంగడులో వున్న బయం తొలిగిపోయింది.

'సెవాలు తియ్యంద్రా... వూరోల్లు వంటలు సేసుకోవద్దా అని కరణం బాబు మీకు సెప్పమన్నాడు' అంటూ మంగడు తాటి కమ్మల గొడుగేసుకొని మాలీది బారికి గురవడికి, ఎర్రిగాడికి సెప్పుతున్నడు.

'సూత్తున్నవు కదా మంగ మిత్తయ్య.... సెవాలు ఎలాగ తీత్తాము..? వర్సం తగ్గదు... తగ్గినాక తీత్తాం. ఆ మాటే సెప్పు ఎల్లు..' అంటూ గురవడు బాధతో



సెప్పాడు.

'సరి సరే..మీ ఇట్టం..' అంటూ మంగడు అక్కడ నుంచి ఎల్లిపాయినాడు.

వర్సం ఏ మాత్రం తగ్గలేదు సరికదా... కాముటోడి సెరువుకు గండి పడింది. వరద నీరు వూర్లోకి వచ్చేసింది. అప్పుడే వునిసిన వరి తుబ్బులు మీదకు లేసిపోయినాయి. వరదకు మట్టిల్లు కూలిపోతుంటే... బయంతో సేనామంది పెజలు కార్జిగారింటి అరుగుమీనకు సేరుకున్నారు.

'తినడానికి తిండి గింజలు లేకుండా సేసింది పాడుముండ వర్సం' అంటూ సేనా మంది సేపనార్దలు పెడుతున్నారు. దయగల కార్జిగారు కాదనకుండా గడపలోకి వచ్చిన వారికి రెండు పూటలా తిండి పెడుతున్నారు. వూర్లోకి వచ్చిన అవ్మోరుకు ఐదు దినాలు అవుతోంది.. దూప,దీప,నైవేద్యాలు పెట్టే నాదుడే లేడు.

'మాకే తినడానికే తిండి లేదు...అమ్మోరుకు నైవేద్యం అంటే ఎట్టా...?!' అంతున్నారు కొంతమంది గేమ రైతులు. జన్ని పూజారి మాత్రం అమ్మోరును ఒదల్లేక కార్జిగారింటి నుంచే...ఏదో బెల్లమో, సీనో, మిఠాయో తెచ్చి పెసాదం పెడుతున్నాడు పాపం.

'అయ్యా... అయిదు దినాలైతుంది. బారికీదిలో సెవాలు మట్టి గోడలు కింద అలానే వున్నాయి. అవ్మోరుకు బోగమూ...రాగమూ లేకుండా పోయినాయి రెండు రోజులు ఇలానే వుంటే కొబ్బరి సెట్లు కూడా పడిపోయే అవకాసం వుందయ్యా... వూరు పెద్దలు అలోసించండి.' జన్నిపూజారి గేమ పెద్దలు ముందు తన ఆవేదన సెప్పాడు

'దీనికి మనం ఎవ్వరం ఏమీ సేత్తం జన్నీ... మన సేతిలో ఏముంది...?!' ఓ పెద్దమనిసి మాట ఇది.

'ఎక్కడో తప్పు జరిగిందయ్యా...లేకపోతే అమ్మోరుకు కోపం రాదు. అటు తాను తినక..ఇటు మనకి తిండి పెట్టక అమ్మోరు పరీక్షిస్తుంది' అన్నాడు జంకుతూ జన్ని పూజారి.

'నీ అలోసన ఏటో ముందు సెప్పు...తర్వాత అలోసిద్దాం..' అన్నాడు మరో గేమ పెద్ద.

'బాబూ ..నాను అమ్మోరుకు దండకం పొత్తా... సత్తిమైన అమ్మోరు అయితే సెబుతుంది..'

'ఏడిసినట్టు వుందోయ్య జన్నీ నీ యవ్వారం. పదండి... పదండి... ఈ జన్ని పూజారికి పనీ పాట లేనట్టుంది, అందర్నీ పోగేసి పుక్కిట పురాణం సెప్తున్నాడు.' అంటూ కర్ణం కొమరయ్య రుసరుసలాడుతూ అక్కడ నుంచి కదిలాడు.

కొంతమంది మాత్రం జన్నిపూజారి మాటకే మొగ్గు సూపినారు.

బయట ఉరుములు, మెరుపులతో వర్సం దంచి కొడుతుంది. నాయుడు ఇంట్లో జన్నిపూజారి అమ్మోరుకు దండకం పోత్తున్నాడు. అరుగుల మీన పెద్దలు కుర్సోని వుంటే...బయట తాటి కమ్మల గొడుగుల్లో పెజలు అవ్మోరు దండకాన్ని ఇంటున్నారు. ఉన్నట్టుండి నాయుడు గారి సిన్న కూతురు నాయురాలు పూనకంతో వూగిపోయింది.

'ఈ ఆపద నుంచి మా వూరును గట్టెక్కించా లమ్మా..' అంటూ పెజలంతా ఏడుకుంతున్నారు. మరికొంత మంది నాయరాలు మీద కుండలతో పసుపు నీరు పోత్తున్నారు.

జన్నిపూజారి నాయురాలు తలపై ఏప కొమ్మలు వుంచి సెప్పాలంటూ ఏడుకున్నాడు... పెజల్ని కాపాడాలంటూ పేర్దించాడు.

నాయురాలమ్మ గట్టిగా ఏడుత్తా 'నన్ను నమ్ముకున్న పేనం పోయింది... నాకు తొలిపూజ సేసే బారికమ్మ, నన్ను ఆడించే బారికి కాముడు లేకుండా పోయారు...'

అంటూ అమ్మోరమ్మ పలుకులు వినిపిస్తుంది.

'అమ్మా....ఆ పేనాలు నువ్వే తీసేసినావు. మట్టిల్లు కూలిపోయి ఆల్లు సచ్చిపాయినారు. అయిదు దినాలైనా సెవాలు అలానే వున్నయమ్మా..' అంటూ జన్నిపూజారి ఇంకేదో అడుగుతుండగా నాయురాలు వారించింది.

'ఆ దంపతులు సచ్చిపోలేదురా... సంపేసారు... బలవంతంగా సంపేసారు...' అంటూ నాయురాలు సెప్పడంతో వూరంతా విస్తుపోయినారు... 'ఎంత గోరం జరిగిపోయింది.... ఎవరా పాపిస్టులు..' అంటూ గుసగుసలాడుకున్నారు అక్కడున్నవారు.

వారి పేర్లు సెప్పాలంటూ అవ్మోరమ్మను వేడుకున్నారు మరీ కొందరు.

జరిగిన విసయాన్ని అమ్మోరు నాయురాలు మాటలతో పూసగుచ్చినట్లు సెప్పడంతో... వూరు వూరంతా మండిపడ్డారు.

అక్కడే నక్కి అంతా వింటున్న మంగడు పరుగు పరుగున కొమరయ్య ఇంటికి చేరాడు.

ఇక్కడ మాత్రం సిన్న, పెద్ద అన్న తేడా నేకుండా పెజలంతా పరుగు అందుకొని కొమరయ్య ఇంటికి సేరుకున్నారు. కొమరయ్య ఇల్లు గుల్ల సేసినారు.

దొరికినకాడికి బియ్యం, డబ్బు, దనం దోసుకున్నారు.

కొమరయ్య, మంగడు గురించి వెతికారు. ఎవరో సెప్పారు కోమటి సెరువులో రెండు సెవాలు తేలిపోయి వున్నాయని.

వూరంతా జోరు వానలో అక్కడకు సేరుకున్నారు. నిజం తెలవడంతో సెరువులో పడి సచ్చిపోయినారని అనుకున్నారు. పీడ విరగడైందని పొంగిపోయినారు వూరందరూ.

నాయురాలమ్మ పూనకంలో ఇంకేదో సెపుతుందీ...

'మట్టి గోడలు కింద వున్న బారికమ్మ, బారికి కాముడు సెవాలు తీసి వూరు పొలిమేరలో పాన్పు సెయ్యాలని, పాన్పుమీద బారికమ్మ , బారికి కాముడు రాతి ఇగ్రహాలు పతిష్టించి పూజలు సెయ్యాలని, నాకు పూజించే ముందు తొలి పూజ బారికి కామడికి, బారికమ్మలకు దక్కితే మీ వూరు, వాడని కాపాడుతాను...' అంటూ నాయురాలమ్మా పడిపోయింది.

వూరందరూ వరసంలోనే మాలీదికి ఎల్లి కూలిపోయిన మట్టి గోడలు తొలగించినారు. అయిదు దినాలైనా సజీవంగానే సెవాలు వుండటంతో వూరంతా బోరున విలపించారు. ఎడ్లు బండిపై సెవాలు వుంచి వూరేగింపుగా గ్రేమ పొలిమేరలో పాన్పుసేసి, బారికి మేళంతో పాన్పుపై రాతి బొమ్మలు పతిష్టించారు. అంతే... అమాంతంగా వర్సం తగ్గిపోయింది. పెజలంతా సంబరాలు సేసుకున్నారు.

'ఇక అపుడు నుంచీ వూరందరూ వూరమ్మోరు గుడికి ఏళ్లే ముందు బారికమ్మ, బారికి కాముడు రాతి ఇగ్రహాలకు పూజించే ఎళ్తారు. అంతే కాదురా మనవడా... పొలాలకు గానీ, కొబ్బరి తోటలకు అటువైపుగా ఎళ్తే... బారికి తాత విగ్రహాలకు దండం పెట్టుకొని వెల్లే అలవాటు వూరందరికీ ఉంది. ఇక పదరా... అమ్మోరు వూరికి రావడానికి సమయం ఆసన్నమైంది...' అన్నాడు తాతయ్య. వూరు, విగ్రహాల సెరిత్రను తెలుసుకున్న మనవడు బారికి తాత రాతి విగ్రహాలకు దండం పెట్టడు.

గ్రామ దేవత ఆలయానికి తాతయ్యను తీసుకొని అక్కడ నుంచి బయలుదేరాడు మనుమడు. ★

'తినడానికి తిండి గింజలు లేకుండా సేసింది పాడుముండ వర్సం' అంటూ సేనా మంది సేపనార్దలు పెడుతున్నారు. దయగల కార్జిగారు కాదనకుండా గడపలోకి వచ్చిన వారికి రెండు పూటలా తిండి పెడుతున్నారు. వూర్లోకి వచ్చిన అమ్మోరుకు ఐదు దినాలు అవుతోంది.. దూప,దీప,నైవేద్యాలు పెట్టే నాదుడే లేడు. 'మాకే తినడానికే తిండి లేదు...అమ్మోరుకు నైవేద్యం అంటే ఎట్టా...?!' అంతున్నారు కొంతమంది గేమ రైతులు. జన్ని పూజారి మాత్రం అమ్మోరును ఒదల్లేక కార్జిగారింటి నుంచే...ఏదో బెల్లమో, సీనో, మిఠాయో తెచ్చి పెసాదం పెడుతున్నాడు పాపం.




జయసూర్య

# ‘కాశావజ్ఝల’వారి శ్రీ కాశీక్షేత్ర అద్భుత సందర్శన గ్రంథం

శతాబ్దాలుగా విధ్వంసకారుల ఆగడాలు, కలికాల మానవుల స్వార్థపూరిత చర్యల కారణంగా ఆలయాలు, కొన్ని దేవతామూర్తులు పూర్వ రూపాలను కోల్పోయినా, ఆ స్థానాల అత్యంత పవిత్రతపై అవిచ్ఛిన్నంగా వైశ్విక చైతన్య ప్రసారం కొనసాగుతూ, దైవీశక్తి కేంద్రీకృతమై విరాజిల్లుతూనే ఉంటుందని ‘శ్రీకాశీక్షేత్ర సందర్శనము’ ఉద్గ్రంథంలో రచయిత ‘కాశావజ్ఝల వేంకట నరసింహమూర్తి’ పేర్కొన్నారు. సర్వదేవీ దేవతలు కొలువై ఉన్న ఈ మహాక్షేత్రాన్ని ప్రాచీన మహర్షులు, వైశ్విక చైతన్య ప్రసార ప్రణాళికాబద్ధంగా అనుగ్రహించారని వివరించారు. కాశీలో వున్న ఆదిత్యులు, గణపతులు, లింగాలు తదితర దేవీ దేవతల దివ్యాలయాల గురించి అమెరికా కాలిఫోర్నియాలోని కొలరాడో విశ్వవిద్యాలయ ఆచార్యుడు, ఖగోళశాస్త్రవేత్త జాన్.ఎమ్.మెల్‌విల్లే, బనారస్ హిందూ విశ్వ విద్యాలయ ఆచార్యులు రాణా పి.బి.సింగ్, ఈ క్షేత్రంలోని వైశ్విక చైతన్యశక్తి (కాస్‌మోస్)పై పరిశోధనలు సత్ఫలితాలు యిచ్చాయని గ్రంథకర్త వివరించారు. ఇక్కడ సూర్యాలయాలు 12+2 వైశ్విక చైతన్యశక్తి ప్రసారానుగుణంగా విశేష క్రమపద్ధతిలో మహర్షుల అతీంద్రియ జ్ఞానంతో స్థాపితమైనట్లు గ్రంథ రచయిత ప్రస్తుతించారు.

ఇంతేకాకుండా పాశ్చాత్య శాస్త్రజ్ఞుల ‘కాస్మిక్ జియోమెట్రికల్ విధానం’ ప్రకారం కాశీక్షేత్రం, సప్త ఆవరణలతో యంత్రంలా వుందని, ఒక్కొక్క ఆవరణలో ఎనిమిది చొప్పున 7 వరుసలుగా 56 గణపతి ఆలయాలు ఒక క్రమపద్ధతిలో వైశ్విక చైతన్యశక్తి ప్రసారానుగుణంగా ఉన్నాయని నిరూపితమైనట్టు ఉదహరించారు. 270 పేజీలు పైగా వున్న ఈ గ్రంథంలో రచయిత ‘కాశావజ్ఝల’ తెలుగు యాత్రికుల, చదువరులకు మరింత సులభ గ్రాహ్యంగా సంబంధిత ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పటాలు, చిత్రాలు (మ్యాప్స్) శాస్త్రీయ పరిశోధనాత్మక విషయ వివరణ, రేఖా కల్పనలు, ఛాయాచిత్రాలతో అద్భుతంగా రూపొందించారు. తెలుగు ఆస్తిక పాఠకులను దృష్టిలో ఉంచుకొని సాధ్యమైనంత సమగ్రంగా, కాశీ క్షేత్ర యాత్రా




**శ్రీకాశీక్షేత్ర సందర్శనము**
**కాశావజ్ఝల వేంక నరసింహమూర్తి**
**ప్రతులకు : కాశావజ్ఝల సువర్చల, ప్లాట్‌నెం. 39, ఎల్.బి.నగర్, హైదరాబాద్-500074**
**మొబైల్: 9440327895, 9989836240**
**వెల: రూ.300/-. పే.: 294.**

పరిక్రమణలకు సంబంధించి, దేవీదేవతల మందిరాల ఉనికి, వైశ్విక చైతన్య పటాలు, వివరణలను తెలుగులో పొందుపరచడానికి ఎందరో శిలాశాసన, తాళపత్ర, తామ్రపత్రాదుల పరిష్కర్తలు, పరిశోధకులు, తర్జుమాదారులు ప్రత్యక్షంగా, పరోక్షంగా, గ్రంథకర్తకు తోడ్పాటు అందించిన కారణంగా ఈ శ్రీకాశీక్షేత్ర సందర్శన గ్రంథం ఆస్తిక జనావళికి కొంగు బంగారంగా అందుతోంది.

జన్మరాహిత్యం, మోక్షప్రాప్తి అభిలషించే ఆస్తికులు భక్తి శ్రద్ధలతో అధ్యయనంచేసి తదనుగుణంగా జీవితాన్ని గడపవలసినదిగా గ్రంథకర్త సందేశాత్మకంగా వివరిస్తారు. భౌతికంగా యాత్రికులు దర్శిస్తున్న కాశీ లేశ మాత్రమేనని, కొన్ని చూడటం కష్టం కాగా, ఎన్నోవాటిని చూడటం సాధ్యం కాదని ఈ గ్రంథం స్పష్టం చేస్తోంది. కాశీయాత్ర సార్థకం కావాలంటే కేవలం స్నానాలు, పూజలు, అభిషేకాలు, దర్శనాలు, కామ్యకర్మలు సరిపోవని, ఇవన్నీ కేవలం చిత్తశుద్ధి మాత్రమే కలిగిస్తాయని, అలౌకిక జ్యోతిర్మండలమైన ఈ క్షేత్రాన్ని భౌతిక దృష్టిని అధిగమించిన మహాచైతన్యంగా జ్ఞానదృష్టితో అవలోకించే దివ్యాంశాలను ఈ గ్రంథంలో పొందుపరిచారు.

సంస్కృతంలోని వ్యాస మహర్షి విరచిత స్కాందపురాణ కాశీఖండం, తీర్థ చింతామణి, తీర్థ ప్రకాశః వంటి గ్రంథాలు, తెలుగు, ఆంగ్లంలోని ఎన్నో ఆధ్యాత్మిక మహాత్మ్య, సైన్స్ పరిశోధనా జర్నల్స్‌ను పరిశీలించిన జ్ఞానసేకరణ ఈ గ్రంథంలో చోటు చేసుకుంది. కాశీ నగరంలో యమదూతలకు బదులు శివదూతలుంటారని, ఇక్కడ ప్రాణత్యాగం చేసినవాళ్లను నియమించేది సాక్షాత్తు పరమశివుడని, ఇక్కడి పాపులను దండించేది కాలభైరవుడని, ఇది మోక్ష క్షేత్రమని, మోక్షం జ్ఞానం చేత లభిస్తుందని, చిత్తశుద్ధి పొంది విశ్వేశ్వరానుగ్రహంతో ప్రాణోత్క్రమణ సమయంలో కుడిచెవి ద్వారా తారక బ్రహ్మోపదేశాన్ని పొంది జనరావృత్తి రహిత శాశ్వత కైవల్యాన్ని పొందుతారని ప్రస్తావనలో వివరించారు. ఈ గ్రంథంలోని తొలి 79 పుటలలో నామ విచారం, దివ్యస్వరూపం, వృత్తాంతాలు, కథనాలు, మహిమలు, ప్రశంసలు, వైశిష్ట్యాలు, ఉపసంహారం ఉన్నాయి. తరువాత 38 అధ్యాయాలలో అనుబంధ అంశాలుగా దేవతాశక్తులు, దర్శనీయ యాత్రాస్థలాలు, 84 గంగా స్నానఘట్టాలు, చరిత్రలోని సంఘటనలు, శ్రీకాశీ విశ్వనాథ కారిడార్ (నడవా) తదితర ఎన్నో..ఆధ్యాత్మిక జిజ్ఞా సువులకు ఆసక్తికర విశేషాలు చదువరులకు విస్మయం కలిగిస్తాయి. దేవతలు, దివ్యతీర్థాలు, ప్రదేశాలు అకారాది అక్షర క్రమంలో 1076 వరుస సంఖ్యలుగా విశేష శ్రద్ధతో సంపుటీకరించారు.

ఈ గ్రంథ ముగింపులో, చరిత్రకారుల అభిప్రాయానుసారంగా క్రీ.పూ.శతాబ్దాల కాలగర్భంలో క్షేత్ర ఉజ్వల, విధ్వంస, పునర్నిర్మాణ చారిత్రక సంఘటనల కాల వివరణలతో పాటు 2021 డిసెంబరు 13న భారత ప్రధాని నరేంద్రమోదీచే విశ్వనాథ కారిడర్ ప్రారంభం, క్షేత్ర ప్రాంగణంలోని ఆలయాలన్నీ ఆక్రమణల నుండి విముక్తి పొందే భవిష్యత్ పునరుద్ధరణ, వర్తమాన విశేషాంశాలు సంక్షిప్తంగా పొందుపరిచారు.

శ్రీకాశీ క్షేత్రానికి సంబంధించి ఇంత అరుదైన, అపురూపమైన, అత్యద్భుత లౌకిక, అలౌకిక వివిధ దృక్కోణాలు సమగ్రంగా, సంపూర్ణంగా రూపొందించిన ‘కాశావజ్ఝలవారు’ తెలుగు జనావళికి అందించిన తపో సంబంధిత రచనా మహత్కార్య కార్యాచరణకు, సహకరించిన భమిడిపల్లి సోదరులు, బి.ఎన్.శర్మ, బ్రిం (బి.ఎన్.మూర్తి) బి.ఎన్.శాస్త్రి యితర ప్రముఖులంతా అభినందనీయులు. ★




అరుణ

చిన్న చిత్రాలకు ప్రేక్షకాదరణ ఉండదనేది ప్రతి ఒక్కరూ చెప్పే మాట. అదే సమయంలో కంటెంట్ ప్రధానంగా సినిమా తీసి, పక్కా ప్రణాళికతో విడుదల చేస్తే చిన్న సినిమాలు సైతం విజయవంత మవుతున్నాయి. అయితే ఇక్కడో చిన్న మెలిక ఉంది. చిన్న సినిమాలను చిన్న లేదా కొత్త నిర్మాతలు తీసినప్పుడు వాటిని థియేటర్లలో విడుదల చేయడం, ప్రేక్షకులకు ఆ సినిమా గురించి తెలిసి ఆదరించే వరకూ హోల్డ్ చేయడం అనేది కష్టమౌతోంది. దాంతో బాగున్నాయని పేరొచ్చిన చిన్న సినిమాలు సైతం పరాజయం పాలవుతున్నాయి. అలా కాకుండా కాస్తంత పేరున్న సంస్థ, చక్కని కథాంశంతో చిన్న సినిమాలను తీస్తే ఎలా ఉంటుందనే దానికి ఉదాహరణ తాజాగా వచ్చిన 'బలగం' చిత్రం.



# పక్కా ప్రణాళికతో విజయపథంలో బలగం

ఈ మధ్యకాలంలో తెలంగాణ నేపథ్యంలో పలు చిత్రాలు వస్తున్నాయి. అయితే అందులో కంటెంట్, క్వాలిటీతో పాటు అందరినీ ఆకట్టుకునే అంశాలున్న సినిమాలే ప్రేక్షకాదరణ పొందు తున్నాయి. భావోద్వేగాలకు, వినోదానికి పెద్దపీట వేసిన సినిమాలను ప్రాంతాలకు అతీతంగా ప్రేక్షకులు ఆదరించి, పట్టం కడుతున్నారు. విశేషం ఏమంటే.. 'బలగం'లో ఈ రెండు అంశాలను మిళితం చేసి దర్శకుడు వేణు తెరకెక్కించాడు. కథ విషయానికి వస్తే ఇది సిరిసిల్లలో జరిగే స్టోరీ. ఊరిలోని అందరితో కొమరయ్య (సుధాకర్ రెడ్డి) కలివిడిగా ఉంటాడు. అతని మనవడు సాయిలు (ప్రియదర్శి) మాత్రం కాస్తంత తేడా మనిషి. అయినకాడికి అప్పులు చేసి నెత్తి మీదకు తిప్పలు తెచ్చుకుంటాడు. అతని వివాహ నిశ్చితార్థం రోజున కాబోయే మావగారు కట్నం డబ్బులిస్తే దానితో అప్పు తీర్చవచ్చని భావిస్తాడు. ఇంతలో అనుకోకుండా తాతయ్య చనిపోతాడు. అక్కడి నుండే అసలు కథ మొదలవుతుంది. సాయిలు పెళ్లి రద్దు అవుతుంది. అయితే... తాతయ్య చావు సందర్భంగా పరామర్శించడానికి వచ్చిన అత్త కూతురు సంధ్య (కావ్య కల్యాణ్‌రామ్)తో అతను ప్రేమలో పడతాడు. దానికి కూడా కారణం మావయ్య ఆస్తి పరుడు కావడమే. కొమరయ్య చావు కారణంగా రకరకాల మనస్పర్థలతో దూరంగా ఉన్న అయిన వాళ్లంతా ఇంటికి వస్తారు. కొమరయ్య కర్మకాండలు మొదలెడతారు. అయితే పిండాన్ని మాత్రం కాకులు ముట్టవు. మూడో రోజు, ఐదో రోజు కూడా అదే తంతు. ఇంతలో ఊరిలోని కొందరు చనిపోవడం మొదలవుతుంది. కొమరయ్య ఆత్మకు శాంతి చేకూరకే ఇలా జరుగుతోందని జనం భావిస్తారు. కొమరయ్య పిండాన్ని కాకులు ముట్టడానికి బంధువులంతా కలిసి ఏం చేశారు? ఊరివాళ్ల అనుమానం ఎలా నివృత్తి అయ్యింది? స్వార్థపరుడైన సాయిలు తన తప్పును ఎలా తెలుసుకున్నాడన్నదే మిగతా కథ.

ఇది తెలంగాణ నేపథ్యంలో తీసిన సినిమానే అయినా... ఇందులో భావోద్వేగాలతో ప్రతి ఒక్కరూ కనెక్ట్ అవుతారు. ప్రాంతాన్ని బట్టి ఆచార వ్యవహారాలలో తేడా ఉంచొచ్చు కానీ పెళ్లిళ్లు, చావుల్లో బంధువులు, చుట్టుపక్కల వ్యక్తుల ప్రవర్తన ఒకే తీరుగా ఉంటుంది. అందువల్ల ఈ సినిమాలోని ప్రతి పాత్రనూ చూసే ప్రేక్షకులు తమకు తెలిసినవాళ్లతో, తమ బంధువులతో పోల్చుకుంటారు. అయితే కొన్ని చోట్ల ఫ్యామిలీ డ్రామా శ్రుతిమించింది. అలానే కామెడీ సీన్స్‌ను కూడా బలవంతంగా పెట్టినట్టుగా అనిపిస్తుంది. ఈ చిత్రానికి ప్రధాన బలం నటీనటుల సహజ నటన. 'మల్లేశం' సినిమాతో ప్రేక్షకుల మనసు గెలుచుకున్న ప్రియదర్శి మరోసారి తన నటనతో ఆకట్టుకున్నాడు. బాలనటిగా చక్కని పేరు తెచ్చుకుని, ఇటీవల విడుదలైన 'మసూద'లోనూ కీలక పాత్ర పోషించిన కావ్యా కల్యాణ్ రామ్ సైతం మెప్పించింది. ఇక సుధాకర్ రెడ్డి కొమరయ్య పాత్రలో చక్కగా ఒదిగిపోయాడు. ఇతర ప్రధాన పాత్రలు పోషించిన మురళీధర్ గౌడ్, రూపలక్ష్మి, జయరాం, విజయలక్ష్మి, వేణు టిల్లు తదితరులంతా బాగా నటించారు. ఆచార్య వేణు సినిమాటోగ్రఫీ, భీమ్స్ సెసిరోలియో సంగీతం మూవీని మరో స్థాయికి తీసుకెళ్లాయి. కమెడియన్ యెల్దండి వేణులో చక్కని దర్శకుడు కూడా ఉన్నాడని ఈ సినిమా నిరూపించింది. విశేషం ఏమంటే దిల్ రాజు కుమార్తె హన్షిత, అన్న కొడుకు హర్షిత్ రెడ్డి తొలియత్నంగా ఓ చక్కని కథతో నిర్మించిన ఈ సినిమా వాళ్లకు మంచి పేరూ తెచ్చిపెట్టింది. దాంతో 'దిల్' రాజు ప్రొడక్షన్స్ బ్యానర్ మీద ఇక మీదట కూడా అర్థవంతమైన చిత్రాలు వస్తాయనే నమ్మకం ప్రేక్షకులకు కలిగించారు. పరిమితమైన బడ్జెట్‌లో తీయడం, దానికి దిల్ రాజు దన్నుగా నిలబడటంతో 'బలగం' విజయపథంలో సాగుతోంది. ఇదే సినిమాను కొత్త లేదా చిన్న నిర్మాతలు తీస్తే ఈ స్థాయి విజయం సాధిస్తుందా? అన్నది సందేహమే!

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్



# తాండూరులో స్వర్ణామృతప్రాశనం







**తాండూరు:** ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ జినగుర్తి వారి అధ్వర్యంలో మార్చి 4న స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో స్వర్ణామృతప్రాశనం కార్యక్రమం జరిగింది. ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ రవీందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా, తాండూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కట్కం వీరేందర్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు రొంపల్లి సంతోశ్‌కుమార్, రాజస్థాన్ మహిళా మండలి తాండూరు శాఖ అధ్యక్షురాలు పద్మ సోని, తాండూరు మార్వాడి యువ మంచ్ అధ్యక్షులు బ్రిజ్ మోహన, తాండూరు గూడ్స్ ట్రాన్సుపోర్టు అధ్యక్షులు గోపాల్‌కృష్ణ బగ్రే, తాండూరు ప్రదీప్‌స్టోన్స్ అధిపతి కె.నాగేశ్వరరావు, ఆర్ఎస్ఎస్ ప్రాంత సహసంఘచాలక్ బి.సుందర్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తాండూరు నియోజకవర్గంనుండి వచ్చిన 589 మంది బాలురు బాలికలు 6 మాసాల పసిపిల్లలనుండి 16 సంవత్సరం వరకూ స్వర్ణామృతప్రాశనం చుక్కలు తీసుకున్నారు. తాండూరు సరస్వతి శిశుమందిర్ నుండి 98 మంది, తాండూరు కన్యా పాఠశాలనుండి సంఖ్య 57 మంది, ఇతరత్రా 374మంది పిల్లలు హాజరయ్యారు. జినగుర్తి ఏకలవ్య అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల నుండి 60 మంది పాల్గొన్నారు.

# కామారెడ్డి శిశుమందిర్ 39వ వార్షికోత్సవం

**కామారెడ్డి :** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సరస్వతీ విద్యామందిర్ ఉన్నత పాఠశాల 39వ వార్షికోత్సవం ఇటీవల ఘనంగా జరిగింది. శ్రీ సరస్వతీ విద్యాపీఠం స్వర్ణోత్సవాలలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ వ్యాపారవేత్త తిమ్మయ్యగారి సుభాశ్‌రెడ్డి, విశిష్ట అతిథులుగా సినీ గాయకుడు అనురాగ్ కులకర్ణి, ప్రముఖ శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి, వక్తగా సామాజిక సమరసత వేదిక తెలంగాణ కన్వీనర్ అప్పాల ప్రసాద్, కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ పాల్గొన్నారు. పాఠశాల వార్షికోత్సవంలో భాగంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమంలో సరస్వతీ విద్యాపీఠం పూర్వ విద్యార్థి పరిషత్ అధ్యక్షులు హరిస్మరణరెడ్డి, పాఠశాల అధ్యక్షులు డాక్టర్ శ్యాంసుందర్, ఉపాధ్యక్షులు అశోక్‌రావు, కార్యదర్శి అర్కల మల్లేష్ యాదవ్, ప్రతాప్ గౌడ్ , రంజిత్ మోహన్,



జిల్లా సంఘచాలక్ బొడ్డు శంకర్, కమిటీ సభ్యులు గీరెడ్డి రాజిరెడ్డి, ప్రబంధ కారిణి పాఠశాల ప్రిన్సిపల్ నాగభూషణం, అకడమిక్ ప్రిన్సిపల్ నగేష్ ఆచార్య బృందం, విద్యార్థినీ, విద్యార్థులు పోషకులు అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు





# విజయవంతంగా భైంసా పథ సంచలన్

**భైంసా :** ఆర్‌ఎస్‌ఎస్ భైంసా నగర పథసంచలన్ శారీరకోత్సవం మార్చి 5, 2023న జరిగింది. మొదట ఫిబ్రవరి 19వ తేదీన ఈ కార్యక్రమం జరపాలని నిర్వాహకులు అనుకున్నప్పటికీ కలెక్టర్ అనుమతి నిరాకరించారు. దీనితో పెద్దలు








హైకోర్టును ఆశ్రయించగా మార్చి 5వ తేదీన జరుపుకోవడానికి షరతులతో కూడిన అనుమతి లభించింది. హైకోర్టు అనుమతించిన తర్వాత కూడా స్థలం ఎంపికలో, పథ సంచలన్ నిర్వహణలో ప్రభుత్వ యంత్రాంగం నీరు గార్చే ప్రయత్నం చేసింది. అయినప్పటికీ హిందూ బంధువుల సపకారంతో రెట్టింపు ఉత్సాహంతో జరిగింది. ఈ కార్యక్రమంలో 978 మంది గణవేషధారి స్వయంసేవకులు పాల్గొని పురవీధులలో పథ సంచలన్ చేశారు. కార్యక్రమం జరుగుతున్నంత సేపు హిందూ బంధువులనుండి అపూర్వ స్వాగతం లభించింది. పురప్రముఖులు, మహిళలు మొత్తం 1928 మంది హిందూ బంధువులు పాల్గొని విజయవంతం చేశారు. పథ సంచలన్ అనంతరం సుభద్ర నిలయ (శ్రీ సరస్వతీ శిశుమందిర్) ప్రాంగణంలో స్వయంసేవకులు చేసిన శారీరక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. చివర జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డాక్టర్ గాదె మహేశ్, ముఖ్య వక్తగా ఇతిహాస సంకలనసమితి భాగ్యనగర్ సంభాగ్ ప్రధాన కార్యదర్శి ఇందుశేఖర్ పాల్గొన్నారు.

# జగిత్యాలలో శారీరకోత్సవం



**జగిత్యాల :** ఆర్‌ఎస్‌ఎస్ జగిత్యాల నగర శాఖ ఆధ్వర్యంలో మార్చి 5న పథ సంచలన్ శారీరిక్ ఉత్సవం జరిగింది. కార్యక్రమానికి ప్రధాన వక్తగా తెలంగాణ ప్రాంత సహ బౌద్ధిక్ ప్రముఖ్ శివకుమార్ హాజరయ్యారు. జిల్లా సంఘచాలక్ డాక్టర్ భీమనాతిని శంకర్, సహ సంఘచాలక్ డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి, నగర సంఘచాలక్ పురుషోత్తం కూడా పాల్గొన్నారు. స్వయంసేవకులు శారీరిక్ ప్రదర్శనలు చేశారు. మొత్తం 426 మంది పాల్గొన్నారు. అందులో గణవేశ్‌ధారి స్వయం సేవకులు 216, మహిళలు 27, బాలబాలికలు 62, పురుషులు 121.





## తెలుసుకుందాం

# లక్ష్మీనరసింహస్వామి-ఉండ్రుగొండ



తెలంగాణలోని సూర్యాపేట జిల్లా, చివ్వెంల మండలం, ఉండ్రుగొండ గ్రామంలోని కొండలపై ఈ ఆలయం వెలిసింది. ఈ ప్రాంతాన్ని గిరిదుర్గం అని పిలుస్తారు. ఇది శయన నరసింహస్వామి ఆకారాన్ని పోలి ఉంటుంది. ఈ ఆలయాన్ని విష్ణుకుండినులు నిర్మించారు. భాగవతంలోని గజేంద్ర మోక్షఘట్టాన్ని వర్ణించే చిత్రాలు, బొమ్మలు ఇక్కడ కనిపిస్తాయి. ప్రతి నెల స్వాతి నక్షత్రం రోజున స్వామివారికి విశేష అభిషేకం నిర్వహిస్తారు. హనుమాన్ జయంతి సందర్భంగా క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి పంచామృత అభిషేకం నిర్వహిస్తారు.

## కథ

# పరీక్ష



ఒక భూస్వామి దగ్గర వీరయ్య అనే వ్యక్తి తోటమాలిగా ఉండేవాడు.

అతనికి వయసుపైబడుతున్న కారణంగా ఒంట్లో ఓపిక తగ్గిపోయింది. కాబట్టి ఇంటి వద్దనే ఉండి విశ్రాంతి తీసుకోవాలనుకున్నాడు. ఇదే విషయం తన యజమానికి చెప్పాడు.

భూస్వామి అందుకు సరే అని 'నీలాగే కష్టించి పనిచేసే, చురుకైన వ్యక్తి ఎవరైనా ఉంటే చూడ'మని వీరయ్యతో చెప్పాడు.

ఈ సంగతి తెలిసి ముగ్గురు వ్యక్తులు వచ్చారు. ఆ సమయంలో వీధి వాకిలి దగ్గర వీరయ్య భూస్వామితో ఏదో మాట్లాడుతున్నాడు.

వీరయ్య ఆ ముగ్గురితో 'మీలో ఎవరో ఒకరు, వీధి వాకిలికి ఎదురుగా ఉన్న ఈ బండరాయిని తీసి దూరంగా పారేయండి' అని చెప్పాడు.

వచ్చినవాళ్లలో ఇద్దరు, ఆ రాయికేసి చూసి 'ఇంత పెద్దరాయిని కదిలించాలంటే ఎంత శ్రమ! ఇది మా వల్ల కాదు' అని వెళ్లిపోయారు.

మూడవవాడు మాత్రం వీరయ్యతో 'బండరాయిని ఇక్కడిని నుంచి

## పద్యము

**అవయవహీనుని సౌంద**
**ర్యవిహీను దరిద్రుని విద్య రానియతని సం**
**స్తవనీయు, దేవశృతులన్**
**భువి నిందింప దగదండ్రు బుధులు కుమారా!**

**భావం :** ఓ కుమారా! వికలాంగుని, కురూపిగా ఉండువానిని, ధనము లేని దరిద్రుడిని, విద్యరాని వానిని, గొప్పగుణములు గల సన్మార్గుని, భగవంతుని, పవిత్ర గ్రంథములను నిందింపరాదు.

## సూక్తిరత్నం

**విద్యా సమం**
**నాస్తి శరీర భూషణమ్'**
**'మాతాసమం నాస్తి శరీర పోషణమ్**
**చింతాసమం నాస్తి శరీర శోషణమ్**
**భార్యా సమం నాస్తి శరీర తోషణమ్**
**విద్యా సమం నాస్తి శరీర భూషణమ్'**

**భావం :** తల్లిలా శరీరాన్ని పోషించేవారు లేరు. శరీరాన్ని శుష్కింపచేయడంలో చింతకు మించినది లేదు. శరీరానికి సుఖసంతుష్టులను ఇవ్వడంలో భార్యకు సాటి ఎవరూ లేరు. శరీరానికి విద్యను మించిన ఆభరణంలేదు.

## జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| ఉత్తమం | రుణాత్మక |
| ఎత్తు | విమర్శ |
| ధనాత్మక | అధమం |
| ప్రత్యక్షం | పల్లం |
| పొగడ్త | పరోక్షం |

సమాధానాలు : ఉత్తమం-అధమం; ఎత్తు-పల్లం; ధనాత్మక-రుణాత్మక; ప్రత్యక్షం-పరోక్షం; పొగడ్త-విమర్శ.

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### చౌధరి బ్రహ్మప్రకాశ్ యాదవ్

**(1918-1993)**



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు. ఢిల్లీ మొదటి ముఖ్యమంత్రి. ఈయనను షేర్-ఎ-ఢిల్లీ అని కూడా పిలుస్తారు. 1940లో మహాత్మా గాంధీ ప్రారంభించిన వ్యక్తి సత్యాగ్రహోద్యమంలో ముఖ్యపాత్ర పోషించారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని అరెస్టయ్యారు. స్వాతంత్ర్యానంతరం ఈయన ప్రణాళికాభివృద్ధి శాఖ మంత్రిగా కూడా పనిచేశారు.



కదిలించి వీధివారగా నెట్టేస్తాను. ఒక గునపం ఇప్పించండి' అని రాయికేసి చూస్తూ 'అసలిది వీధి వాకిలి ముందుకు ఎలా వచ్చింది!' అంటూ కాలితో తన్ని చూశాడు.

బండరాయి అడుగు దూరం జరిగిపోయింది. అది నిజంగా బండరాయి కాదు. ఎండుగడ్డిని గోతాంలో పెట్టి మూతి బిగించి, రాయిలా కనబడేందుకు వీరయ్య దానికి మట్టి పూలిమాడు.

వీరయ్య యజమానితో 'ఇతనిలో కష్టించి పనిచేసే లక్షణంతో పాటు, మంచి చురుకుతనం కూడా ఉన్నది. మీకు తోటమాలిగా పనికి వస్తాడు' అని చెప్పాడు.

భూస్వామి వాణ్ణి తోటమాలిగా నియమించుకన్నాడు. ★

## జనరల్ నాలెడ్జ్

1. భారతదేశం అత్యధికంగా ఏ దేశంతో సరిహద్దును పంచుకుంటోంది?
2. భారతదేశంలో ప్రస్తుతం ఎన్ని రాష్ట్రాలున్నాయి?
3. ఇటీవల మహిళల టీ-20 క్రికెట్ వరల్డ్ కప్‌ను ఏ దేశం గెలుచుకుంది?

సమాధానాలు : 1. బంగ్లాదేశ్; 2. 28; 3. ఆస్ట్రేలియా

## మెదడుకు మేత

కుడితి తాగదు, మేత మేయదు.. కానీ కుండెడు పాలు ఇస్తుంది?

జవాబు : తాటిచెట్టు

## మంచిమాట

**అదృష్టం అందరి తలుపూ తట్టవచ్చు. కానీ ఆ పిలుపు వినగలిగిన నేర్పు కొందరికే ఉంటుంది.**



# వారఫలాలు

13-19 మార్చి 2023




సింహంభట్ల సుబ్బారావు

6300674054


**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

చేపట్టిన పనులు పూర్తి చేసేవరకూ విశ్రమించరు. అవసరాలకు సొమ్ము సమకూరుతుంది. వాహనాలు, భూములు కొంటారు. వ్యాపారులు పెట్టుబడులు సమకూర్చుకుంటారు. ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు లభిస్తాయి. కళాకారులు, క్రీడాకారులు, పరిశోధకులు అవార్డులు, రివార్డులు. 13,14 తేదీల్లో ప్రయాణాల్లో అవాంతరాలు. ఆరోగ్య సమస్యలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

ఆదాయం ఆశాజనకంగా ఉంటుంది. ముఖ్య కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. నిరుద్యోగులకు అరుదైన అవకాశాలు. ఆస్తి వివాదాల నుంచి బయటపడతారు. భాగస్వామ్య వ్యాపారాల్లో లాభాలు. ఉద్యోగవర్గాలకు ప్రమోషన్లు రావచ్చు. రాజకీయవేత్తలు, కళాకారులు, రచయితలకు శుభవార్తలు. 15, 16 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. బంధువులతో విభేదాలు. శివాష్టకం పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

అదనపు ఆదాయం సంతృప్తినిస్తుంది. ముఖ్య పనులు విజయవంతం. ఆస్తుల విషయంలో కొత్త అగ్రిమెంట్లు. నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు అందుతాయి. ఒక సమాచారం సంతోషం కలిగిస్తుంది. దేవాలయాలు సందర్శిస్తారు. వైద్యసలహాలు పొందుతారు. ఉద్యోగులకు అనుకోని హోదాలు. 12, 13 తేదీల్లో వృథా ఖర్చులు. ఆకస్మిక ప్రయాణాలు. శ్రీరామరక్షా స్తోత్రం పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

ఆదాయానికి లోటుండదు. ఆస్తుల విషయంలో ఇబ్బందులు, చికాకులు తొలగుతాయి. తరచూ తీర్థయాత్రలు చేస్తారు. బంధువులతో ఉత్తర ప్రత్యుత్తరాలు సాగిస్తారు. వ్యాపారాలలో లాభాలు. ఉద్యోగులకు ఉన్నత హోదాలు. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, రచయితల ఆశలు ఫలిస్తాయి. 14,15 తేదీల్లో వృథా ఖర్చులు. కుటుంబసమస్యలు. శారీరక రుగ్మతలు. లక్ష్మీస్తుతి మంచిది.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

ఆదాయం సమకూరుతుంది. కొన్ని వివాదాలు నేర్పుగా పరిష్క రించుకుంటారు. ఆలోచనలు తక్షణం అమలుచేస్తారు. స్థిరాస్తి విషయంలో కొద్దిపాటి చికాకులు ఎదురైనా అధిగమిస్తారు. వాహనాలు, ఆభరణాలు కొంటారు. వ్యాపారాలు లాభసాటి. ఉద్యోగులకు హోదాలు. పారిశ్రామికవేత్తలు, రచయితలకు అవకాశాలు. 17,18 తేదీల్లో అనారోగ్యం. దూరప్రయాణాలు. లక్ష్మీగణపతి స్తోత్రాలు పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

ఆదాయం సంతృప్తినిస్తుంది. కొన్ని సమస్యలు తీరి ఊరట చెందుతారు. నిరుద్యోగులు అంచనాలు నిజమవుతారు. వ్యాపారాలు మరింత లాభసాటిగా ఉంటాయి, భాగస్వాములతో వివాదాలు పరిష్కారమవుతాయి. ఉద్యోగాలలో గందరగోళం తొలగుతుంది. రాజకీయవేత్తలు, కళాకారులు, రచయితలకు శుభవార్తలు. 14,15 తేదీల్లో అనారోగ్యం, దూరప్రయాణాలు. నృసింహ స్తోత్రాలు పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

రాబడి కంటే ఖర్చులు పెరుగుతాయి. ఆకస్మిక ప్రయాణాలు సంభవం. నిరుద్యోగుల యత్నాలలో కొంత జాప్యం. ఇంటి నిర్మాణయత్నాలు మందగిస్తాయి. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యాపారులు ఆచితూచి వ్యవహరించాలి. ఉద్యోగస్తులకు విధుల్లో ప్రతిబంధకాలు, మార్పులు ఉండవచ్చు. 15,16 తేదీల్లో శుభవర్తమానాలు. ఆకస్మిక ధనలాభం.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

కొద్దిపాటి ఆరోగ్య సమస్యలు ఎదురై వైద్య సలహాలు స్వీకరిస్తారు. అదనపు ఆదాయం లభిస్తుంది. వాహనాలు, ఆభరణాలు సమకూర్చు కుంటారు. కొన్ని వివాదాల నుంచి గట్టెక్కుతారు. కోర్టు కేసులనుంచి విముక్తి. వ్యాపారాలు పుంజు కుంటాయి. ఉద్యోగులకు పనిభారాలు తగ్గుతాయి. పారిశ్రామికవేత్తలు యత్నాలు సఫలం. 17, 18 తేదీల్లో స్వల్పవివాదాలు. ఆదిత్య హృదయం పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

ఆశించిన ఆదాయం సమకూరుతుంది. నిరుద్యోగులకు శుభవార్తలు. వాహనాలు, భూములు కొంటారు. నేర్పుతో కొన్ని సమస్యల నుంచి బయటపడతారు. వ్యాపారాలలో ముందడుగు వేస్తారు. ఉద్యోగులకు సంతోషకర సమాచారం. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, రచయితలకు అవకాశాలు. 16, 17 తేదీల్లో వృథా ఖర్చులు, స్నేహితులతో తగాదాలు. నవగ్రహ స్తోత్రాలు పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

రావలసిన సొమ్ము సమయానికి అందుతుంది. విద్యార్థులకు విదేశీ విద్యావకాశాలు. ఇంట్లో శుభకార్యాలపై చర్చలు. ఆస్తి వివాదాలు తీరతాయి. వాహన, గృహయోగాలు. వ్యాపారాల్లో రాణిస్తారు. ఉద్యోగులకు ఉన్నత పోస్టులు రావచ్చు. పారిశ్రామిక, రాజకీయవేత్తలు, పరిశోధకులకు పట్టింది బంగారమే. 17,18 తేదీల్లో వివాదాలు. శారీరక రుగ్మతలు. శ్రీకృష్ణ స్తోత్రాలు పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

విద్యార్థులు కోరుకున్న అవకాశాలు సాధిస్తారు. భూముల కొనుగోలులో ఆటంకాలు తొలగుతాయి. వాహనసౌఖ్యం. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారాలలో లాభాలు అందుతాయి, పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగస్తులకు కొత్త హోదాలు దక్కుతాయి. పారిశ్రామిక, రాజకీయవేత్తలు, రచయితలకు అవకాశాలు అప్రయత్నంగా దక్కుతాయి. 15, 16 తేదీల్లో బంధు విరోధాలు. అనారోగ్య సూచనలు.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

ఆదాయం సంతృప్తినిస్తుంది. చేపట్టిన పనులు సజావుగా పూర్తి. భూములు, వాహనాలు కొంటారు. మీ నిర్ణయాలతో కుటుంబసభ్యులు ఏకీభవిస్తారు. ఉద్యోగార్థుల కృషి ఫలిస్తుంది. ఉద్యోగస్తులకు విధి నిర్వహణలో అవాంతరాలు తొలగుతాయి. రాజకీయవేత్తలు అనుకున్నది సాధిస్తారు. ఉద్యోగ స్తులకు విధి నిర్వహణలో అవాంతరాలు తొలగుతాయి. 12, 13తేదీల్లో అనుకోని ప్రయాణాలు. కుటుంబంలో ఒత్తిళ్లు. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.

# పదరసం-407

## ఆధారాలు

**అడ్డం**

1. అమ్మదగిన వస్తువు, దినుసు (3)
3. పవిత్ర జంతువు (2)
4. యముని వెంటబడి పతి ప్రాణం దక్కించుకున్నది (3)
6. ప్రణయం (3)
7. పేకల్లోని ముక్క, నేతపనిలో పడుగుదారము కూర్చుటకు వాడేది (2)
8. నాటక వేదిక (4)
10. హిట్లర్ ఇట్టివాడే! (3)
12. కోలాహలంలో ఓ సినీశృంగార నటి (2)
14. మునిమాణిక్యం, రావూరి భరద్వాజల సాహిత్య పాత్ర కూడాను! (2)
15. ఈ లడ్డూకే ప్రసిద్ధి ఎక్కువ (4)
18. స్వప్నం(2)
20. ఓ చర్మ వాద్యం (3)
22. అటుగా మంగళ ప్రదము, మేలు (3)
24. వాలి భార్య (2)
27. చివరకు వేయని మునక (2)
28. ఆగ్రహము (2)
30. వారాంతపు ఒకప్పటి బజారు (2)
32. పై నుండి జలం పడే ఓ రీతి (2)
34. భోజనపాత్ర (2)
36. వణుకు (2)
38. మునిగిపోయిన వాడు (3)
39. నేత్రము (2)
40. భారము (3)

**నిలువు**

1. పొడుగు జడ అని భ్రమపెట్టగలది (3)
2. భూమి (4)
3. గుడిపై భాగాన వుండేది (3)
4. చెదిరిన సాహసులం (4)
5. శివుని ఆయుధం(3)
7. ప్రయత్నము (2)
9. తిరగబడిన పడగ (3)
10. పిఱుందు, జఘనము (4)
11. సమూహము (2)
13. రావణపురి (2)
14. స్త్రీ (2)
16. సుగ్రీవుని భార్య (2)
17. ఎత్తయిన ప్రదేశం, దిబ్బ (2)
19. సిగ్గు(2)
21. వ్యాపారి అభిలషించేది (3)
23. కుక్క (2)
25. చారు (2)
26. నరేంద్రమోదీగారి పదవి (3)
29. బురద (2)
31. శరీరము (3)
33. లక్ష్మి(2)
35. బాహుమూలము (2)
37. చర్మ వాద్యం, ఏకినపుడు విడువబడిన దూది (2)

మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | ✠ | 3 | | ✠ | 4 | | 5 |
| | ✠ | 6 | | | ✠ | 7 | | ✠ | |
| | ✠ | | ✠ | 8 | 9 | | | ✠ | |
| ✠ | 10 | | 11 | ✠ | | ✠ | 12 | 13 | ✠ |
| 14 | | ✠ | 15 | 16 | | 17 | ✠ | 18 | 19 |
| 20 | | 21 | ✠ | | ✠ | | ✠ | ✠ | |
| ✠ | 22 | | 23 | ✠ | ✠ | ✠ | 24 | 25 | ✠ |
| 26 | ✠ | 27 | | ✠ | 28 | 29 | ✠ | 30 | 31 |
| 32 | 33 | ✠ | 34 | 35 | ✠ | 36 | 37 | ✠ | |
| 38 | | | ✠ | 39 | | ✠ | 40 | | |

**పదరసం – 407**

పేరు : ..........................................................................................

చిరునామా:.......................................................................................

.........................................................................................................

పిన్‌కోడ్ : .................. మొబైల్ : .................................................

**సమాధానాలను** పైగడులలో పూరించి, కత్తిరించి కవర్‌పై పదరసం నెం. వేసి 2023 మార్చి 27 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

## పదరసం - 403 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | 1 శి | వ | 2 రా | 3 త్రి | 4 త | 5 ల | పా | ✠ | 6 గ |
| 7 అ | ✠ | గ్గ | ✠ | నే | ✠ | ✠ | యం | ✠ | కం |
| 8 భి | పా | ✠ | 9 మి | త్రు | రా | 10 లు | ✠ | 11 శాం | తి |
| షే | ✠ | 12 ఉ | ✠ | డు | ✠ | 13 క | వ్వం | ✠ | క |
| కం | 14 తు | డు | ✠ | ✠ | ✠ | లు | 15 ✠ | రుం | 16 ✠ |
| 17 ✠ | ని | వు | ణ | 18 ✠ | నౌ | 19 క | ✠ | జ | డ |
| 20 క్రై | ✠ | లు | 21 ✠ | ✠ | ✠ | లు | లి | ✠ | మ |
| లా | స్యం | 22 ✠ | పా | ర్వ | తి | ✠ | ✠ | 23 గో | రు |
| 24 స | ✠ | గం | ✠ | 25 ✠ | 26 ల | ✠ | 27 వే | ✠ | 28 కం |
| ము | రు | 29 గ | న్ | ✠ | 30 కం | కా | ళ | ము | ✠ |

పాఠకుల నుండి సరైన సమాధానాలు రానందున 403– విజేతను ప్రకటించలేక పోతున్నాం.


కేంద్ర ప్రభుత్వం సమన్వయంతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి
P.V.N. MADHAV
గారికే ఓటు వేయ్యండి
పోలింగ్ తేది. 13-03-2023
ఉదయం 8 గం॥ల నుండి 6 గం॥ల వరకు
MADHAV FOR MLC
1
మీ మొదట ప్రాధన్యత '1' ఓటును బిజెపి అభ్యర్థి
పి.వి.ఎన్ మాధవ్ గారికి వేసి
గెలిపించవలసిందిగా కోరుచున్నాము
MISSED CALL NO
78387 66604
TIME FOR CONTINUED SUPPORT
TIME FOR DEVELOPMENT



## మండలిలో మన గళం వినిపిద్దాం
## మన ఆశయాలను సాధిద్దాం...

**ఓ పట్టభద్రులారా....**

**రాయలసీమ సమగ్ర అభివృద్ధి బిజెపితోనే సాధ్యం.**

ప్రియమైన పట్టభద్ర మిత్రులారా!

రాఘవేంద్ర నగరూరు అనే నేను B.Com, MBA, LL.B న్యాయశాస్త్ర విద్యను అభ్యసించి న్యాయవాదిగా, వ్యాపారవేత్తగా మీ అందరికీ సుపరిచితుడిని.నేను విద్యార్థి దశనుంచే చురుకుగా విద్యను అభ్యసిస్తూ, అందరితో కలిసి మెలిసి మంచి నాయకత్వ లక్షణాలు కలిగి ఉన్నాను. సేవా దృక్పథంతో ఛాంబర్ ఆఫ్ కామర్స్, లయన్స్ క్లబ్, CREDAI మరియు ఇతరత్ర సేవా సంస్థల సేవా కార్యక్రమాలలో పాల్గొంటూ ముఖ్యంగా మా తండ్రి సుబ్రహ్మణ్యం నగరూరు గారి చారిటబుల్ ట్రస్టు ద్వారా పేద విద్యార్థులకు పుస్తకాలు, ఆటవస్తువులు మరియు వారికి చేయూత నిచ్చి ప్రోత్సహిస్తున్నాను. అదే విధంగా నిరుద్యోగ యువతకు శిక్షణనిచ్చి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ అందరి మన్ననలు పొంది మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించాను.

ప్రపంచలో అతిపెద్ద రాజకీయ పార్టీ అయిన భారతీయ జనతా పార్టీ (BJP) సిద్ధాంతం పట్ల ఆకర్షితుడినై, భారతదేశ ప్రధాని **గౌ॥ శ్రీ నరేంద్ర మోడీ నాయకత్వంలో** వారి ఆశయాల మేరకు నావంతు పాత్ర వహిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికై కృషి చేస్తున్నాను. ఇప్పుడు మీ అందరి చేరువకు చేరి మన ప్రాంత అభివృద్ధి మరియు మన అందరి సంక్షేమ అభివృద్ధి కాంక్షిస్తూ మీ అందరి ఆశీస్సులతో మార్చి 13న జరగనున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ MLC ఎన్నికలలో పోటీ చేస్తున్నాను.

కావున రాఘవేంద్ర నగరూరు అనేనాకు మీ మొదటి ప్రాధాన్యత (1) ఓటును వేసి, వేయించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రార్థిస్తున్నాను.



పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల శాసమండలి నియోజకవర్గం

(ఉమ్మడి కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలు)

**పట్టభద్రుల M.L.C. అభ్యర్థి**

**రాఘవేంద్ర నగరూరు గారికి**

B.Com, LL.B.,

మీ మొదటి ప్రాధాన్యత (1) ఓటును వేసి గెలిపించ ప్రార్థన

**పోలింగ్ తేది :**
**13-03-2023**

**సమయం :**
ఉ॥ 8.00 గం॥ల నుండి
సా॥ 4.00 గం॥ల వరకు

మీ మద్దతు కోసం దయచేసి
**99532 10054** కు మిస్డ్ కాల్ ఇవ్వండి

**భారతీయ జనతా పార్టీ - ఆంధ్ర ప్రదేశ్**

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023; RNI Regd. No. 3270/57.
Volume : 75 Issue : 21

